

చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



చైనాతో కుదరని ఒప్పందం

ప్రపంచ దేశాలతో ట్రంప్ 'టారిఫ్ యుద్ధం' మరోదశ

ఎన్నో సవాళ్లు అధిగమించాం..

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 242 | శనివారం | 2-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# గొర్రెల పథకంలో ₹1000 కోట్ల కుంభకోణం



- మాజీమంత్రి తలసాని ఓఎస్‌డి ఇంటిపై ఇడి దాడుల్లో వెలుగుచూసిన వైనం
- 200 నకిలీ బ్యాంక్ ఖాతాలు స్వాధీనం
- వేలాది నకిలీ రసీదులు లభ్యం
- లబ్ధిదారులకు వెళ్లాల్సిన నిధులు ప్రైవేట్ వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు ఇడి ప్రకటన
- అసలు గొర్రెలు కొనుగోలు లేదా విక్రయాలే జరగలేదని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

గత ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ పథకంలో రూ.1000 కోట్ల కుంభకోణం జరిగినట్లు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు శుక్రవారం ప్రకటించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వద్ద ఒఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్‌కుమార్ ఇంటిపై దాడి చేసిన సమయంలో ఈ విషయం బహిర్గతమైనట్లు ఇడి పేర్కొంది.ఈ దాడిలో కళ్యాణ్ ఇంట్లో 200 నకిలీ బ్యాంక్ ఖాతాలను కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు కూడా తెలిపింది. సోదాల అనంతరం 31 మొబైల్ ఫోన్లు, 20 సిమ్ కార్డ్స్ సీజ్ చేసినట్లు వెల్లడించింది. ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లోనూ ఈ బ్యాంక్ ఖాతాలను ఉపయోగించారని విచారణలో తెలినట్లు వెల్లడించారు. గత బిఆర్‌ఎస్ సర్కార్ హయాంలో జరిగిన మరో అవినీతి బట్టబయలు అయ్యింది. మాజీ సిఎం కెసిఆర్ అమలు చేసిన గొర్రెల పంపిణీ స్కాంలో భారీ అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఈ కుంభకోణంలో కోట్లాది రూపాయల అక్రమాలు తరువాయి 2లో



# సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

- ఈనెల 7న నోటిఫికేషన్
- 21వరకు నామినేషన్ పత్రాల దాఖలుకు గడువు

**న్యూఢిల్లీ :** ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసంది. సెప్టెంబర్ 9న ఎన్నికల నిర్వహించనున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఈనెల 7వ తేదీన నోటిఫికేషన్ జారీ కానుంది. నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఆగస్టు 21న తుది గడువు విధించింది. ఒక వేళ ఎన్నిక ఏకగ్రీవం తరువాయి 2లో

# ఎస్ఐఆర్‌పై చర్చకు తేదీ ఖరారు చేయండి

## లోక్‌సభ స్పీకర్ బిర్లాకు ప్రతిపక్ష ఎంపిలు లేఖ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సహా పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులు శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణపై మరింత ఆలస్యం చేయకుండా ప్రత్యేక చర్చకు తేదీ ఖరారు చేయాలని కోరారు. బిర్లాకు రాసిన లేఖలో ముఖ్యంగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్ష ఎంపిలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లేఖపై సంతకం చేసిన వారిలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు గాంధీ, సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, డిఎంకె టిఆర్ బాలు, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సులే, ఆర్‌ఎస్‌పి నేత ఎన్‌కె ప్రేమచంద్రన్, ఎస్‌పి ఎంపి లాల్జీ వర్మ, టిఎంసి నేత కాకోలి ఘోష్ దస్తీదార్, శివసేన (యుబిటి) నాయకుడు అరవింద్ సావంత్, ఆర్‌జెడి ఎంపి అభయ్ కుమార్ ఉన్నారు. వివిధ ప్రతిపక్ష పార్టీలకు ప్రాతినిధ్యం తరువాయి 12లో




- అది పేలినప్పుడు దాక్కోవడానికి దేశంలో ఎక్కడా స్థలం దొరకదు
- ఎన్నికల సంఘం బిజెపికి 'ఓటు చోరీ' చేసినట్లు రుజువులున్నాయ్
- ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ

# ఇసిపై మా వద్ద ఆటంబాంబు ఉంది

**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం బిజెపికి 'ఓటు చోరీ' చేసిందని నిరూపించడానికి తమ పార్టీ వద్ద 'ఆటం బాంబు' వంటి ఆధారాలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అది పేలినప్పుడు పోల్ ప్యానెల్ దాక్కోవడానికి దేశంలో ఎక్కడా స్థలం ఉండదని ఎద్దేవా చేశారు. ఓటు చోరీకి పాల్పడి ఎన్నికల సంఘంలో ఉన్న వారందరూ రాజద్రోహానికి పాల్పడ్డారని, వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు నెల రోజుల పాటు జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిన తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించడంతో రాహుల్‌గాంధీ స్పందించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఓటర్ల హక్కును తొలగించడమే లక్ష్యంగా ఇసి చేపట్టిన ఈ చర్యను ప్రతిపక్షం పార్లమెంటు ఉభయ సభలలో నిరసన వ్యక్తం చేస్తోంది. ఈ అంశంపై ఉభయ సభలలో చర్చ జరగాలని డిమాండ్ చేస్తోంది. ఈ విషయమై రాహుల్‌ను ప్రశ్నించగా, ఓటు చోరీ జరుగుతోందని తాను చెప్పానని, ఇప్పుడు 'ఓటు చోరీ'లో ఎన్నికల కమిషన్‌కు ప్రమేయం ఉందని తమ వద్ద బహిరంగంగా, అంతర్గతంగా ఆధారాలు ఉన్నాయని శుక్రవారం పార్లమెంట్ హౌస్ తరువాయి 12లో

# ట్రంప్ బెదిరింపులకు లొంగొద్దు: సిపిఐ



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతుంటే మోదీ ప్రభుత్వం ఎందుకు అడ్డు చెప్పడం లేదని సిపిఐ ప్రశ్నించింది. ట్రంప్ బెదిరింపులకు లొంగవద్దని సర్కారుకు హితవు పలికింది. రష్యా వంటి దేశాలతో వాణిజ్యం, సహకారం కోసం సార్వభౌమ హక్కు భారత్‌కు ఉందని అమెరికాకు స్పష్టం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం సూచించింది. అమెరికా జోక్యాన్ని, బెదిరింపు ధోరణిని తిరస్కరించాలని, ఏదేని తరువాయి 2లో



# కొన్ని పత్రికలతో జర్నలిస్టుల ప్రతిష్ఠకు దెబ్బ

## అసలైన జర్నలిస్టులను వేరు చేయాల్సిన అవసరం ఉంది : సిఎం రేవంత్‌రెడ్డి

### తప్పు చేసిన వారిని కమ్యూనిస్టులు అధికారం నుంచి దించుతారు

'రాజకీయ పార్టీలను అధికారంలోకి తీసుకురావడానికి కమ్యూనిస్టు పార్టీలు ఎంత వరకు ఉపయోగపడతాయనేది తాను విశ్లేషించలేనని, కానీ తప్పు చేసిన వారిని మాత్రం అధికారం నుంచి దింపడానికి (అధికారంలో ఉన్న పార్టీని ఓడించేందుకు ) మాత్రం పనికి వస్తాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఎంతో ఉపయోగపడ్డాయి. 2004లో, 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులే కారణం. వారి సహకారం ఎంతో ఉంది. భవిష్యత్‌లో కూడా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య సహకారం ఇలాగే కొనసాగాలి. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పని చేస్తే ప్రజలకు మరింత ప్రయోజనం జరుగుతుంది. ప్రజా సమస్యలపై పోరాటంలో ఎర్రజెండా కనిపించినప్పుడే ఆ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.'

— సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

"పత్రికా వ్యవస్థను నిర్వీరం చేసే కుట్ర కోణంలో భాగమో, ఏమో తెలియదు. కానీ కొన్ని రాజకియ పార్టీల పత్రికల వల్ల మాత్రం రాజకీయ నాయకుల తరహాలోనే జర్నలిస్టుల విశ్వసనీయత కూడా వేగంగా తగ్గుతోంది'' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ముసుగు వేసుకున్న వారిని, అసలైన జర్నలిస్టులను వేర్వేరు చేయాల్సిన అవసరం ఉన్నదని, లేదంటే దేశ భద్రతకే ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని, అందుకే జర్నలిస్టులు దీనికి ఒక లక్ష్మణ రేఖ గీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. స్వతంత్ర సంగ్రామ కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపి,అందరినీ ఒక వేదికపైకి తీసుకు రావడంలో పత్రికలు అపారమైన కృషి చేశాయని కొనియాడారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన 'నవ తెలంగాణ దినపత్రిక' 10వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా సిఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో వామపక్ష రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను, భావజాలాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పత్రికలు పెడితే, ప్రస్తుతం కొన్ని రాజకీయ పార్టీలు తరువాయి 2లో

# కమ్యూనిస్టుల ప్రతిపాదనలతో రాజ్యాంగంలో అనేక చట్టాలు

- కమ్యూనిస్టులు లేకపోతే పేదలకు ఏ చట్టమూ లేదు
- పేదోడి ఆనందమే పార్టీకి అధికారం
- నాగర్‌కర్నూల్ జిల్లా తృతీయ మహాసభల్లో కూనంనేని, చాడ ఉద్ఘాటన




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్

కమ్యూనిస్టుల ప్రతిపాదనలతోనే రాజ్యాంగంలో అనేకచట్టాలు పొందుపర్చారని, కమ్యూనిస్టులు లేకపోతే పేదలకు ఏ చట్టం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గుర్తుచేశారు. సమాజానికి మార్గం చూపించే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. దోపిడీ దారులకు ఎర్రజెండా అంటే వణుకు అని, ప్రశ్నించేవారందరూ కమ్యూనిస్టులే అన్నారు. శుక్రవారం సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా తృతీయ మహాసభలు జరిగాయి. మహాసభలలో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని గచ్చుబావినుండి వ్యవసాయమార్కెట్ యార్డు ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభల్లో కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడవెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మాలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం బాల్‌నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో కూనంనేని మాట్లాడుతూ త్యాగాలతో ఎర్రజెండా పుట్టిందని, ఎర్రజెండాను అంతంచేస్తామని కొందరు మాట్లాడుతున్నారని అది వారితరం కాదన్నారు. వందేళ్లు పూర్తిచేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ ఒక్కటే అన్నారు. పోరాటాలు, త్యాగాలు ప్రజలకోసం కొట్లాడి తరువాయి 12లో



కాళేశ్వరం కమిషన్ నివేదిక

# అధ్యయనానికి ఉన్నతస్థాయి కమిటీ

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికను అధ్యయనం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. కమిటీలో రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, జిఎడి కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదికను అధ్యయనం తరువాయి 2లో

# యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఒకటవ యూనిట్ జాతికి అంకితం




- డిసెంబర్ నాటికి అన్ని యూనిట్లు పూర్తి
- వచ్చే జనవరి నుండి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు
- ఇదివరకే రూపొందించిన క్యాలెండర్‌ను తు.చ తప్పక పాటించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రజా పక్షం/నల్లగొండ

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం, వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్లో 800 మెగా వాట్ల విద్యుత్ సామర్థం కలిగిన స్టేజ్ 1లోని ఒకటవ యూనిట్ జాతికి అంకితం చేశారు. ఈ డిసెంబర్ చివరి నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని అన్ని యూనిట్లను పూర్తిచేసి వచ్చే జనవరి నుండి పూర్తిస్థాయిలో విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఇదివరకే రూపొందించిన క్యాలెండర్ ను తూ.చా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం దామరచర్ల మండలం, వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 970 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలసి మంత్రి భట్టి విక్రమార్క మల్లు శంకుస్థాపన చేశారు. అలాగే వనమహోత్సవం కింద మొక్కలు నాటారు. అనంతరం వైటిపిఎస్ తరువాయి 2లో

# మావోయిస్టు నేత హిడ్మా లొంగుబాటు?

## సోషల్ మీడియాలో వార్త వైరల్

ప్రజాపక్ష/హైదరాబాద్



సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యుడు మాడవి హిడ్మా స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) అధికారుల ముందు లొంగిపోయినట్లు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే ఈ విషయాన్ని మాత్రం ఎస్ఐబి అధికారులు కొట్టిపారేసారు. మరోపక్క హిడ్మాపై మావోయిస్టు పార్టీ ఎలాంటి ప్రకటన కూడా చేయలేదు. కేంద్ర ప్రభుత్వ జరుపుతున్న కగార్ ఆపరేషన్‌లో భాగంగా పోలీసు బలగాలు హిడ్మా ఆపరేషన్ మొదలుపెట్టారు. ఇటీవలే అతను కర్రెగుట్టలో తల దాచుకున్నాడనే అనుమానంతో 12000 మంది కేంద్ర, తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చైనాతో కుదరని ఒప్పందం




**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడిగా తొలిసారి ఎన్నికైనప్పుడు చైనాతో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిన డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు రెండో సారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత తన పాత వైఖరినే కొనసాగిస్తున్నారు. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై భారీ టారిఫ్‌లను ప్రకటించారు. పెంచిన సుంకాలు ఈనెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయంటూ చైనాకు అమెరికా డెడ్‌లైన్ విధించింది. ఈలోగా వాణిజ్యపరమైన చర్చలు జరిగి, ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించింది. అయితే, ఇప్పటి వరకూ ఈ రెండు దేశాల మధ్య ఎలాంటి వాణిజ్య ఒప్పందం కుదరలేదు. పూర్తి స్థాయి ఒప్పందానికి కొంత సమయం పడుతుందని, ట్రంప్ ఆమోదముద్ర కూడా వేయాల్సి ఉందని వైట్‌హౌస్ వెల్లడించింది. కాగా, ఈ వారం స్టాక్‌హోం వేదికగా జరిగిన చర్చల్లో చైనా చేసిన డిమాండ్లను, ప్రతిపాదనలను అమెరికా వ్యతిరేకించినట్టు సమాచారం. కాబట్టి, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎప్పుడు, ఏ విధంగా జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# ప్రపంచ దేశాలతో ట్రంప్ 'టారిఫ్ యుద్ధం' మరోదశ




**వాషింగ్టన్:** అత్యంత సన్నిహితమైన లేదా విధేయత ప్రకటించే దేశాలను మినహాయించి, ప్రపంచ దేశాలపై భారీ సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ఈనెల 7వ తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా కొత్త టారిఫ్ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. కనీసంగా 10 శాతం, అత్యధికంగా 41 శాతం సుంకాల విధింపుపై ప్రపంచ దేశాలు తీవ్రంగా స్పందించాయి. కాగా, స్టాక్ మార్కెట్ శుక్రవారం తీవ్రమైన ఒడిదుడుకులు ఎదుర్కొంది. సిరియాపై అత్యధికంగా 41 శాతం సుంకాలను విధించడం గమనార్హం. అంతర్యుద్ధంతో నలిగిపోతున్న సిరియా, ఇప్పుడు అమెరికా విధిస్తున్న భారీ సుంకాలతో ఆర్థికంగా మరింతగా దిగజారే ప్రమాదం ఉంది. ఉగ్రవాదానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్తున్నప్పటికీ, ఇజ్రాయెల్‌కు కొమ్ముకాసే క్రమంలోనే సిరియాను పాదాక్రాంతం చేసుకోవాలన్నదే అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నదన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఇలావుంటే, బ్రెజిల్‌పై 40 శాతం సుంకాలు విధించడం కూడా ప్రతీకార చర్యల్లో భాగంగానే పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే బ్రెజిల్‌పై అమలవుతున్న పది శాతం సుంకానికి ఇది అదనం. ప్రపంచ వ్యాప్తంగా 69 దేశాలపై పెంచిన కొత్త టారిఫ్ అమలవుతుంది. కాగా, అమెరికా అత్యధిక సుంకాలు విధించిన దేశాలలో సిరియా 41 శాతం, స్విట్జర్లాండ్ 39 శాతం, లావోస్, మయన్మార్ 40 శాతం, ఇరాక్, సెర్బియా 35 శాతం, లిబియా, అల్జీరియా 30 శాతం ఉన్నాయి. ఈ జాబితాలో లేని దేశాల నుంచి దిగుమతయ్యే దేశాల నుంచి దిగుమతయ్యే వస్తువులపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్టు ట్రంప్ కొత్త ఉత్తర్వులో స్పష్టంగా ఉంది. వాణిజ్య లోటు కారణంగా టారిఫ్‌లు పెంచుతున్నట్టు వైట్ హౌస్ అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికే కుదిరిన వాణిజ్య ఒప్పందాల మేరకు కొన్ని దేశాలపై సుంకాల్లో మార్పులు చేసినట్టు వివరించాయి. ట్రంప్ నిర్ణయంతో చాలా దేశాలు ఇప్పుడు భారీ సుంకాల బారిన పడబోతున్నాయి. మరి కొన్ని చివరి క్షణంలో చర్చలు జరపడం ద్వారా సుంకాల బారీ నుండి తప్పించుకున్నాయి. యూరోపియన్ యూనియన్ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. ఇప్పటికే 15 శాతం కంటే ఎక్కువ సుంకం ఉన్న వస్తువులపై కొత్త పన్ను విధించబడదు. మిగిలిన వస్తువులపై కొద్దిగా మారిన సుంకాలు విధించబడతాయి. ఈ జాబితాలో పేర్లు లేని దేశాలకు 10 శాతం సాధారణ పన్ను నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 దేశాలు అమెరికా వాణిజ్య, సుంకాల బృందాన్ని సంప్రదించాయని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ చెప్పారు. అమెరికా ప్రస్తుతం తన ప్రధాన వాణిజ్య భాగస్వాములకు ప్రాధాన్యత ఇస్తోందని, వీలైనన్ని ఎక్కువ దేశాలతో చర్చలు జరపడానికి బృందం పగలు, రాత్రి పనిచేస్తోందని ఆమె చెప్పారు. ఏదైనా దేశం నుండి ఇంకా ఎటువంటి స్పందన రాకపోతే, ఈ రాత్రి నాటికి వారికి ఆర్డర్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు. ఇలావుంటే, మెక్సికోకు ఒక పెద్ద ఉపశమనం కలిగింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మెక్సికో కొత్త అధ్యక్షురాలు క్లాడియా షెన్‌బామ్ గురువారం ఉదయం ఫోన్‌లో మాట్లాడారు. దీని తర్వాత, అమెరికా మెక్సికోకు 90 రోజుల వాయిదా ఇచ్చింది.



మెక్సికో నుండి వచ్చే వస్తువులపై అమెరికా 25 శాతం సుంకం విధించింది. ట్రంప్ ప్రభుత్వం ఈ పన్నును 30 శాతంకి పెంచాలని యోచిస్తోంది. చర్చల తరువాత ఇప్పుడు 30 శాతం పన్ను విధింపును ట్రంప్ వాయిదా వేశారు. దీనితో ప్రస్తుతానికి 25 శాతం పన్ను కొనసాగుతుంది. చర్చల ద్వారా శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవడానికి మెక్సికోకు ఇప్పుడు 90 రోజుల సమయం ఉంటుంది.

### కెనడాపై వెక్కు తగ్గని అమెరికా

మిత్ర దేశమైన కెనడాపైన కూడా అమెరికా వెనక్కు తగ్గలేదు. టారిఫ్‌ను 25 నుంచి 35 శాతానికి పెంచుతూ కొత్త ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేయడం ఆశ్చర్యకర పరిణామం. ఔషధాల అక్రమ దందాకు కెనడా అడ్డుకట్టవేయలేకపోవడం, అమెరికాపై ప్రతీకార చర్యలకు దిగడం తదితర కారణాలతో కెనడాపై సుంకాన్ని పెంచినట్టు వైట్ హౌస్ నుంచి వెలువడిన ప్రకటన స్పష్టం చేసింది. ఈనెల 7 లోపు వాణిజ్య నౌకల్లోకి చేర్చిన వస్తువులు అక్టోబర్ 5లోపు అమెరికాకు చేరితే, కొత్త సుంకాల నుంచి మినహాయింపు ఉంటుంది. ఆ తరువాత దిగుమతి అయ్యే వస్తువులపై కొత్త సుంకాలు అమలవుతాయి. కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ ఇది వరకు సూచించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఘర్షణపూర్వక వాతావరణం కొనసాగుతున్నది. చర్చలకు తాము సిద్ధమని, అయితే, అమెరికా చేస్తున్న ప్రతిపాదనలు ఏకపక్షంగా ఉన్నాయని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నే వ్యాఖ్యానించారు. ట్రంప్ విధించిన కొత్త టారిఫ్‌పై ఆయన స్పందిస్తూ, అమెరికా చేస్తున్న ప్రతిపాదనలు తమ దేశానికి ఏమాత్రం అనుకూలంగా లేవని పేర్కొన్నారు. కలప, స్టీల్, అల్యూమినియం, ఆటోమొబైల్ తదితర రంగాలు ఈ కొత్త సుంకాల కారణంగా భారీగా ప్రభావితమవుతాయని ఆయన అన్నారు. అయితే, నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించే రీతిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఇలావుంటే, టారిఫ్‌ను పెంచనున్నట్టు వారం రోజుల క్రితమే కెనడాకు ట్రంప్ లేఖ రాశారు. చర్చలు జరిపేలోపే టారిఫ్‌ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.



## ఎన్నో సవాళ్లు అధిగమించాం..
### అమెరికాతో భాగస్వామ్యంపై భారత్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** అమెరికాతో ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, స్థిరంగా కొనసాగుతున్నదని భారత్ వ్యాఖ్యానించింది. భారత ఆర్థిక వ్యవస్థ 'చనిపోయింది' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకాలు విధించడాన్ని కూడా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియా సమావేశంలో ప్రస్తావించారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఎన్నో మార్పులను చూసిందని, సవాళ్లను ఎదుర్కొందని ఆయన వ్యాఖ్యానించారు. ఉమ్మడి ఆసక్తులు, ప్రజాస్వామ్య విలువలతోపాటు, ఇరు దేశాల ప్రజా సంబంధాల్లోనూ రెండు దేశాలు పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాయని అన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న కీలక అంశాలపై దృష్టి సారిస్తున్నామని, ఈ సంబంధం మరింత బలంగా ముందుకు సాగుతుందని విశ్వసిస్తున్నామని జైస్వాల్ అన్నారు. భారత్—అమెరికా రక్షణ సంబంధాలపై అడిగినప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, రెండు దేశాలు గత కొన్ని సంవత్సరాలుగా బలమైన రక్షణ భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్నాయని అన్నారు. ఈ భాగస్వామ్యం మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, 25 శాతం టారిఫ్‌పై చర్చలు, సంప్రదింపులపై ఆయన ఎలాంటి వివరాలు అందించలేదు.

# భారత్‌పై 25 శాతం..



**వాషింగ్టన్:** భారత్‌పై గతంలో అమెరికా పెంచిన పన్నులు శుక్రవారం నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చాయి. అగ్రరాజ్యంతో చర్చలు జరుపుతామని ప్రకటించిన భారత ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన చర్యలపై ఎలాంటి స్పష్టత లేదు. ఇలావుంటే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 7 నుంచి అమల్లోకి వచ్చే కొత్త టారిఫ్ జాబితాను విడుదల చేశారు. అందులో భారత్ నుంచి దిగుమతి చేసుకొనే కొన్ని వస్తువులపై సుంకాలను 25 శాతం పెంచారు. అమెరికాకు చెందిన వ్యవసాయ సంస్థలకు భారత్ సరైన అవకాశం ఇవ్వడం లేదన్నది ట్రంప్ విమర్శ. పైగా రష్యా నుంచి చమురు కొనుగోలును తగ్గించడం లేదని ఆయన ఆరోపిస్తున్నారు. కాగా, రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు విధిస్తామన్న 'పెనాల్టీ'పై ట్రంప్ తాజా ప్రకటన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఉక్రేన్‌తో యుద్ధానికి దిగిన రష్యాపై ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రకటించిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరపరాదన్నది అందులోని కీలకాంశాల్లో ఒకటి. అయితే, ఆంక్షలను, హెచ్చరికలను పట్టించుకోకుండా రష్యా నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకోవడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. అందుకే, టారిఫ్‌ను భారీగా పెంచింది. వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరపడానికి ఈనెల 25న అమెరికన్ వ్యాపార ప్రతినిధుల బృందం న్యూఢిల్లీని సందర్శిస్తుందని భారత ప్రభుత్వం తెలిపిన 24 గంటలు కూడా ముగియకముందే, అమెరికా కొత్త టారిఫ్‌లోనూ భారత్ పేరును చేర్చడం గమనార్హం. ట్రంప్ ప్రకటన తర్వాత, భారత్‌పై తీవ్ర ఆర్థిక ఒత్తిడి తప్పదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. పాకిస్తాన్ టారిఫ్‌ను 29 నుంచి 19 శాతానికి తగ్గించిన ట్రంప్, భారత్ విషయంలో ఎందుకు కఠినంగా వ్యవహరిస్తున్నారన్నది ప్రశ్న.

# అమెరికా ఒత్తిడికి లొంగకండి

### దేశ ప్రయోజనాలు కాపాడండి
### మోదీ సర్కార్‌కు ఆర్ఎస్ఎస్ అనుబంధ ఎస్‌జెఎం సూచన

**న్యూఢిల్లీ:** భారత మార్కెట్లలోని సున్నితమైన రంగాలలోకి ప్రవేశించడానికి అమెరికా 'బలవంతపు వ్యూహాలు' అని, దాని ఒత్తిడికి లొంగవద్దని సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ శుక్రవారం మోదీ ప్రభుత్వానికి సూచించింది. జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి దృఢంగా ఉండాలని కోరింది. రక్షణ ఉత్పత్తిలో స్వావలంబనను బలోపేతం చేయడానికి, దేశీయ ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి అవసరమైన అత్యంత పోటీ ధరలకు ముడి చమురు పొందేందుకు భారత దేశ సార్వభౌమ హక్కు బాహ్య ఒత్తిడికి గురికాకూడదని ఎస్‌జెఎం జాతీయ సహ కన్వీనర్ అశ్వనీ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో రాయితీలు తగ్గడం, మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయవద్దని ట్రంప్ హెచ్చరించడంతో భారత ప్రభుత్వ శుద్ధి కర్మాగారాలు గతవారంలో రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేసినట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ గురువారం తెలిపింది. 'బలవంతపు వ్యూహాలు' భారతదేశ నిర్ణయాలను తిప్పికొట్టగలవని వాషింగ్టన్ విశ్వసిస్తే... నేటి భారతదేశం దశాబ్దం క్రితం నాటి భారతదేశం కాదని గుర్తించాలని మహాజన్ అన్నారు. 'భారత ప్రభుత్వం తన దృఢమైన వైఖరి కొనసాగించాలని, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి, నిజంగా బహుళధ్రువ, సమానమైన ప్రపంచ వాణిజ్య క్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి 'ఆత్మనిర్భర్ భారత్' వైపు నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి ఈ క్షణాన్ని ఉపయోగించుకోవాలని ఎస్‌జేఎం కోరుతోంది' అని మహాజన్ అన్నారు. 'మనం ప్రపంచ శక్తిగా ఎదుగుతున్నాము. ఆపరేషన్ సిందూర్ సమయంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించాము. ఆయుధ ఉత్పత్తిలో బలమైన స్వదేశీ సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాము. అమెరికా కూడా ఏకధ్రువ ప్రపంచ దృక్పథ జడత్వాన్ని దాటి, బహుళ ధ్రువ, సహకార క్రమం వాస్తవికతను స్వీకరించాలి' అని అన్నారు. 'సంప్రదాయ భాగస్వాములకు మించి వాణిజ్య వైవిధ్యాన్ని వేగవంతం చేయడానికి, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, విస్తరించిన బ్రిక్స్ కూటమి, దక్షిణార్థగోళంతో సంబంధాలు మరింత పెంచుకోవడానికి ఇది మంచి తరుణమని ఎస్‌జేఎం విశ్వసిస్తుంది. అమెరికా భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్నప్పటికీ, వాణిజ్యం ఎల్లప్పుడూ పరస్పర ప్రయోజనాన్ని అందించాలి. ఒత్తిడి సాధనంగా ఉపయోగించకూడదు' అని ఆయన తెలిపారు. భారతదేశంఅమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చల సమయంలో ఒత్తిడికి వ్యతిరేకంగా స్థిరంగా నిలబడినందుకు ప్రభుత్వాన్ని అభినందిస్తూ, జన్యుపరంగా మార్పు చెందిన (జీఎం) వ్యవసాయ ఉత్పత్తులు, పాల దిగుమతులు, ఇతర సున్నితమైన రంగాలకు మన మార్కెట్లను బలవంతంగా తెరవడానికి చేసే ప్రయత్నాలను భారతీయ సంధానకర్తలు సరిగ్గా' ప్రతిఘటించారని మహాజన్ పేర్కొన్నారు.

# మోహన్ భగవత్‌ను అరెస్టు చేయమన్నారు

### మాలెగావ్ కేసు విచారణాధికారి వెల్లడి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబైలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసు విచారణ బందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ దీనిపై స్పందిస్తూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. శుక్రవారం ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు మోహన్ భగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం...తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూర్చడంతో పాటు అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నిక
(మొదటి పేజీ తరువాయి)

కాకుంటే సెప్టెంబరు 9న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య పార్లమెంట్ భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న గది నంబర్ ఎఫ్ 101, వసుధలో జరుగుతుందని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా తర్వాత ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయింది. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్నికల సంఘం రాజ్యసభ సెక్రటరీ జనరల్‌ను రిటర్నింగ్ అధికారిగా, రాజ్యసభ సెక్రటేరియట్‌లోని ఇద్దరు అధికారులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఎలక్టోరల్ కాలేజీలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉంటారు. రాజ్యసభ నామినేటెడ్ సభ్యులు కూడా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు. ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం జరిగే ఎలక్టోరల్ కాలేజీలో రాజ్యసభకు ఎన్నికైన 233 మంది సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు, లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభలో ఐదు ఖాళీలు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉంది. దీంతో ఎలక్టోరల్ కాలేజీలో బలం 782గా ఉంది. రెండు సభల ప్రభావవంతమైన బలం 782 కాగా, అర్హత కలిగిన ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటే, గెలిచే అభ్యర్థికి 391 ఓట్లు అవసరం. లోక్‌సభలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు 542 మంది సభ్యులలో 293 మంది మద్దతు ఉంది. రాజ్యసభలో పాలక కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉంది (ప్రభావవంతమైన బలం 240). పాలక కూటమికి మొత్తం 422 మంది సభ్యుల మద్దతు ఉంది.

## ఉన్నతస్థాయి కమిటీ
(మొదటి పేజీ తరువాయి)

చేసి పూర్తి సారాంశాన్ని రూపొందించి ఈనెల 4న రాష్ట్ర మంత్రివర్గానికి సమర్పిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కాగా కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ కోసం నియమించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ గురువారం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అధికారులు శుక్రవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి అందించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ నివేదికను ముఖ్యమంత్రికి అందించి వివరాలను తెలియజేశారు.

## జర్నలిస్టుల ప్రతిష్టకు దెబ్బ
(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన పత్రికలు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, సంపదను కాపాడుకునేందుకు, తమను ప్రశ్నించే వారిని అపహాస్యం చేసే భాషను ఉపయోగిస్తూ, వింత పోకడలతో వ్యవహరిస్తున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. తద్వారా జర్నలిస్టుల ప్రతిష్ట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేసే పత్రికా సంస్థలు కొన్ని మాత్రమే ఉంటాయన్నారు. జర్నలిజంలో ఓనమాలు తెలియని వారు కూడా కొందరు జర్నలిస్టుల ముసుగు వేసుకుని సోషల్ మీడియా పేరుతో తిరుగుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నిబద్ధత కలిగిన జర్నలిస్టులు ఈ వింత పోకడలపై సదస్సులు నిర్వహించి, నిజమైన జర్నలిస్టులు ఎవరన్నది నిర్వచనం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తుందని, అందుకే 'గులాబీ రంగు పత్రికలు' ముఖ్యమంత్రి, అధికారులు, ప్రభుత్వ ప్రజాప్రతినిధులపై వారి స్వలాభం కోసం అసంబద్ధంగా వార్తలను పతాక శీర్షికలతో ప్రచురించినప్పటికీ ప్రజా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని వివరించారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని అపహాస్యం చేస్తూ ఉక్కుపాదంతో ప్రత్యర్థులను వేధించే గులాబీరంగు పాత్రికేయాన్ని తాము ఒక స్థాయి వరకే ఉపేక్షిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు మాట్లాడుతూ గుట్టును విప్పడమే నిజమైన పత్రికల పని అని, కానీ ప్రస్తుతం కొన్ని పత్రికలు గుట్టును కప్పి పెడుతున్నాయన్నారు. అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం భారతదేశంలోని సేవారంగాలపైన కూడా ఆంక్షలను విధించేందుకు ప్రయత్నిస్తోందని, యాపిల్ లాంటి సంస్థలు భారతదేశానికి రాకుండా ఒత్తిడి తీసుకొస్తోందని విమర్శించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమెరికా ఏది చెబితే అదే వినే పరిస్థితికి వచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌కు, ప్రతిపక్షాలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని విమర్శించారు. మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఐదు రాఫెల్ విమానాలు కూలిపోయిన విషయాన్ని కూడా అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించే పరిస్థితి వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేవే పత్రికలన్నారు. సభలో సిఎం సలహాదారు వేం.నరేందర్‌రెడ్డి, ఐఅండ్ పిఆర్ ప్రత్యేక కమిషనర్ సిహెచ్. ప్రియాంక, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఎడిటర్ ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 1000 కోట్ల కుంభకోణం
(మొదటి పేజీ తరువాయి)

జరిగినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ ఇడి సంచలన ప్రకటన చేసింది.

**నిధులు సొంత ఖాతాల్లోకి మళ్లింపు....**గతంలో కాగ్ ఇచ్చిన నివేదికలో కేవలం 7 జిల్లాల్లోనే రూ.253.93 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఉందని, అయితే 33 జిల్లాలు కలిపి చూస్తే రూ. 1000కోట్లకుపైనే అక్రమాలు జరిగినట్లు తెలిపిందని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు వెళ్లాల్సిన నిధులను ప్రైవేటు వ్యక్తులు తమ సొంత ఖాతాల్లోకి మళ్లించుకున్నారని ఇడి ప్రకటించింది. అసలు గొర్రెల కొనుగోలు లేదా విక్రయం జరగలేదని పేర్కొన్నారు. కాగా, ఈకేసును మనీలాండరింగ్ కోణంలో విచారించిన ఇడి అధికారులు హైదరాబాద్‌లోని 8చోట్ల సోదాలు చేశారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, దళారులు, గతంలో అరెస్ట్ అయిన వ్యక్తుల ఇళ్లతో పాటు నాటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓఎస్‌డి కల్యాణ్ ఇంట్లోనూ తనిఖీలు చేశారు. గత ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించగా రెండు విడతలుగా సుమారు రూ.4.25 లక్షల యూనిట్లను పంపిణీ చేసినట్లు చూపించారు. ఇందుకోసం దాదాపు రూ.4వేలకోట్లు మంజూరు చేశారు. అయితే కొన్ని యూనిట్లనే పంపిణీ చేసి.. ఎక్కువ కొన్నట్లు చూపడం ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ఈక్రమంలోనే కుంభకోణం జరిగిందంటూ గతంలోనే కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు అప్పట్లోనే 17మందిని అరెస్టు చేశారు. ఏసీబీ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో గతేడాది జూన్‌లో ఇడి ఇసిఐఆర్ నమోదు చేసింది. అయితే ఈ కేసు దర్యాప్తులో ఉందని మరిన్ని వివరాలు త్వరలో బయటపడతాయని ఇడి అధికారులు వెల్లడించారు.

## లొంగొద్దు : సిపిఐ (మొదటి పేజీ తరువాయి)

సామ్రాజ్యవాద శక్తికి భాగస్వామిగా కాకుండా సమాన సహకారాధారిత విదేశాంగ విధానాన్ని పునరుద్ఘాటించాలని డిమాండ్ చేసింది. వాణిజ్య సంబంధాలను భారత్ కొనసాగించాలి. కానీ అవి పరస్పర ప్రయోజనం ఇచ్చేవిగా, సమాన స్థాయిలో ఉండాలి. ఏకపక్ష డిమాండ్లతో లేక ప్రతిబంధకాలతో అమెరికా శాశించేలా ఉండకూడదు. ట్రంప్ బెదిరింపులు, అవమానాలను కేంద్రప్రభుత్వం తేలికగా తీసుకొని, వినయంగా ప్రవర్తిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైఖరి బీజేపీ ప్రభుత్వ పరికితనానికి, పశ్చిమ దేశాలపై ఆధారానికి... ముఖ్యంగా దేశ ప్రయోజనాలను అమెరికా కోసం పణంగా పెట్టేయడానికి అద్దం పడుతోంది' అని సీపీఐ వ్యాఖ్యానించింది. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తున్న భారత్ లేక ఇతర దేశంపై సుంకాలు విధించడం లేక శిక్షనాత్మక చర్యలు తీసుకోవడం ఆమోదయోగ్యం కాదని ట్రంప్ సుంకాలనుద్దేశించి పేర్కొంది. భారత్‌పై అమెరికా 25 శాతం సుంకం విధించడాన్ని ఆక్షేపించింది. ఇతర దేశాల ఆర్థికవిదేశాంగ విధానాల ఎంపికల్లో జోక్యాన్ని, వాటిని శాశించే లక్ష్యంతో ఒత్తిడిని పెంచడం వాటిని అవమానించడమే అవుతుందని పేర్కొంది. భారత్ సార్వభౌమ దేశమని, దేశ ప్రయోజనాల దృష్ట్యా రష్యా లేక గ్లోబల్ సౌత్‌లోని ఏ దేశంతోనైనా వాణిజ్య సంబంధాలు పెట్టేకునే స్వేచ్ఛను కలిగివుందని సీపీఐ నొక్కిచెప్పింది. వాణిజ్యసహకార బంధాలతోనే భారత్ పురోగతి సాధిస్తున్నట్లు వెల్లడించింది. ఇంధన భద్రత సాధించడం, రక్షణ సామర్థ్యాలు పెంచుకోవడం, భౌగోళిక రాజనీతి సంబంధమైన సమతుత్యత పొందడం కోసం ఈ బంధాలు భారత్‌కు దోహదమవుతున్నట్లు సిపిఐ పేర్కొంది.

## జాతికి అంకితం
(మొదటి పేజీ తరువాయి)

సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. వైటిపిఎస్ లోని యూనిట్ వన్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్తు అందించే యూనిట్ ను జాతికి అంకితం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం రెండు సంవత్సరాలు వైటిపిఎస్ కు సంబంధించిన పర్యావరణ అనుమతులను క్లియరెన్స్ తీసుకురాకపోవడం వల్ల రెండు సంవత్సరాలు ప్రాజెక్టు పనులు ఆలస్యం అయ్యాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక సమయాన్ని నిర్దేశించుకొని అనుకున్న కార్యాచరణ ప్రకారం సంవత్సరం, నెల, వారానికి చేయాల్సిన పనులపై క్యాలెండర్ ప్రకారం ముందుకు వెళ్లి సంవత్సర కాలంలోని రెండు యూనిట్లు పూర్తి చేయడమే కాక, ఈ డిసెంబర్ నాటికి తక్కిన యూనిట్లు పూర్తి చేసేందుకు ముందుకు వెళుతున్నట్లు తెలిపారు .విద్యుత్ యూనిట్ పనులు ఆలస్యం కావడం వల్ల ప్రజలపై పడే భారాన్ని తగ్గించాలని క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. విద్యుత్ ఉత్పదనతో పాటు, వైటిపిఎస్ లో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల ఏర్పాటు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి, అంబులెన్స్ సేవలు ఏర్పాటు చేస్తున్నామని, సిబ్బందికి క్వార్టర్స్ కట్టిస్తున్నామని, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. రహదారులు దెబ్బతినకుండా సిసి రోడ్డు పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. భూములు కోల్పోయిన వారికి గత ప్రభుత్వం పరిహారాన్ని గాలికి వదిలేస్తే తాము ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి ఉద్యోగాలు, పునరావాస కల్పన చేస్తున్నమని, పులిచింతల కింద చిట్యాల మండలంలో నష్టపోయిన రైతులకు కూడా ఉద్యోగాలు ,పరిహారం అందజేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలోనే విష్ణుపురం డబుల్ రైల్వేలైన్ మంజూరు కావడం జరిగిందని, అయితే ఇప్పటివరకు పనులు పూర్తికాలేదని,త్వరితగతిన పనులు పూర్తి చేయాలని చెప్పారు. 93 కిలోమీటర్ల డబుల్ లైన్ రైల్వే పనులకు సరైన నిధులు కేంద్ర ప్రభుత్వం నుండి రానందున ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రహదారుల పూర్తికి 280 కోట్ల రూపాయలు మంజూరు చేయడమే కాక క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రాజెక్టు నుండి ఎలాంటి సహకారం అందించడం లేదని తెలిపారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ,రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైటీపీఎస్ ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవర్, హైడల్ డైరెక్టర్ బాలరాజు, కోల్ డైరెక్టర్ నాగయ్య, థర్మల్ డైరెక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి, జెన్కో సివిల్ డైరెక్టర్ అజయ్, జెన్కో హెచ్ ఆర్ డైరెక్టర్ వి.కుమార్‌రాజుతోపాటు, వైటీపీఎస్ పర్యవేక్షక ఇంజనీర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రూ.3కోట్ల ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ చీటింగ్‌లో నలుగురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.3కోట్లు దోచుకున్న నలుగురు నిందితులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి...శ్రీనివాస్ మనుబోతుల 2023లో డ్రోన్లకు సంబంధించిన 'డ్రోన్స్ స్ప్రే'తో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించాడు. ఇదే పేరుతో కరెంట్ అకౌంట్‌ను తెరిచాడు. వ్యాపారంలో నష్టాలు వస్తుండగా అతని స్నేహితుడు శేఖర్ ద్వారా జుబేర్ అహ్మద్ పరిచయం అయ్యాడు. యూసుఫ్ మోసాలకు ఉపయోగించే నిధు లు శ్రీనివాస్ అకౌంట్‌లోకి పంపించి 10శాతం కమిషనర్‌కు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే రూ.4.3కోట్లను అతని అకౌంట్‌లోకి బదిలీచేసి శ్రీనివాస్‌కు రూ.2లక్షలు కమీషన్‌గా ఇచ్చారు. ఎస్ఎంసి గ్లోబల్ సెక్యూరిటీ లిమిటెడ్ సిఇఒ అజయ్‌గార్గ్‌కు చెందిన రూ.3 కోట్ల విలువైన షేర్లను శ్రీనివాస్ ఖాతాలోకి మళ్లించి మోసగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు శ్రీనివాస్‌తో పాటు సయ్యద్ యూసుఫ్, చెక్క యోషయ్య, మహ్మద్ జుబేర్ అహ్మద్‌లను శుక్రవారం అరెస్టుచేసినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు.



# విద్యార్థుల సమస్యలు సమాజానికే చేటు

### తక్షణమే పెండింగ్ ఫీజులివ్వాలి : నారాయణ
### ఇందిరాపార్కు వద్ద విద్యార్థుల భారీ ప్రదర్శన

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** విద్యార్థులను సమస్యల్లోకి నెట్టితే అది సమాజానికి, ప్రభుత్వానికి అంతా మంచిది కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. కావున, తక్షణమే ఫీజులు, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేసి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. రాష్ట్రంలో 14లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల రూ.6వేల కోట్లు చెల్లించాలని, 100 బిసి కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని, గురుకులాల్లో ప్రతి తరగతిలో 20శాతం చొప్పున సీట్లు పెంచాలని డిమాండ్‌చేస్తూ బిసి నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీలం వెంకటేశ్, తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద వందలాది మంది విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య,ఎంఎల్‌సి దాసోజ్ శ్రవణ్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవక్కపోయినా పర్వాలేదు కానీ, విద్యార్థులకు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులను విదేశాల్లో ఉద్యోగాలు చేసేలా స్కీంలు తెస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడం ఆశ్చర్యంగా ఉన్నదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏం చేస్తారో తనకు తెలియదని, విద్యార్థుల ఫీజులను విడుదల చేసి, వారి విద్య సవ్యంగా జరిగేలా చూడాలని కోరారు. ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అప్పు తెచ్చి అయినా రూ.6వేల కోట్ల ఫీజులను విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల విద్యకు కేంద్రప్రభుత్వం వేల కోట్లు కేటాయిస్తుందని, ఆ డబ్బులన్నీ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఒకవైపు ఫీజులు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీములను ఎత్తేయడానికి 'ట్రస్ట్ బ్యాంకు' ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి తెర లేపారని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లో ఈ ప్రతిపాదనను అంగీకరించబోమని ఆర్.కృష్ణయ్య స్పష్టంచేశారు. ప్రతి గురుకులాల్లోని తరగతుల్లో 20శాతం చొప్పున సీట్లు పెంచాలని కోరారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నేతలు చంద్రశేఖర్, రాందేవ్ మోదీ, యాదవ్, నరేశ్ గౌడ్, నంద గోపాల్, మోదీ రాందేవ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





కేరళలోని కొల్లాం జిల్లాలో జరిగిన 'రెడ్ వలెంటీర్స్ మార్చ్'లో పాల్గొన్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా. అనంతరం ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రకాష్ బాబు, పార్టీ కొల్లాం జిల్లా కార్యదర్శి పిఎస్. సుపాల్ కూడా పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ కాంక్లేవ్ కు సర్వం సిద్ధం

### నేడు తెలంగాణ క్రీడా విధానం ప్రకటించనున్న సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ఐసిసి, నోవాటేల్ లో శనివారం నిర్వహించనున్న స్పోర్ట్స్ కాంక్లేవ్‌కు సర్వం సిద్ధం చేశామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి హాజర య్యే ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఐఎఫ్ఎ వంటి గ్లోబ ల్ క్రీడా సంస్థలతో పాటు ప్రముఖ కార్పొరేట్లు, క్రీడా నిపుణులతో రాష్ట్రం ఎంఒయులు చేసుకుంటోందని, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలకు ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు.

తెలంగాణలో అనేక జాతీయ అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించే సత్తా ఉందని అనేకసార్లు నిరూపించబడిందని క్రీడా శాఖ అధికారుల శ్రమ రాష్ట్ర ప్రభుత్వ సహకారం సిఎం రేవంత్ రెడ్డి పట్టుదల కలసి తెలంగాణ నూతన క్రీడా విధానం2025 రూపు దిద్దుకుందని, ప్రకటించిన క్రీడా విధానం మెరుగ్గా అమలు పరచడానికి, దీనిని జాతీయస్థాయిలో విస్తృతం గా ప్రచారం చేసి వివిధ క్రీడా కార్యక్రమాలలో అందరినీ భాగస్వామ్యం చేయడానికి జాతీయస్థాయిలో మద్దతు కూడగట్టడానికి ఈ స్పోరట్స్ కాంక్లేవ్ ముఖ్య ఉద్దేశమని శివసేన రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రఖ్యాత క్రీడా విశ్లేషకులు చారు శర్మ, భారత క్రికెట్ మాజీ ఒలంపియన్లు పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, అంజు జార్జ్ వివిధ క్రీడా ఫెడరేషన్ల ప్రతినిధు లు, క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రముఖ క్రీడా జర్నలిస్టులు విశ్వనాథన్ సభ నాయక్ తోపాటు మరికొంతమంది సీనియర్ క్రీడా జర్నలిస్టులు తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని ఆయన తెలిపారు.



ఈ విధానం ప్రధానంగా పటిష్టమైన క్రీడా పరిపాలన, దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి, కెరియర్, ఉపాధి మార్గాల రూపకల్పన, క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర క్రీడా వాతావరణ కల్పన వంటి అంశాలపై దృష్టి సారించనుందని తెలిపారు.

# కొత్త ప్రాజెక్టులతో గోదావరి జలాలు

### రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గోదావరి జలాలను పూర్తిస్థాయిలో తీసుకురావడానికి ప్రస్తుతం కొత్త ప్రాజెక్టును చేపడతామని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్.బి నగర్ నియోజక వర్గం కర్మంఘాట్‌లోని కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం తోపాటు, రాష్ట్ర ప్రభుత్వం జంట నగరాలకు కృష్ణా, మంజీరా నదుల నుండి నీటిని తీసుకు వచ్చిందని,పదేళ్లపాటు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క చుక్క నీటిని కూడా తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో తీసుకురావడానికి ప్రస్తుతం కొత్త ప్రాజెక్టును చేపడతామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

రేషన్ కార్డు అనేది ఒక పత్రం కాదని, ఆత్మగౌరవ పత్రం అని,ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున అమలు చేస్తోందని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా, వివిధ సంక్షేమ పథకాల అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికీ 6 కిలోల బియ్యం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో, ప్రాంతాలు మారిన వారి పేర్లను రేషన్ కార్డుల నుండి తొలగించినప్పుడు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ప్రజలు తమ కొడుకులు, కొడుకుల పిల్లలను కూడా రేషన్ కార్డులలో నమోదు చేస్తున్నామని చెబుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం ఆరు హామీలకు సంబంధించి ఇప్పటికే ఉచిత బస్సులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మిగిలి న హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ పురోగతికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో రూ. 10,000కోట్లు కేటాయించిందని, ఎల్.బి నగర్ నియోజకవర్గంలో మురుగునీటి వ్యవస్థలు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి 200కోట్లు కేటాయించిందన్నారు.



**కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడం దురదృష్టకరం**

నగరాన్ని నాలుగు దిశలకూ సులభంగా చేరుకోవడానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సు,మెట్రో రైలు సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటోందని,మెట్రో రైలుకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంలోని సంబంధిత శాఖ మంత్రిని పదేపదే కోరినప్పటికీ కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడం దురదృష్టకరమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.జిల్లా కేంద్రాలకు సులభంగా,సురక్షితంగా చేరుకోవడానికి ఔటర్ రింగ్ రోడ్డు నుండి ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేశామని,రెండేళ్లలో పూర్తి చేయబోతున్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపు 65 వేల ఉద్యోగాలు సృష్టించామని, దీనితోపాటు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకు వస్తున్నామని చెప్పారు. అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అనంతరం జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, దయానంద్ గుప్తా,టి యూఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి,రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి,ఆర్డీఓ రాజేశ్వర్ రెడ్డి,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పారిజాత,స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం ఆదాయ పెంపుకు ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు


### మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**మద్యం ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం రకరకాల ప్రయత్నాలు చేస్తోందని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎక్సైజ్ పాలసీ గడువు నవంబర్ వరకు ఉన్నప్పటికీ ఇప్పుడే కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. హైదరాబా ద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలి మాజీ ఛైర్మన్ కె.స్వామిగౌడ్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మద్యం దుకాణాలకు చెందిన దరఖాస్తు ధరను రూ 2 నుంచి రూ 3 లక్షల వరకు పెంచుతున్నారన్నారు. బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని, అడుగడుగునా మద్యం షాపులు తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని ఆరోపించారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ ఒక సామాజిక వర్గంపై కాంగ్రెస్ ప్రభుత్వం కత్తి కట్టినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. కల్తీ కల్లును అరికట్టేందుకు కల్లు దుకాణాల్లో థర్డ్ పార్టీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కల్తీ కల్లును నిర్ధారించేందుకు సరైన విధంగా శాంపిల్స్‌ను సేకరించడం లేదని ఆరోపించారు.



## 'ఆపరేషన్ ముస్కాన్'లో 7,678 మంది బాలలకు రక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రంలో 31 రోజుల పాటు సిఐడి విభాగంలోని మహిళా భద్రతా విభా గం ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్'లో 7678 పిల్లల్ని రక్షించినట్లు సిఐడి అదనపు డిజిపి చారుసిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌ను తెలంగాణలో జులై 1 నుండి 31, వరకు ఈ కార్యక్రమాని కి నోడల్ ఏజెన్సీగా ఉన్న మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో మహిళా అభివృద్ధి శిశు సంక్షే మ శాఖ, కార్మిక, ఆరోగ్యం, సిడబ్ల్యుసి, డిసిపియు, స్వచ్ఛంద సంస్థలతో కలిపి 786 మంది పోలీసు సిబ్బంది తో కూడిన మొత్తం 121 సబ్‌డివిజనల్ పోలీసు బృందాలను నియమించామని చారుసిన్హా పేర్కొన్నారు. బాల కార్మిక చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ ఆపరేషన్ లో భాగంగా రైల్వేబస్ స్టేషన్లు, మత పరమైన ప్రదేశాలు, ఇటుక బట్టీలు, మెకానిక్ దుకాణాలు, నిర్మాణ స్థలా లు, టీ స్టాళ్లు వంటి ప్రాంతాలపై దాడులు నిర్వహించి 7149 బాలురు, 529 మంది బాలికలను రక్షించామని తెలిపారు. పట్టుబడిన వారిలో బాల కార్మికులు 671 8, వీధి బాలలు 357, భిక్షాటన 42, బాండెడ్ లేబర్ 2, ఇతర ఉద్యోగాల నుండి 559 మంది పిల్ల లు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1713 కేసులు నమో దు చేశామని, 1718 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. 6593 మంది పిల్లల ను తిరిగి వారి కుటుంబ సభ్యుల కు అప్పగించగా 1049 మంది పిల్లలను రెస్క్యూ హోమ్స్‌కు పంపించామన్నారు.



కనీస వేతనాల చట్టం కింద కార్మిక శాఖ విధించిన 47.76 లక్షల జరిమానా విధించిందని తెలిపారు. హైదరాబాద్‌లోనే అత్యధికంగా 1247 మంది పిల్లల్ని పోలీసులు రక్షించారు. దీంతో పాటు నిందితులపై రూ.47,75,921 చలానా విధించారు.

# సహకార సంఘాల విభజన తరువాతే ఎన్నికలు

### వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సమితి విస్తృతస్థాయి సమావేశం సంఘం అధ్యక్షులు కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లో గల ఎఐకెఎస్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథులుగా బొమ్మగాని ప్రభాకర్, వృత్తి సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి టి.వెంకట్రాములు హాజరయ్యారు. సమావేశంలో బొమ్మగాని ప్రభాకర్ ప్రసంగిస్తూ నూతన జిల్లాలు ఏర్పడినప్పటికీ సహకార సంఘాలను జిల్లాల వారీగా విభజించకుండా, ఎన్నికలు నిర్వహించకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని, ఫలితంగా సహకార వ్యవస్థ ఛిన్నాభిన్నమై వృత్తిదారులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెలకు, మేకలకు నష్టపరిహారం ఇవ్వాలని, చదువుకున్న యువతకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టి.వెంకట్రాములు మాట్లాడుతూ పాల ఉత్పత్తి అభివృద్ధి చెందడానికి మినీ పాల డైరీలకు 80 శాతం సబ్సిడీ ఇవ్వాలని, 50 ఏళ్ల వృద్ధులకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు రూ.20 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిసిలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించి నెలలు గడిచినా ఆమోదించకుండా బిసిలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బిసిలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ ప్రసంగిస్తూ వృత్తిదారుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని జిల్లా అధ్యక్షులకు పిలుపునిచ్చారు.




సమావేశంలో వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎల్. శ్రావణ్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, సలహాదారులు గుడిగె శ్రీనివాస్ యాదవ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దిటి నరసయ్య, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, సంఘ నాయకులు పి.బాలయ్య యాదవ్, చేగొండ రాజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల భూములు పక్కదారి?

- ఇతర వ్యాపారాలు, అమ్మకాలు
- ఇళ్లను ఆనుకుని నూతన నిర్మాణాలకు రంగం సిద్ధం
- జనావాసాల్లో పరిశ్రమల ఏర్పాటు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పరిశ్రమ కోసం కేటాయించిన భూములు ప్రక్క దారి పడుతున్నాయి. ఇప్పటికే పలు భూములు బినామీల పేరిట ఉండగా వాటిని పరిశ్రమలకు కాకుండా వారి సొంతానికి వాడుకుంటూ షాపులు కట్టించి అద్దెలకు ఇస్తున్నారు. మరి కొందరు ఒకడుగు ముందుకేసి ఇతరులకు లక్షల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఉద్దేశ్యం నీరుగారిపోతోంది. పారిశ్రామికాభివృద్ధి కాకుండా స్వలాభం పెరిగిపోతోంది. భద్రాచలంలో పారిశ్రామిక పార్కు (ఇండస్ట్రీయల్ ఏరియా) ఉంది. ఇక్కడ చాలా కాలంగా స్థిర పడి పరిశ్రమలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్న వారున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితి మాత్రం ప్రజలకు ఇబ్బందిగా, ప్రాణ సంకటంగా మారుతోంది.





**ఇళ్లను ఆనుకుని నూతన నిర్మాణాలు:**

దశాబ్దాల కాలంగా భద్రాచలంలోని ఇండస్ట్రీయల్ పార్కులో ఖాళీగా మిగిలి పోయిన ఒకట్రెండు ప్లాట్లు లీజుకు తీసుకున్న కొందరు ఇళ్లను ఆనుకుని నూతన నిర్మాణాలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో కనీసం ప్రజలు నడిచేందుకు కూడా దారి లేకుండా పోతోంది. నిర్మాణాలు జరిగితే జనం వారి ఇళ్లలోకి పోయేందుకు అవకాశం లేకపోవడంతో పాటు విద్యార్థులు, శ్రామికులు, మహిళలు, ఇతరులు నడిచే పరిస్థితి ఉండదు. సుమారు 1982లో ఊరికి పూర్తిగా చివరిలో ఇండస్ట్రీయల్ పార్కును ప్రభుత్వం కేటాయించింది. అప్పట్లో భద్రాచలం ఒక చిన్న గ్రామం కాగా ఆ నాటి జనాభా కేవలం 10 నుండి 12 వేల మంది మాత్రమే, ప్రస్తుత జనాభా సుమారు 1 లక్ష 20వేల పై మాటే. అయితే 1982 నాటి పరిస్థితులు ప్రస్తుతం లేవు. ఆ తర్వాత చాలా కాలనీలు ఏర్పాటవడంతో పాటు జనాభా పదింతలు పెరిగింది. ఈ మధ్యకాలంలో ఇండస్ట్రీయల్ ఏరియాలో ప్లాట్ నెం. 28ని ఓ వ్యక్తి లీజుకు దక్కించుకున్నారు. అయితే 1982లో తయారు చేసి సైట్ మ్యాప్ ప్రకారం భూమిని లీజుకు కేటాయించారు. కాగా ఆ భూమిలోనూ ఓ మూల నుండి సుమారు 40ఏళ్లుగా కాలిబాట ఉంది.

సదరు ప్లాట్ నెం.28 లో నిర్మాణం చేపడితే ఆ కాలిబాట కూడా మూసుకుపోనుంది. గత పదేళ్ల క్రితం ప్లాట్ నెం.28కి పై భాగంలో ఆనుకుని ఉన్న ప్లాట్ లో ఇదే తరహా దారి సమస్య తలెత్తగా, ఇక్కడ దారుంది, ప్రజలు నడవడానికి అవసరం కాబట్టి దారి వదలాలని కాలనీ వాసులంతా కోరితే ఆ ప్లాట్ యజమాని మానవతా కోణంలో ఐదున్నర అడుగుల దారిని వదిలి సరిహద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతంఅటుగా నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తున్నారు. కాగా ప్లాట్ నెం.28లో పాత లెక్కల ప్రకారం కేటాయించిన భూమిలో కట్టడాలు మొదలు పెడితే ఉన్న దారి కూడా మూసుపోనుంది. ప్రజలంతా మరళా రోడ్డెక్కి దారి కావాలంటూ ప్రాదేయపడుతున్నా పట్టించుకోవడం లేదు. దీనిపై కాలనీకి చెందిన పలువురు మహిళలు సంఘటనా స్థలంలో స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావును కలిసి సమస్య పరిష్కరించాలని కోరడంతో ఆ ప్లాట్ దక్కించుకున్న వ్యక్తిని పిలిచి దారికి స్థలం వదిలి కట్టుకోవాలంటూ సూచించారు. అయినప్పటికీ సదరు వ్యక్తి ఎంఎల్ఏ సంఘటనా స్థలంలో ఉన్నంత వరకు సరే అని చెప్పి, ఎంఎల్ఏ అక్కడి నుండి వెళ్లి పోయిన తర్వాత మళ్లీ మొండికేస్తున్నారు. దీంతో చేసేది లేక ప్రజలు విస్తుపోవాల్సి వచ్చింది.

**కాలుష్య కోరల్లోకి జనం**

పెద్ద ఎత్తున కాలనీలు ఏర్పాటైన తర్వాత కూడా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ప్రజలు కాలుష్య కోరల్లోనికి నెట్టబడుతున్నారు. ఇప్పటికే 3 రైస్ మిల్లులు, రసాయన ఇసుక తయారీ ఫ్యాక్టరీలు, వివిధ చిన్నపెద్ద పరిశ్రమలు ఉన్నాయి. వీటితోనే ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతూ ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులకు గురై సతమతం అవుతున్నారు. ఇప్పుడు ప్లాట్ నెం.28లో యూపివిసి పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు జనావాసాలను ఆనుకుని నిర్మాణం తలపెడుతున్నారు. దీని ద్వారా కూడా పెద్ద ఎత్తున కాలుష్యం వచ్చే ప్రమాదం ఉందని,ప్రజల ప్రాణాలు ముప్పు తప్పదనే వాదన కాలనీ వాసుల్లో బలంగా వినవస్తోంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సైతం ఇలాంటి వ్యవహారాలపై దృష్టి సారించి ప్రజారోగ్యానికి పెద్దపీఠ వేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా అసరాలను హరిస్తూ, ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చే పరిశ్రమల ఏర్పాటును నిలుపుదల చేసేందుకు రాజకీయ పార్టీలు, మానవహక్కుల సంఘాలు, మేధావులు, నిష్ణాతులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు ముందు భాగాన నిలిచి మేలు చేయాలని కోరుతున్నారు.

**చర్యలు తీసుకుంటాం: మహేష్, జెడ్ఎం :** ఇండస్ట్రియల్ ఏరియాలోని భూములను అమ్ముకుంటూ, షాపులు కట్టి అద్దెలకు ఇస్తున్నారని ప్రజాపక్షం అడగగా, దానిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదులు అందితే పరిశీలించి చర్యలు తీసుకుంటామని పరిశ్రమల జోనల్ మేనేజర్ మహేష్ తెలిపారు. ప్రజా అవసరాల కోసం దారి వదలాలని కోరినా కుదరదు అంటున్నారని అడగడంతో ఎవరికి కేటాయించిన భూముల్లో వారు పరిశ్రమలు నెలకొల్పుకుంటారు. వారి నిర్మాణాలకు, కట్టడాలకు అడ్డుతగిలితే పోలీస్ కేసులు అయ్యే అవకాశం ఉంటుందని మహేష్ బదులిచ్చారు.

## 'బనకచర్ల'పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఢిల్లీలో అధికారం ఉన్నదని ఎపి మంత్రి లోకేష్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.



కాళేశ్వరం అనేది కొత్త ప్రాజెక్టు కాదని, ప్రాణహితలో అంతర్భాగమని, అందుకే ఎపి పునర్విభజన చట్టం వర్తించబోదని కేంద్రం స్పష్టం చేసిన విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి పెదవులు మూసుకోవడం వల్లనే చంద్రబాబు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారిందన్నారు. బనకచర్లను కట్టి తీరుమతామని ఎపి మంత్రి చెబితే, దానిని ఆపడం తమకు తెలుసని అన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.9, చార్మినార్ జోన్.
NIT No. 30/EE.Div.NO.9/GHMC/25-26 షార్ట్ టెండర్ ప్రకటన తేది: 31.07.2025
**పని వివరణ:** నిర్వహణ పనులు (09) నెం.లు, **అంచనా విలువ:** రూ.56.30 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 01.08.2025న మ.03.00గం.ల నుండి మరియు స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 05.08.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ జి.హరి కిషోర్, సెల్: 9849906768. పనుల వివరాలు కాపీ జతపరచబడింది.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-9, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 5894-PP/CL/ADVT/1/2025-26, Date: 01-08-2025

**పురపాలక సంఘ కార్యాలయము :: భువనగిరి**
ఫైలు నెం. ఇ1/12/2025-26, టెండరు మరియు కొటేషన్ నోటీసు ప్రకటన తేది: 01.08.2025
**పనుల సంఖ్య** : 1, **అంచనా వ్యయం:** రూ. 5.00 లక్షలు, **బిడ్ దాఖలు ప్రారంభ తేది:** 02.08.2025, ఉ.11-30 గం.లు, **బిడ్ దాఖలు ముగింపు తేది:** 03.08.2025 మ.3-30గం.లకు. వివిధ అభివృద్ధి పనులు మరియు ఇతర నిర్వహణ పనులకు అవసరమగు Non-SSR Item లకు ధరలు ఏజెన్సీలు/ కాంట్రాక్టర్ల నుండి పై తేదీలలో కొటేషన్లు కోరనైనది. పూర్తి వివరముల కొరకు మున్సిపల్ ఇంజనీర్ : 9581853956 ను సంప్రదించగలరు.
సం/- కమీషనర్ భువనగిరి మున్సిపాలిటీ
DIPR R.O. No. : 5858-PP/CL/ADVT/1/2025-26, Date: 01-08-2025

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం కూనూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని అవి ఏ ఏ దశలో ఉన్నాయ అని ఎంపిడిఓని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నిర్మాణ పనుల జరిగినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి ఉపయోగించే ఇసుక, ఇటుక లని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, స్టీల్, ఇటుక వంటివి రేట్లు మాట్లాడి తక్కువ ధరలకే ఇప్పిస్తున్నారని అని సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు.



## రోగులకు మెరుగైన వైద్య సేవలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆర్డీవో రమణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ రవిప్రకాష్‌తో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో ఉన్న వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆసుపత్రి ఇబ్బంది పనితీరును తెలుసుకున్నారు. రోగులతో నేరుగా మాట్లాడి వారికి ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.



## మహిళా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పని ప్రదేశంలో, ఉద్యోగం చేసే చోట మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. పని చేసే చోట మహిళలకు భద్రత, భరోసా కల్పించడం అందరి బాధ్యత, మహిళలను గౌరవించడం మన సంప్రదాయమన్నారు. వారి ఎదుగుదలకు తోడ్పాటు ఇవ్వాలని, మహిళ సాధికారత సమాజానికి మంచిదని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, కాలం, సమయం లెక్క చేయక పని చేస్తున్నారని అన్నారు. కుటుంబాన్ని పిల్లలను సరిదిద్దడంలో తల్లిగా మహిళ తన బాధ్యతను సక్రమంగా నేరవేరుస్తుందన్నారు. అలాంటి మహిళ సమాజంలో ఏదోరకంగా వేధింపులకు గురవుతూనే ఉన్నది. పోలీస్‌శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంక్‌లు, మార్కెట్‌లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఫ్యాక్టరీలు, కూలీ ప్రదేశాలు, ఇలా ఎక్కడైనా వేధించిన, ఇబ్బందులకు గురిచేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వేధింపులకు సంబంధించి డయల్ 100కు, జిల్లా షీటీమ్ పోలీస్ 87126 86056 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్నారు

సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను




**ప్రజాపక్షం/మునుగోడు:** ఎన్నో పోరాటాలు త్యాగాలుచేసి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చాపల శ్రీను పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసుందని 44 కార్మిక చట్టాలను అపహాస్యం చేస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం అన్ని రకాల ఆదుకోవాలని కోరారు. కార్మికులు ప్రమాదాలకు గురైతే సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా తక్షణమే చెల్లించాలని 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ 5000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశం బెల్లం శివయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పందుల చిన్న నరసింహ, బొల్లు సైదులు,ఏర్పుల నరసింహ, గోలి హుస్సేన్,మాలాద్రి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ కిట్స్ కళాశాల చైర్మన్ కుటుంబంపై హత్యయత్నం

హైద్రాబాద్ నుండి కుటుంబ సభ్యులతో కోదాడకు వస్తుండగా...





**ప్రజాపక్షం/చివ్వెంల:** కోదాడ కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండ్రస్ట్రీస్ యజమాని నీలా సత్యనారాయణ కుటుంబంపై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. హైద్రాబాద్ నుండి కోదాడకు కుటుంబ సభ్యులతో ఆయన కారులో వస్తుండగా మండలంలోని గుంపుల తిరుమలగిరి సమీపంలో 65వ జాతీయ రహదారిపై కొంతమంది దుండగులు కారులో వచ్చి వారు ప్రయాణిస్తున్న కారును అడ్డగించారు. ఐరన్‌రాడ్డుతో వారి కారు అద్దాలను ధ్వంసం చేసి ముఖాలపై పెప్పర్ స్ప్రే కొట్టి కారులో ఉన్న నీలా సత్యనారాయణ, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలను కారు నుండి బలవంతంగా దింపి దాడి చేశారు. దుండగుల నుండి తప్పించుకునేందుకు వచ్చిపోయే వాహనాలను ఆపడంతో దుండగులు పరారీ అయ్యారు. గాయపడ్డవారు చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. ఈ దాడి వెనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట సమీపంలో ఉన్న అనుమంచిపల్లికి చెందిన రైస్‌మిల్లు వ్యాపారి మల్లిఖార్జున్ హస్తం ఉన్నట్లు పోలీసుల ఫిర్యాదు చేశారు. వీరి మధ్య గత కొంతకాలంగా వ్యాపార లావాదేవీలలో విభేదాలు చోటు చేసుకుని గొడవలకు దారి తీసినట్లు సమాచారం. సత్యనారాయణ చిన్న కుమార్తె విద్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేశ్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## అక్రమంగా సిమెంట్ దందా

ట్యాంకర్ల వారి నుండి లూజుగా కొనుగోలు చేసి తిరిగి గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు

స్పెషల్ బ్రాంచ్ పోలీసుల దాడుల్లో వెలుగులోకి

**ప్రజాపక్షం/చివ్వెంల:** ఓ వ్యక్తి అక్రమంగా లూజు సిమెంట్‌ను బస్తాలలో నింపి గుట్టుచప్పుడు కాకుండ గత కొంతకాలంగా అమ్మకాలు చేస్తుండగా సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం దాడులు చేసి పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన రామరాజుయాదవ్ దురాజ్‌పల్లి సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పాత ఇనుము దుకాణం వద్ద ఉన్న గోదామును అడ్డగా చేసుకుని ఈ దందా సాగిస్తున్నాడు. సిమెంట్ పరిశ్రమల నుండి వివిధ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా లూజు సిమెంట్ సరఫరా అవుతుండగా ఆ వాహనాల డ్రైవర్ల ద్వారా సిమెంట్‌ను తక్కువ ధరలకు కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇలా కొనుగోలు చేసిన సిమెంట్‌ను బ్రాండెడ్ సిమెంట్ (అల్ట్రాటెక్) ఖాళీ సంచులలో నింపి తిరిగి ఎక్కువ ధరకు అవసరమైన గృహ నిర్మాణదారులకు అమ్ముతున్నారు. పోలీసులు సిమెంట్ నిల్వ ఉన్న గోదాముకు తాళం వేసి అక్కడ ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్‌కు ఈ కేసును బదిలీ చేశారు.



# అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/మోతె:** సన్నబియ్యం పంపిణీ, నూతన రేషన్‌కార్డుల మంజూరు చేయడం ద్వారా పేదలకు ఆహారభద్రత కల్పించడం జరుగుతుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మన జిల్లాకు రప్పించి తొలుత సన్నబియ్యం, రేషన్‌కార్డులు పంపిణీ చేయడం అదృష్టమన్నారు. మోతె మండలంలో 277 మందికి రేషన్‌కార్డులు, అలాగే 1091 మందికి అదనపు కుటుంబ సభ్యులను చేర్పించడం జరిగిందన్నారు. ఇంకా ఎవరైన రేషన్‌కార్డులు రానివారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దశాబ్దకాలం పాటు సామాన్యులకు అత్యవసరమైన ఇండ్లు, రేషన్‌కార్డులు గత పాలకులు ఇవ్వలేదని, మీరు నమ్మకంతో ఈ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలకు కడుపునిండా అన్నం తినాలంటే సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ మోతె మండలంలో 28 షాపుల నందు 14497 కార్డులు ఉన్నాయని, వీటిలో 42వేల కుటుంబ సభ్యులు ఉన్నారని తెలిపారు. మోతె మండలంలో దరఖాస్తు చేసుకున్న 97 శాతం మందికి రేషన్‌కార్డు ఇవ్వడం జరిగిందన్నారు. రేషన్‌కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పరిశీలించి అర్హత ఉంటే రేషన్‌కార్డు మంజూరు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవరావు, డిఎస్‌వో మోహన్‌బాబు, తహసిల్దార్ వెంకన్న, ఎంపిడివో అంజనేయులు, డిటి పుష్ప, అధికారులు పాల్గొన్నారు.

### రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం : ఎమ్మెల్యే సామేల్

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం) :** పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంతో పాటు, రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులను మంజూరు చేసిందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు.శుక్రవారం ఆయన జిల్లాలోని శాలిగౌరారం మండల కేంద్రంలోని సిఎంఆర్ ఫంక్షన్ హాల్ లో లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. శాలిగౌరారం మండలంలో ఇప్పటి వరకు కొత్తగా 2017 రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా, 9806 మంది సభ్యులను రేషన్ కార్డులలో చేర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,తహసిల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.



# రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందరూ ప్రతిరోజు విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. రోజుకు ఓపికి ఎంత మంది వస్తున్నారని, ఇప్పటివరకు ఎంత మంది నమోదు అయ్యారని వైద్యాదికారిని అడిగి తెలుసుకున్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా అంటువ్యాధులకు అవసరమైన మందులు నిల్వ ఉంచుకోవాలని, ఆసుపత్రికి వచ్చిన రోగుల వద్దకు వెళ్లి మెడిసిన్ బయటి నుండి తెచ్చుకోమని వైద్య సిబ్బంది ఏమైనా చెప్పారా అని అడిగి తెలుసుకున్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గత నెల, ఈ నెలలో ఎన్ని ఈ డిడి లు ఎన్ని,ఆసుపత్రి లో ఎన్ని ప్రసవాలు జరిగాయని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు ఇక్కడ నుండి మన జిల్లా ఆసుపత్రికి ఎన్ని కేసులు డెలివరీకి పంపించారని, ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీ అయిన గర్భిణి కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడుతూ ఆసుపత్రి లో డాక్టర్స్, సిబ్బంది ఎలా సహకరించారని, వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్స్ చాలా బాగా చూసుకున్నారని ఎలాంటి ఇబ్బంది జరగలేదని, ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా డెలివరీ చేశారని, వాక్సిన్ కూడా వెంటనే వేశారని తెలిపారు. ఆసుపత్రి కి మళ్లీ ఒకసారి వచ్చి చెకప్ చేయించుకోమని కాల్ కూడా చేశారని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు విజయ్, మోజేస్ వైద్యసిబ్బంది రోగులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌తో 106 మంది బాల కార్మికులకు విముక్తి

బాల కార్మికుల చేత పనులు చేయించుకుంటే కఠిన చర్యలు : జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా నల్లగొండ జిల్లాలో రికార్డ్ స్థాయిలో బాల కార్మికులకు జిల్లా పోలీస్ శాఖ విముక్తి కల్పించిందన్నారు. ఒక్క జూలై నెలలో 90 కేసులలో 106 మంది బాల కార్మికుల రెస్క్యూ.కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు.పలకా బలపం పట్టి బడిబాట పట్టాల్సిన బాలలను వెట్టిచాకిరీతోనే బంధీ అయిపోతున్న పసిబాల్యాన్ని తమ చేతులతో ఒడిసి పట్టుకుని వారిని విముక్తుల్ని చేయడం జరిగిందన్నారు.ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.ఏంకంగా 106 మంది పసిపిల్లల భవితవ్యం అంధకారంలో మునిగిపోకుండా కాపాడడం జరిగిందని తెలిపారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల ప్రకారం రాష్ట్ర పోలీస్ శాఖ నేతృత్వంలో ప్రతీ ఆరు నెలలకొసారి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాలకార్మికులు, వ్యభిచార కూపంలో చిక్కుకుపోయిన మైనర్లను, వీధిబాలలను, ఇటుకబట్టీలో నిర్బంధ కార్మికులుగా ఉన్నవారిని, ముష్టి మాఫియా చేతుల్లో బందీలుగా ఉన్నవారిని,ఇండస్ట్రియల్ కంపెనీల్లో పని చేసే వారిని కాపాడేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్న సంగతి అందరికీ తెలుసన్నారు

## దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలకు పెంచాలి

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.6వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన చేయూత పెన్షన్‌దారుల జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తీవ్ర అంగవైకల్యం కలిగి, కండరాల క్షీణత ఉన్న వారికి ప్రభుత్వం నెలకు రూ.15వేలు ఇవ్వాలన్నారు. ప్రసుతతం ఆంధ్రప్రదేశ్‌లో రూ.15వేలు ఇస్తుంటే తెలంగాణాలో ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, గీత కార్మికులకు రూ.4వేలు పెంచుతామని చెప్పి 20 నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి పెంచలేదన్నారు. ఈనెల 13న హైద్రాబాద్‌లో దివ్యాంగుల మహా గర్జనకు సంబంధించిన సన్నాహక సదస్సులను నిర్వహింస్తున్నట్లు తెలిపారు. వికలాంగుల సహకార సంస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ఉద్యమం ఆగదన్నారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్నయాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త జానకిరామయ్యచౌదరి, రాష్ట్ర నాయకుడు అహ్మద్‌ఖాన్, అందె రాంబాబు, గడ్డం ఖాసీం, వెంకటాచారి, సైదులు, రాజేష్, చైతన్యరెడ్డి, ఇంద్రచౌదరి, శ్రీనివాస్, రామేశ్వరి, లక్ష్మి, సువర్ణ, శంకర్, మదన్‌నాయక్, నాగరాజు, సైదులు, నర్సింహా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని లోతుకుంటలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల , కళాశాల యందు 2025/2026 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు గల మిగిలిన ఖాళీలకు అర్హత కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## నాలుగు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల కోసం ప్రజాపాలన కొనసాగుతున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తూర్పు బజార్‌లో నివసిస్తున్న పేద కుటుంబాన్ని సందర్శించి, వారిని అక్కున చేర్చుకుని వారి కష్టాలను తెలుసుకుని తక్షణమే స్థానిక ఎంపిడివోకు ఇల్లు మంజూరు చేయాల్సిందిగా అదేశాలు జారీ చేశారు. పేద మహిళ కుటుంబీకులైన గాదంగి ఉమా, రేణుక, అనూష, మామిడి శ్రీను లకు ఇండ్లు మంజూరు కాగా వారు చాల సంతోషిస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఇళ్లపై అవకతవకలు జరిగితే సహించేదిలేదన్నారు. వెలుగుపల్లిలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు ద్వారా 12 లక్షల రూపాయల నిధులతో అంగన్‌వాడీ భవనం, 20 లక్షల రూపాయలతో గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఏలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శేషు, మండలపార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్దన్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, దాసరి శ్రీను, సుంకరి జనార్ధన్ పాల్గొన్నారు.

## కెనరా బ్యాంకు తరలించకండి మహాప్రభో

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ హిల్ కాలనీ లో గత 45 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కెనరా బ్యాంక్ విజయపురి నార్త్ శాఖ ను హాలియా కు తరలించ డానికి అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. 100 కోట్ల టర్నోవర్ కలిగిన కెనరా బ్యాంకు, 15వేల ఖాతాలు, 2300 బంగారు రుణ ఖాతాలు, కలిగి ఉన్న బ్యాంకు45 సంవత్సరాలుగా హిల్ కాలనీ లో శాఖను నిర్వహిస్తుందని ఈ శాఖలో ఎంతోమంది రైతులు ,ఉద్యోగులు, పెన్షన్ దారులు, సాగర్ పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు, వ్యాపారస్తులకు సంబంధించి వేల ఖాతాలు ఉన్నాయని ఎంతోమంది ఖాతాదారులు బంగారు ఆభరణాల లోన్లు, లాకర్ లు, ఫిక్స్ డ్ డిపాజిట్లు,కలిగి ఉన్నారని ఇంత పెద్ద మొత్తములో వ్యాపారం సాగిస్తున్న కెనరా బ్యాంకు బ్రాంచ్ ని వేరే ప్రాంతానికి తరలించడం సబబు కాదని,హాలియాలో కొత్త శాఖను ప్రారంభించుకోవాలి కానీ ఇక్కడి శాఖను అక్కడికి తరలించి, వృద్ధులను, పెన్షన్ దారులను, ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఖాతాదారులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కెనరా బ్యాంకు ను సాగర్ నుంచి తరలించవద్దని స్థానిక ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కి కూడా ఫిర్యాదు చేయనున్నట్లుగా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు.




## ప్రగతిచక్ర అవార్డుల పంపిణీ

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించడం వల్ల అధిక ఆదాయం కెఎంపిఎల్ సాధ్యమవుతుందని తెలుపుతూ ఆర్‌టిసికి ఆదాయం తేవడానికి నిరంతరం కృషి చేయాలని ఉమ్మడి నల్లగొండ రీజన్ మేనేజర్ జానిరెడ్డి కోరారు.నల్లగొండ రీజియన్ ట్రైనింగ్ హాల్లో ఏర్పాటు చేసిన రీజియన్ స్థాయి ఏప్రిల్,మే,జూన్ నెలలకు సంబంధించిన ప్రగతి చక్ర అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుపుతూ అవార్డ్ గ్రహితలను ఉద్యోగులలో అణిముత్యాలుగా అభివర్ణిస్తూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని రాబోయే రోజులలో ఇతర ఉద్యోగులు కూడా అవార్డులు పొందే విధంగా కృషి చేయాన్నారు. శ్రావణమాసం,రాఖీ పండుగ సందర్భంగా ఆర్‌టిసికి అత్యధికంగా ఆదాయం సంపాదించి ఆదర్శనంగా నిలవాలన్నారు. నల్లగొండ రీజన్ పరిధిలో 7 డిపోలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 28 మంది ఉద్యోగులు డ్రైవర్, కండక్టర్లు, టిమ్ము డ్రైవర్లు, ప్రైవేటు బస్సు డ్రైవర్లు మెకానికులు, శ్రామికులు, ఆర్టిజన్లకు, శాలువాలు నగదు పురస్కారాలతో సన్మానించారు.ఉత్తమ బస్టాండ్ గా ఎంపిక కాబడిన మోత్కుర్ బస్టాండ్ కు నగదు బహుమతిని డిఎం యాదగిరిగుట్ట కు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి ఆర్‌ఎం,అన్ని డిపోల డిఎం లు,సూపర్ వైజర్ లు పాల్గొన్నారు.



## నిధుల దుర్వినియోగంపై ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివ స్వరూపారాణి నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర డైరెక్టర్ నవీన్ నికోలస్ గత నెల 25 తేదీన మాజీ ఎంపీపీ బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ కార్యాలయంలో కలిసి చేసిన ఫిర్యాదు మేరకు 28వ తేదీన విచారణ చేపట్టిన నివేదిక ఆధారంగా రాష్ట్ర డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాల మేరకు ఆమెను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర మోడల్ స్కూల్ అదనపు డైరెక్టర్ శ్రీనివాస చారి. ఈ సందర్భంగా అనంత రాజ్ గౌడ్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారి విధుల పట్ల బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా విధులు చేపట్టాలని ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నా పైసా అవినీతి జరిగిన ఊరుకునే ప్రసక్తే లేదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చేసిన అవకతవకలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని గుర్తు చేశారు. నేను ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ వెంటనే స్పందించి విచారణ చేపట్టి అవినీతి అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయడం పట్ల అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఒక అవినీతి తిమింగలాన్ని మండలము నుండి తరిమి కొట్టిన పట్ల విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కేంద్రం ప్రభుత్వం రైతులకు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను (రైతు గుర్తింపుకార్డులు) త్వరగా చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మట్టపల్లి మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకుని ఖచ్చితంగా ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. లేనిచో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు అనర్హులు అవుతారని అన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రభు త్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఐలయ్య తెలిపారు.సాంకేతిక విద్య కున్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థు లు ఈ మార్గం ఎంచుకోవాలని ప్రిన్సిపాల్ అన్నారు. తమ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ లో 24 సీట్లు ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో 7ఖాళీలు ఉన్నాయ నివీటి కోసం ప్రభుత్వం సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ సీట్ల కోసం ఇంటర్నల్ స్లైడింగ్ ప్రక్రియ ఆగస్టు 2,3వ తేదీలలో నిర్వహించబడుతుందని.అనంతరం5వ తేదీ నుండి స్పాట్ అడ్మిషన్ దరఖాస్తు ఫారాలు పంపిణీ చేసి 11వ తేదీ లోపు అడ్మిషన్ ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు అయన అన్నారు. తమ కళాశాలలోఅన్ని సౌకర్యాలతో కూడిన ల్యాబ్‌లు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతోవిద్యాబోధన విద్యార్థుల సంరక్షణతోపాటు ఎలాంటి గొడవలకు తావు లేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని విద్యార్థులకు, అధ్యాపకులకు. హాజరు నమోదు కోసం బయోమెట్రిక్ విధానాన్ని ఉపయోగిస్తున్నట్లు అయన తెలిపారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## షాక్‌కు గురయ్యా: ఖర్గే



**న్యూఢిల్లీ:** ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై గొంతెత్తకుండా అడ్డుకోవడం ఏమిటని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాజ్యసభ వెల్‌లో శుక్రవారం భద్రతా సిబ్బంది ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదే అంశమై రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ హరివంశ్‌కు లేఖ రాశారు. సభ్యులు తమ ప్రజాస్వామిక హక్కులు వినియోగించే సమయంలో సభలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది పరుగులు పెట్టడం చూసి షాక్‌కు గురైనట్లు తన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాల తరపున ఈ విషయాన్ని సభాపతి దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. 'నిన్న, నేడు సభలో ఇదే పరిస్థితి. పార్లమెంటు ఈ స్థాయికి దిగజారిందా? ఇది తీవ్ర అభ్యంతరకరం. దీనిని ముక్తకంఠంతో ఖండిస్తున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యలను సభ్యులు లేవనెత్తే సమయంలో వెల్‌లోకి సిఐఎస్ఎఫ్ సిబ్బంది రారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఖర్గే లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. రాజ్యసభలో అనూహ్య పరిణామంపై హరివంశ్‌కు ఖర్గే లేఖ రాశారన్నారు.

# పదిరోజులైనా ఆగని ప్రతిపక్షాల ఆందోళనలు




**న్యూఢిల్లీ :** వర్షాకాల సమావేశాలు ప్రారంభమై 10 రోజులవుతున్నా ఉభయ సభల్లో ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతున్నాయి. బిహార్‌లో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపిలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ప్రతిపక్ష సభ్యులు పట్టించుకోకపోవడంతో సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుంది. శుక్రవారం వారం లోక్‌సభ, రాజ్యసభలో బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా నిరసనను తెలిపారు. దానిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో ఉభయసభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలు చేపట్టగా, ప్రతిపక్ష ఎంపిలు ఆందోళనకు దిగారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. గోవా శాసనసభలో షెడ్యూల్డ్ తెగలకు సీట్లు కల్పించే బిల్లును చేపట్టాలని స్పీకర్ చేసిన విజ్ఞప్తిని పట్టించుకోలేదు. షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలకు ప్రతిపక్షం వ్యతిరేకమా అని న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ వారి ఉద్దేశ్యాన్ని ప్రశ్నించారు. ప్రతిపక్ష నిరసనలు కొనసాగుతుండగా, సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు. అంతకు ముందు, నిరసన తెలుపుతున్న సభ్యుల నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శన మధ్య, స్పీకర్ ఓం బిర్లా సభ మర్యాదను కొనసాగించాలని వారిని వారి సీట్లకు తిరిగి వెళ్లమని కోరారు. సభ్యుల ప్రవర్తన సముచితం కాదని బిర్లా పదే పదే నొక్కిచెప్పారు. నిరసనల కారణంగా ప్రశ్నోత్తరాల సమయం అంతరాయం కలిగింది. గందరగోళం కొనసాగడంతో, మూడు నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటల వరకు సభా కార్యకలాపాలు వాయిదా పడ్డాయి.

**రాజ్యసభలో తుడిచిపెట్టుకుపోయిన కార్యకలాపాలు**

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాల సవరణ, దాని ఉపసంహరణపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు చేసిన తీవ్ర నిరసనల మధ్య శుక్రవారం రాజ్యసభ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా, సభలోని మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. దీనితో కొంతమంది నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పారామిలిటరీ దళాలు సభను స్వాధీనం చేసుకున్నాయని ఆరోపించారు. ధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, కొంతమంది టిఎంసి, డిఎంకె ఎంపిలు వెల్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా, ప్రవేశ స్థలం వద్ద భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. అయితే, కొంతమంది మహిళలు సహా పలువురు ఎంపిలు వెల్‌లోకి చొరబడి నినాదాలు చేశారు. భద్రతా సిబ్బంది అడ్డుకోవడానికి వ్యతిరేకంగా వారు కూడా నిరసన తెలిపారు. కాగా, స్పీకర్ స్థానంలో ఉన్న ఘనశ్యామ్ తివారీ, వివేక్ టంఖా (కాంగ్రెస్)ను అనుబంధ ప్రశ్న అడగమని కోరుతూ నిరసన తెలుపుతున్న సభ్యులు తమ సీట్లకు తిరిగి వెళ్లి ప్రశ్నోత్తరాల సమయాన్ని పనిచేయడానికి అనుమతించమని కోరారు. అయితే, సభ సక్రమంగా లేనందున తాను మాట్లాడలేనని టంఖా అన్నారు. ఈ గందరగోళం మధ్య, ప్రతిపక్ష సభ్యులు వెల్ లోపల నినాదాలు చేస్తూ మైక్రోఫోన్లలో మాట్లాడటంతో చైర్మన్ రాజ్యసభను సోమవారానికి వాయిదా వేశారు. ఉదయం సమావేశంలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌పై చర్చ కోసం రూల్ 267 కింద 30 వాయిదా నోటీసులు అందుకున్నట్లు, వాటిలో ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని, భారతీయ దిగుమతులపై 25 శాతం సుంకం విధించాలనే అమెరికా నిర్ణయం ప్రభావం, భారతీయ ఐటి రంగంలో భారీ తొలగింపులు మొదలైన వాటి గురించి ఉన్నట్లు చెప్పారు.

# సాంకేతిక విద్యను సమాజశ్రేయస్సుకు ఉపయోగించాలి

**ధన్‌బాద్ ఐఐటి-ఐఎస్ఎం 45వ స్నాతకోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి ముర్ము పిలుపు**

**100 ఏళ్ల ఘనవిజయాల పోస్టల్ స్టాంప్ విడుదల**



**రాంచీ :** దేశంలోని తెలివైన యువకులు తమ సాంకేతిక విద్యను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించుకోవాలని, వారి విజయాలను వ్యక్తిగత విజయాలకు మాత్రమే పరిమితం చేయవద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. శుక్రవారం ధన్‌బాద్‌లో జరిగిన ఐఐటి (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్) 45వ స్నాతకోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ధన్‌బాద్ ఐఐటి ((ఐఎస్ఎం) 100సంవత్సరాల కాలంలో సాధించిన ఘన విజయాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ప్రత్యేక కవర్ సహా పోస్టల్ స్టాంపును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా విడుదల చేశారు. రాష్ట్రపతి ముర్ము ప్రసంగిస్తూ 'ప్రకాశవంతమైన యువ మనస్సులు భారత దేశ భవిష్యత్తును రూపొందించాలి. సామాజిక, జాతీయ సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్రను పోషించాలి. పర్యావరణం మరియు ప్రకృతిని అభివృద్ధి ఫణంగా పెట్టని న్యాయమైన భారత దేశం, హరిత భారతదేశం నిర్మించడానికి సాంకేతికతను ఉపయోగించండి. భవిష్యత్తులో మీరు ఏమిచేసినా, అది మీ సానుభూతి, శ్రేష్ఠత. నీతితోపాటు తెలివితేటలను ప్రతిబింబిస్తుంది. కేవలం ఆవిష్కరణ మాత్రమే కాకుండా కరుణతో నడిచే ఆవిష్కరణ, పరిస్థితిని మెరుగుపరుస్తుంది' అని స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి అన్నారు. అంతేకాకుండా భారతదేశం సాంకేతిక సూపర్‌పవర్‌గా అవతరించే దిశగా పురోగమిస్తోందని రాష్ట్రపతి నొక్కిచెప్పారు. నవకల్పనలు, స్టార్టప్‌లపై దృష్టిపెట్టాలని ఆమె విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి అతిపెద్ద బలం దాని వనరులు అన్నారు. సాంకేతిక విద్యకు నానాటికీ పెరిగిపోతున్న ప్రాప్యత, డిజిటల్ నైపుణ్యాల వ్యాప్తి దేశాన్ని సాంకేతిక సూపర్‌పవర్‌గా మార్చడానికి దారితీస్తోందన్నారు. విద్యావ్యవస్థను మరింత ఆచరణాత్మకంగా, ఆవిష్కరణ కేంద్రీకృతంగా, , పరిశ్రమగా మార్చడం వల్ల దేశ యువత ప్రతిభకు సరైన దిశానిర్దేశం లభిస్తుందని, ప్రపంచస్థాయిలో ముందుకు సాగడానికి వీలు కల్పిస్తుందని రాష్ట్రపతి ముర్ము తెలియజేశారు. వాతావరణ మార్పు వనరుల కొరత నుండి డిజిటల్ అంతరాయం, సామాజిక అసమానత వరకూ దేశం, ప్రపంచం అనేక సంక్లిష్టమైన, వేగంగా మారుతున్న సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. అలాంటి పరిస్థితులలో ఐఐటి (ఐఎస్ఎం) వంటి ఒక సంస్థ మార్గదర్శకత్వం వంటిది కూడా అత్యంత ముఖ్యమైనది అని రాష్ట్రపతి వివరించారు. సరికొత్త, స్థిరమైన పరిష్కారాలను కనుగొనడంలో ఐఐటి(ఐఎస్ఎం) ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. 'మీ జ్ఞానాన్ని వ్యక్తిగత పురోతికి పరిమితం చేయకండి. కానీ దానిని ప్రజా శ్రేయస్సు కోసం ఒక వాహనంగా మార్చుకోండి' అని ముర్ము సూచించారు. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైబల్ డెవలప్‌మెంట్' కార్యక్రమాల ద్వారా ఐఐటిఐఎస్ఎం గిరిజన యువత సాధికారత, అణగారిన మహిళలకు సాధికారత కల్పించడానికి చేస్తున్న కృషిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.దేశ సమగ్రాభివృద్ధిలో ఐఐటిఐఎస్ఎం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె అభినందించారు. స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము సైన్స్, ఇంజినీరింగ్‌లో అగ్రశ్రేణి బిటెక్ గ్రాడ్యుయేట్ ప్రియాంషు శర్మకు రాష్ట్రపతి గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. 202425 బ్యాచ్ నుంచి1,880 మంది విద్యార్థులు, వివిధ విభాగాలకు చెందిన (1,055మంది అండర్‌గ్రాడ్యుయేట్, 711మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ ) విద్యార్థులు ఫస్ట్ ఇయర్ పూర్తి చేశారు. ఈ స్నాతకోత్సవ వేడుకల్లో మొత్తం 37మంది విద్యార్థులు బంగారు పతకాలు, 35మంది విద్యార్థులు రజత పతకాలు, 21మంది స్పాన్సర్డ్ మెడల్స్, అవార్డులను అందుకున్నారు. 1926 డిసెంబర్ 9న స్థాపించబడిన ఈ సంస్థ ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ అండ్ అప్లైడ్ జియాలజీగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ధన్‌బాద్‌లోని ఐఐటిఐఎస్ఎంలో జరిగిన స్నాతకోత్సవానికి హాజరైన రెండవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. 2014మే 10న జరిగిన ఈ సంస్థ 36వ స్నాతకోత్సవానికి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

# మణిపూర్‌లో నలుగురు ఉగ్రవాదుల అరెస్టు



ఇంఫాల్ : మణిపూర్‌లోని వివిధ ప్రాంతాల నుండి నలుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అరెస్టు అయిన వారిలో నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (నోంగ్‌డ్రెన్ ఖోంబా) స్వయం ప్రకటిత ఆర్మీ చీఫ్ మోయిరాంగ్థెం బిరామణి మెయిటేయ్ కూడా ఉన్నారని వారు తెలిపారు. గురువారం బిష్ణుపూర్ జిల్లాలోని ఫుబాలా పాటన్ నుండి ఆయనను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. బుధవారం తౌబాల్ జిల్లాలోని సలుంగ్‌ఫామ్ బజార్ ప్రాంతం నుండి కాంగ్లీ యావోల్ కన్న లూప్ (కెవైకెఎల్)కు చెందిన ఇద్దరు సభ్యులను అరెస్టు చేశారు. వారిని కీషామ్ విల్సన్ సింగ్ (18), థోక్‌చోమ్ సనాథోయ్ మెయిటేయ్ (22)గా గుర్తించారు. వారు చిన్న వ్యాపారాల నుండి దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వారి నుంచి 9ఎంఎం పిస్టల్‌తో పాటు ఒక మ్యాగజైన్, 36హెచ్‌ఇ హ్యాండ్ గ్రెనేడ్, మూడు 9ఎంఎం లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ చైరెంతోంగ్ నుండి ప్రీపాక్ (పిఆర్ఎ) కేడర్‌ను అరెస్టు చేశారు. అతన్ని తెలెం నవోబా సింగ్ (29)గా గుర్తించారు. ఇదిలా ఉండగా, చురాచంద్‌పూర్ జిల్లాలోని కెగెల్జాంగ్ సమీపంలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు ఒక మ్యాగజైన్‌తో పాటు ఏకె రైఫిల్‌తో సహా రెండు తుపాకీలను స్వాధీనం చేసుకున్నాయి. మూడు డిటోనేటర్లు, రెండు రేడియో సెట్లు, ఒక ఐఇడి క్యాప్, మూడు దేశీయంగా తయారు చేసిన మోర్టార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.




# ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహణలో లోపాలు... విద్యార్థుల నిరసన

**న్యూఢిల్లీ:** ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహణలో లోపాలపై విద్యార్థులు నిరసన తెలిపారు. సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యల వల్ల వివిధ కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష రద్దయిందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఎస్ఎస్‌సీ సెలక్షన్ పోస్ట్ ఫేజ్ 13 రిక్రూట్‌మెంట్ టెస్ట్ గత నెల 24న ప్రారంభమై ఈ నెల ఒకటో తేదీతో ముగిసింది. అయితే దేశ వ్యాప్తంగా వివిధ పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు తలెత్తాయి. సర్వర్ లోపం కారణంగా ఆన్‌లైన్ పరీక్ష మధ్యలో రద్దయింది. కంప్యూటర్లు మొరాయించడం, మౌస్‌లు పనిచేయకపోవడం వంటి ఇబ్బందులను అభ్యర్థులు ఎద్దుర్కొన్నారు. కాగా, కొందరు అభ్యర్థులను 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు పంపారు. అక్కడ కూడా సాంకేతిక సమస్యల వల్ల ఆన్‌లైన్ పరీక్షను రద్దు చేశారు. మూడు లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం రిజిస్టర్ చేసుకోగా 55,000 మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సమస్యల గురించి ఎస్ఎస్‌సీకి ఫిర్యాదు చేసినట్లు అభ్యర్థులు తెలిపారు. మరోవైపు చలో దిల్లీకి విద్యార్థులు పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న తమపైకి పోలీసులు బలప్రయోగం చేశారని విద్యార్థులు ఆరోపించారు. బ్లాక్‌లిస్ట్ చేసిన కంపెనీకి పరీక్ష నిర్వహణాధికారం ప్రభుత్వం ఇచ్చిందని విమర్శించారు. తమ భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలను ఇలాంటి సంస్థకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. పరిపాలనా లోపాలు, సాంకేతిక వైఫల్యాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనను తీవ్రం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.

# జీతం రూ.15 వేలు... ఆస్తులు రూ.30 కోట్లు

**లోకాయుక్త దాడుల్లో బయటపడ్డ మాజీ క్లర్క్ బాగోతం**



**బెంగళూరు:** కర్నాటకలోని కొప్పల్ జిల్లాలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో గుమాస్తాగా పనిచేసిన వ్యక్తిపై లోకాయుక్త దాడులు నిర్వహించింది. భారీగా అక్రమాస్తులు బయటపడ్డాయి. లోకాయుక్త అధికారుల ప్రకారం... కలకప్ప నిడగుండి, కొప్పల్ జిల్లాలోని కర్నాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివద్ధి సంస్థలో గుమాస్తాగా పనిచేశారు. రూ.15 వేల జీతం తీసుకునే అతడు... భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ కేఆర్ఐడీఎల్ ఇంజినీర్ చిన్చోల్కర్‌తో కలిసి నిడగుండి నకిలీ పత్రాలు, బిల్లులు సష్టించి రూ.75 కోట్లకు పైగా దుర్వినియోగం చేశారని తెలిసింది. దీంతో లోకాయుక్తా దాడులు నిర్వహించింది. దాదాపు రూ.30 కోట్లకు పైగా విలువైన ఆస్తులు బయటపడ్డాయి. దాదాపు 24 ఇళ్లు, 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆస్తులు నిడగుండి, ఆతడి భార్య, సోదరుడి పేర్లతో ఉన్నట్లు తేలింది. అంతేకాదు, ఆయన నివాసం నుంచి 350 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.5 కేజీల వెండి ఆభరణాలు, నాలుగు వాహనాలను (రెండు కార్లు, రెండు బైక్‌లు) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిడగుండిని అదుపులోకి తీసుకున్న లోకాయుక్త అధికారులు విచారణ చేస్తున్నారు.

# బిహార్ ఓటరు ముసాయిదా జాబితా విడుదల

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితాను ఎలక్షన్ కమిషన్ (ఇసి) విడుదల చేసింది. ఈ జాబితాలో సవరణలకు సెప్టెంబర్ 1 వరకు గడువు విధించింది. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హుల పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయవచ్చని తెలిపింది. ముసాయిదా జాబితాను గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. నెల పాటు సాగిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో ఇసి ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. అయితే ప్రస్తుతానికి ఈ ముసాయిదా జాబితాలో చేర్చిన వివరాలు ఇంకా వెబ్‌సైట్‌లో పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కానీ ఇసి వెబ్‌సైట్‌లో ఓటర్లు తమ పేర్లను చెక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ మొదలుకాక ముందు బిహార్‌లో 7.93 కోట్ల మంది రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు. అయితే ప్రస్తుతం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో ఇంకా తెలియరాలేదు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ చేపట్టగా, కీలక విషయాలు బయటపడ్డాయి. బిహార్‌లో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని తెలిసింది. రాష్ట్రంలో ఏకంగా 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఎలక్షన్ కమిషన్ తెలిపింది. మరో 7 లక్షల మంది ఓటర్లు 2 చోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు అధికారుల పరిశీలనలో తెలిసింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా విపక్షాలు అన్నీ తీవ్రంగా ఖండించాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. అంతేకాదు దీనిపై సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం దేశ అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

# కేరళ నన్స్‌ను విడుదల చేయండి

**కేంద్రానికి డిఎంకె ఎంపి లేఖ**



**చెన్నై:** చత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఇద్దరు కేరళ నన్‌ల విడుదలలో జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ పి.విల్సన్ కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిరణ్ రిజిజుకు శుక్రవారం లేఖ రాశారు. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలతో ఇద్దరు కేరళ నన్‌లను చత్తీస్‌గఢ్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరు నన్స్ ప్రీతి మేరీ, వందన ఫ్రాన్సిస్‌ను బీజేపీ పాలిత చత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిరాధార ఆరోపణలతో ఏకపక్షంగా అరెస్ట్ చేశారని లేఖలో పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని, రాజ్యాంగ సమతుల్యతను పునరుద్ధరించేందుకు కేంద్ర మంత్రులు అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని సంబంధిత సవరణను ప్రవేశపెట్టడం ద్వారా జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం)కు రాజ్యాంగ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. మైనారిటీలపై దాడులను క్రిమినల్ చర్యగా పరిగణించి... మతపరంగా మైనారిటీలను రక్షించి, రాజ్యాంగం ప్రకారం వారి హక్కులు కాపాడేలా చూడాలని, జాతీయ మైనారిటీల కమిషన్ చట్టం, 1992ను సవరించాలని కోరారు. జాతీయ మైనారిటీల కమిషన్‌లో చైర్మన్ సహా ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని, గుర్తింపుపొందిన ఆరు మైనారిటీ వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించాలని ఎంపీ విల్సన్ డిమాండ్ చేశారు.

# అత్యాచార కేసులో ప్రజ్వల్ రేవణ్ణ దోషి



**బెంగళూరు:** అత్యాచారం కేసులో జేడీఎస్ అధినేత దేవెగౌడ మనవడు, కర్నాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దోషిగా తేలాడు. బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఈ తీర్పు వెలువరించింది. దీనిపై శనివారం శిక్ష ఖరారు చేయనుంది. ఈ తీర్పు వినగానే ప్రజ్వల్ కోర్టు గదిలోనే కంటతడి పెట్టుకున్నాడు. ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ దారుణాన్ని రికార్డు చేసి బెదిరించేవాడంటూ ఓ మహిళ సైబర్ క్రైమ్ స్టేషన్‌లో గతేడాది ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక బందం దర్యాప్తు చేసి 2 వేల పేజీల చార్జిషీట్ దాఖలు చేసింది. విచారణలో భాగంగా 123 ఆధారాలు సేకరించింది. దీనిపై ప్రత్యేక న్యాయస్థానంలో డిసెంబర్ 31, 2024న విచారణ ప్రారంభమైంది. ఫోరెన్సిక్ ఆధారాలను పరిగణనలోకి తీసుకున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల వేళ హాసన సెక్స్ కుంభకోణం కర్నాటకలో ప్రకంపనలు సష్టించింది. నాడు ఓ మహిళ షాకింగ్ విషయాలు వెల్లడించింది. తన తల్లిపై కొన్నేళ్ల క్రితం బెంగళూరులోని నివాసంలో ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. దీనికి సంబంధించి సిట్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. అంతేకాకుండా ప్రజ్వల్ వీడియో కాల్‌లో బెదిరించి తన దుస్తులు విప్పించినట్లు తెలిపింది. 'ఆయన మా అమ్మ ఫోన్‌కు కాల్ చేసి... వీడియో కాల్‌లో మాట్లాడాలని నన్ను బలవంతం చేసేవాడు. నా దుస్తులు విప్పాలని అడిగేవాడు. నేను అందుకు నిరాకరిస్తే... నాకు, మా అమ్మకు హాని తలపెడతానని బెదిరించేవాడు' అని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాము ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగానే... తన తండ్రిని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొంది. తన నివాసంలో పనిచేసే మహిళలను ప్రజ్వల్ వేధింపులకు గురిచేశాడని తెలిపింది. ప్రజ్వల్ బాధితుల్లో ఎంతో మంది మహిళలు ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది..

# 'మనీలాండరింగ్ కేసు'లో అనిల్ అంబానీ...

**• ఆగస్టు 5న విచారణకు హాజరు కావాలి • ఇడి సమన్లు జారీ**




న్యూఢిల్లీ : రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ తన గ్రూప్ కంపెనీలపై కోట్లాది రూపాయల బ్యాంక్ రుణ మోసంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఆగస్టు 5న విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమన్లు జారీచేసింది. శుక్రవారం అధికావర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. 66 ఏళ్ల అనిల్ అంబానీ ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధానకార్యాలయంలో కేసు నమోదైనందున సాక్ష్యం ఇవ్వాలని కోరినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌వి) కింద ఒకవేళ ఆయన సాక్ష్యం ఇచ్చేందుకు ప్రధానకార్యాలయానికి వస్తే ఆయన స్టేట్‌మెంట్‌ను ఇడి అధికారులు రికార్డు చేయనున్నట్లు వారు చెప్పారు. మరి కొద్ది రోజుల్లో అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు చెందిన కొందరు ఎగ్జిక్యూటివ్ లను కూడా విచారణకు హాజరుకావాలని సమన్లు జారీచేశారు. గత వారం 50 కంపెనీలకు చెందిన ఎగ్జిక్యూటివ్స్ సహా 25మందికి చెందిన 35ప్రాంగణాలలో ఇడి అధికారులు సోదాలు నిర్వహించన తర్వాత ఈ సమన్లు జారీఅయ్యాయి. ఈ సోదాలు జులై 24న ప్రారంభమై మూడు రోజులపాటు కొనసాగాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాక్చర్ (ఆర్ ఇన్‌ఫ్రా) సహా అనిల్ అంబానీకి చెందిన మల్టిపుల్ గ్రూప్ కంపెనీలలో రూ.17,000 కోట్లకు పైగా సామూహిక రుణ మళ్లింపుకు సంబంధించి ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డ విషయంలో ఈ చర్యలు చేపడుతున్నారు. సెబీ నివేదిక ఆధారంగా ఇడి కనుగొన్న విషయం...ఆర్ ఇన్‌ఫ్రా ఇంటర్ కార్పొరేట్ డిపాజిట్లు(ఐసిడీ'స్)గా మారువేషంలో ఉ న్న నిధులను రిలయన్స్ గ్రూప్ కంపెనీల ద్వారా సిఎల్ఇ అనే పేరుతో ఉన్న కంపెనీకి బదిలీ చేసింది. ఆర్ ఇన్‌ఫ్రా సిఎల్ఇ అనే కంపెనీని తన సంబంధిత పార్టీగా ఇంతకుముందు ఎన్నడూ వెల్లడించలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కనుగొంది. వాటాదారులు, ఆడిట్ ప్యానెల్‌ల నుంచి ఆమోదాలను నివారించడానికి సిఎల్ఇని దాని సంబంధిత పార్టీగా వెల్లడించలేదని ఆరోపించబడింది. రిలయన్ గ్రూప్‌నకు చెందిన ఒక అధికార ప్రతినిధి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేరు వెల్లడించని ఒక పార్టీ ద్వారా రూ.10,000కోట్ల నిధులు మళ్లింపుచేశారనే ఆరోపణ 10ఏళ్ల క్రితంనాటిదని, అది కంపెనీకి చెందిన పాత విషయమని, కంపెనీకి దాని ఎక్స్‌పోజర్ రూ.6,500 కోట్ల మేరకేనని ఆర్థిక నివేదికలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. రిలయన్స్ ఇన్‌ఫ్రా దాదాపు ఆరునెలల క్రితం 2025 ఫిబ్రవరి 9న బహిరంగంగా వెల్లడించిందని ఆ ప్రకటనలో తెలియజేశారు. అనిల్ అంబానీ 2022 మార్చి నుంచి 3 సంవత్సరాలకు పైగా ఆర్ ఇన్‌ఫ్రా బోర్డులో లేరని కంపెనీ తెలియజేసింది.20172019 మధ్యకాలంలో అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు 'ఎస్' బ్యాంక్ ఇచ్చిన దాదాపు రూ.3,000కోట్ల అక్రమ రుణ మళ్లింపు ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దృష్టి పెట్టింది. రుణం మంజూరు చేయడానికి ముందే 'ఎస్' బ్యాంక్ ప్రమోటర్లు డబ్బు అందుకున్న విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కనుగొంది. ఈ కంపెనీలకు ఎస్ బ్యాంక్ రుణ ఆమోదాలలో 'స్థూల ఉల్లంఘనల' ఆరోపణలను కూడా ఇడి పరిశీలిస్తోందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఈరుణాలను అనేక షెల్ (నకిలీ) కంపెనీలకు మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి.

ప్రజాపక్షం
శనివారం, 02 ఆగస్టు

# అమెరికా టారిఫ్ పిడుగు

భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన మోదీ ప్రభుత్వానికి మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లు ఉంది. అంతే కాదు రష్యాతో చమురు, ఇంధనం, ఆయుధాలు, రక్షణ శాఖ పరికరాలు కొనుగోలు చేస్తున్నందుకు భారీ జరిమానా కూడా విధిస్తానని హూంకరించడం మరింత దిగ్భ్రాంతికి గురి చేసింది. మొన్నటి వరకు వ్యాపారం ఆశ చూపి భారత దేశం, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపానని చెప్పిన ట్రంప్, ఇప్పుడు మనకంటే తక్కువగా పాకిస్థాన్‌పై 19 శాతమే సుంకాన్ని విధించారు. పుండు మీద కారం చల్లినట్లు పాకిస్థాన్‌లో చమురు నిక్షేపాలను వెలికితీసేందుకు ఒప్పందం కుదరిందని, భారత్ ఆ దేశం నుంచి చమురు కూడా కొనే రోజు వస్తుందని దెప్పి పొడవడం అవమానకరం. ఎందుకంటే, మోదీకి అగ్రరాజ్యాధినేత ట్రంప్ అత్యంత సన్నిహితుడని, గతంలో ఏ భారత ప్రధానికి అమెరికా అధ్యక్షునితో లేనంత సాన్నిహిత్యం ఆయనకు దక్కిందని మోదీ అభిమానగణం, కాషాయ దళం సోషల్ మీడియాలో అదేపనిగా ఊదరగొట్టింది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా నమస్తే ట్రంప్, హౌడీ మోదీ వంటి కార్యక్రమాలను నిర్వహించి, వారిరువురిది గాఢమైన బంధమనేలా భ్రమలు కల్పించారు. బిజెపి ఓవర్సీస్ ఫ్రెండ్స్ పేరుతో ప్రవాస భారతీయులు ప్రచారం చేసినప్పటికీ ట్రంప్‌కు ఆ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. అమెరికా ఎన్నికలను కూడా మోదీ ప్రభావితం చేస్తారని సోషల్ మీడియాలో సృష్టించిన గాలి బుడగ బద్ధలైంది. రెండవసారి అధ్యక్షుడు అయ్యాక మరోసారి ట్రంప్ గెలవడం భారత్‌కు మంచిదని, ఆయనతో మోదీకి ఉన్న స్నేహం దేశానికి ఉపయోగ పడుతుందని జోరుగా ప్రచారాలు సాగాయి.

అందుకు భిన్నంగా ట్రంప్ చర్యలు సాగుతున్నాయి. మొన్నటికి మొన్న పెహల్గామ్ దారుణ కృత్యానికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు అమెరికా అండగా నిలుస్తుందని అందరూ ఊహించినా అది వట్టి మాటేనని తేలిపోయింది. టారిఫ్‌లు తగ్గిస్తాడేమోనని ఆశలు పెట్టుకొని, విపక్షాలు ఎంత నిలదీసినా పార్లమెంటులో జరిగిన ప్రత్యేక చర్చలో ట్రంప్ పేరెత్తేందుకు ప్రధాని మోదీ వెనుకంజ వేశారు. రాజ్యసభలో ప్రత్యేక చర్చ ముగిసిన మరుసటి రోజే డొనాల్డ్ ట్రంప్ తాజా టారిఫ్‌లను ప్రకటించారు. అమెరికా ఆ జాబితాలో చూస్తే పొరుగుదేశాలన్నిటికంటే భారత్‌పై విధించిన 25 శాతం సుంకమే అధికం. బంగ్లాదేశ్‌పై 20 శాతం, ఆఫ్ఘనిస్థాన్‌పై 15 శాతం, శ్రీలంకపై 20 శాతం సుంకాలను అమెరికా నిర్ణయించింది.

టారిఫ్‌లపై ట్రంప్ తాజా నిర్ణయం నేపథ్యంలో ఇప్పటికే రికార్డుస్థాయిలో పతనమైన రూపాయి విలువ మరింత తగ్గే అవకాశం ఉంది. ఈ ఏడాది జిడిపి సైతం 0.04 శాతం తగ్గుతుందనే అంచనా. మనకంటే బంగ్లాదేశ్‌పై 5 శాతం తక్కువ సుంకాలు విధించడంతో అమెరికాకు ఎగుమతయ్యే మన వస్త్రాలు, తయారీ రంగ ఉత్పత్తులపై ప్రభావం చూపుతుంది. మన వ్యాపారం ఆ దేశానికి మళ్ళే అవకాశం లేకపోలేదు. వజ్రాలు, ఔషధ రంగాలు, వాహన పరికరాలపై కూడా ప్రభావం చూపనుంది. జపాన్, దక్షిణ కొరియా, ఇండోనేషియా, వియత్నాం, ఇయు దేశాలపై 15 –20 శాతమే టారిఫ్ నిర్ణయించడంతో ఐటి, ఇతర సర్వీసు రంగాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో భారత్–అమెరికా దేశాలు వాణిజ్య విలువ 186 బిలియన్ డాలర్లుగా ఉంది. అందులో అమెరికాకు మనం 86.5 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేస్తుండగా, ఆ దేశం నుంచి 45.3 బిలియన్‌ల మేరకు దిగుమతులు చేసుకుంటున్నాము. భారతదేశం సుమారు 41 బిలియన్ డాలర్లు వాణిజ్య మిగులును కలిగి ఉంది. ఇప్పుడు అది తగ్గితే విదేశీ మారక నిలువలు తగ్గే ప్రమాదం ఉంది.

ఇంత జరుగుతున్నా మోదీ ప్రభుత్వం ఆచితూచి స్పందిస్తుంది. కాల్పుల విరమణ తానే చేయించానని ట్రంప్ ముప్పై సార్లు ప్రకటించినా మన ప్రభుత్వాధినేతలు ఆయనను నేరుగా ఖండించేందుకు సాహసించలేదు. ఇప్పుడు భారతదేశాన్ని మృత ఆర్థిక వ్యవస్థ అని తీవ్ర వ్యాఖ్యలు చేసినా ఘాటుగా స్పందించేందుకు కేంద్రం పెద్దలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పైగా తెల్లదొరను ప్రసన్నం చేసుకునేందుకు అమెరికా నుంచి ఖనిజ వాయువు, సమాచార పరికరాలు, బంగారాన్ని మరింత పెద్ద ఎత్తున దిగుమతి చేసుకునేందుకు సిద్ధపడుతున్నట్లు అభిజ్ఞవర్గాల భోగట్టా!

# మే 9 రాత్రి అసలేం జరిగింది?


నిత్యా చక్రవర్తి

ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరిగిన చర్చకు సుదీర్ఘంగా సమాధానమిచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్‌తో పోరాట విరమణకు మధ్యవర్తిత్వం చేశారా అన్న అంశాన్ని నేర్పుగా దాటవేశారు. ఆపరేషన్ సిందూర్ ఆపు చేయాలని ఏ ప్రపంచ నాయకుడూ భారత్‌కు చెప్పలేదని ప్రధాని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ మౌలిక వసతులను భారత్ ధ్వంసం చేశాక, పాకిస్థాన్ డిజిఎంఒ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్) మే 10న పోరాట విరమణకు ప్రాధేయపడ్డారని, ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు అప్పటికే నెరవేరినందున భారత్ అంగీకరించిందని ప్రధాని చెప్పారు.

ఇది అర్ధ సత్యం. మే 9–10న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌తో జరిపిన సంభాషణలో ఒక భాగాన్ని మాత్రమే ప్రధాని నేర్పుగా వెల్లడించారు. ప్రధానమంత్రి పోరాట విరమణ నిర్ణయానికి రావటానికి ఆ సంభాషణే మూలం. ఎదురుదాడికి పాకిస్థాన్ సన్నద్ధమవుతున్నదని వాన్స్ చెప్పినపుడు, దాడి చేయటానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తే భారత్ తీవ్రంగా ప్రతిస్పందిస్తుందని వాన్స్‌కు చెప్పానని, వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, పాకిస్థాన్ నుండి వచ్చే ఒక్కొక్క బుల్లెట్‌కు శతఘ్నితో సమాధానం చెబుతామని తాను చెప్పినట్లు ప్రధాని లోక్‌సభకు చెప్పారు.

ఇది చాలా బాగుంది. ఆ విపత్కర గంటలో వాన్స్‌తో సంభాషణలో ఇది తప్పక ఒక భాగం. అయితే వాన్స్ అధ్యక్షుడు ట్రంప్ తరఫున మాట్లాడారు, భారత ప్రధాని ప్రియమిత్రుని సందేశాన్ని ఆయన అందజేశారు. సంభాషణ చాలాసేపు సాగింది. పాకిస్థాన్ పెద్ద ఎత్తున దాడిచేసే అవకాశం గూర్చి వాన్స్ చెప్పింది పోను ఆయన ఏ ఇతర విషయాల గూర్చి మాట్లాడారు?

మే 7 తెల్లవారుఝామునుంచి మే 10 సాయంత్రం అధ్యక్షుడు ట్రంప్ పోరాట విరమణ ప్రకటన చేసి, తానే ఆ అంగీకారం సాధించానని చెప్పుకున్న సమయం వరకు ఏం జరిగిందో మనం గుర్తు చేసుకుందాం. మే 7 తెల్లవారుజామున టెర్రరిస్టు స్థావరాలపై భారత్ విధ్వంసకర దాడులు చేశాక, పాకిస్థాన్ ఎదురుదాడి చేసింది. అయితే తమ గగనతల నిఘా నెట్‌వర్క్‌కు భారత్ వ్యవస్థ తీవ్రంగా నష్టం కలిగించిందని అది కనుగొన్నది. గగనతలం రక్షణకు భారత్ వ్యవస్థ మెరుగ్గా ఉన్నందున భారత్‌లో ఎంచుకున్న లక్ష్యాలపై పాకిస్థాన్ దాడి చేయలేకపోయింది. మే 8 నుండి పాకిస్థాన్ వర్గాలు తమ అణ్వస్త్ర బోర్డు సమావేశం జరుపుతున్నదని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందనే వార్తలు ప్రచారంలో పెట్టాయి. పాకిస్థాన్ వర్గాలు దీన్ని ఉద్దేశపూర్వకంగా వాషింగ్టన్‌కు చేరవేశాయి. దక్షిణాసియాలో అణుయుద్ధం అవకాశం పట్ల ట్రంప్ భయకంపితుడైనారు. భారత్, పాకిస్థాన్ ప్రధాన మంత్రులతో మాట్లాడాలని, 24 గంటల్లోపు పోరాట విరమణను ఏర్పాటు చేయాలని ఆయన తన విశ్వాసపాత్రులైన అధికారులు మార్క్ రుబియో, జెడి వాన్స్‌లను కోరారు.

మే 9న మహావేగంతో జరిగిన పరిణామాల తీరు ఇదీ. మార్క్ రుబియో మే 9 రాత్రి (ఇస్లామాబాద్‌లో ఉదయం 4.45గంటలు) పాక్ సైన్యాధిపతి, భారత్–పాక్ యుద్ధానికి సంబంధించి అత్యంత ముఖ్యమైన నిర్ణయాధికారి ఆశిం మునీర్‌తో మాట్లాడారు. అతనికి నచ్చజెప్పారు. యుద్ధం నుంచి ఏదో రకంగా బయటపడటానికి ఆపద్ధర్మ ఫార్ములా కోసం చూస్తున్న పాకిస్థాన్‌ను ఒప్పించటానికి రూబియో కష్టపడలేదు. ప్రధాని మోదీకి నచ్చజెప్పే బాధ్యతను వాన్స్ తీసుకున్నారు. ప్రధాని ప్రస్తావించినట్లు మే 9 రాత్రి ఆయన ఆ ప్రయత్నం చేశారు. భారత ప్రధాని నిర్ణయం తీసుకోవడంలో ఏది కచ్చితంగా పనిచేసిందో వాన్స్–మోదీ చర్చల పూర్తి వివరాలు వెల్లడించగలవు.



ప్రధాని మోదీ నుంచి వాన్స్ ధృవీకరణ తీసుకున్న తదుపరి, పోరాట విరమణకు భారత్ అంగీకరిస్తున్నదని, అయితే పాకిస్థాన్ డిజిఎంఒ ముందుగా ఇండియాకు ఫోను చేసి ప్రతిపాదన చేయాలని చెప్పటం జరిగింది. ఆ ప్రకారం పాకిస్థాన్ డిజిఎంఒ మే 10 మధ్యాహ్నం భారత డిజిఎంఒకు ఫోను చేశారు. అయితే భారత్ డిజిఎంఒ సమావేశంలో ఉన్నారు. ఆ తర్వాత మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు – సాయంత్రం 5 గంటల నుంచి అమలులోకి వచ్చేలాగున పోరాట విరమణకు డిజిఎంఒలు ఇరువురూ అంగీకరించారు. ఈ పరిణామాలను ట్రంప్ అవిరామంగా గమనిస్తున్నారు. ఇరు దేశాల డిజిఎంఒలు అధికారికంగా అంగీకరించటంతో, భారత విదేశాంగ కార్యదర్శి విక్రంమిస్రి సాయంత్రం అధికారికంగా పోరాట విరమణ అంగీకారం ప్రకటించకమునుపే, తాను ఆ విరమణ సాధించినట్లు చెప్పుకుంటూ ట్రంప్ భారత్–పాకిస్థాన్‌ల మధ్య పోరాట విరమణ ప్రకటన చేశారు.

బుధవారం రాజ్యసభలో చర్చలో విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ప్రధానమంత్రిని సమర్థిస్తూ ఆపరేషన్ సిందూర్ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ ఎన్నడూ ప్రధాని మోదీతో మాట్లాడలేదన్నారు. అది సరైనదే. పహల్గాంలో 26 మంది యాత్రికుల ఊచకోత తదుపరి, టెర్రరిస్టులకు వ్యతిరేకంగా పోరాటానికి తోడ్పాటు ప్రకటిస్తూ ఏప్రిల్ 22న ట్రంప్ మోదీతో మాట్లాడారు. మళ్లీ మే 17న – పోరాట విరమణ తదుపరి వారం రోజులకు మాట్లాడారు. అయితే మే 8–10 మధ్య మార్క్ రూబియో, జెడి వాన్స్ అధ్యక్షుడు ట్రంప్ తరఫునే మాట్లాడారు. అమెరికా అధికారులు తమ బాస్ ఆదేశంపైనే సంప్రదింపులు జరిపారు. అందువల్ల మే 7–10 మధ్య ట్రంప్ మోదీతో నేరుగా సంభాషించలేదని, అందువల్ల పోరాట విరమణ నిర్ణయంలో ట్రంప్ పాత్ర లేదని జైశంకర్ చెప్పడం తప్పు. ప్రభుత్వ ఆదేశాలు ఉన్నతాధికారుల ద్వారా ఇతర హెడ్స్‌కు ఎలా తెలియజేయబడతాయో దీర్ఘకాలంగా విదేశీ వ్యవహారాల మంత్రిగా ఉన్న జైశంకర్‌కు తెలియంది కాదు.

ట్రంప్ అబద్ధమాడుతున్నారని పార్లమెంటులో చెప్పటం ద్వారా ప్రధాని మోదీ పాకిస్థాన్‌తో పోరాట విరమణపై స్పష్టత ఇవ్వాలని ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ డిమాండు చేశారు. "ట్రంప్, మీరు అబద్ధాలకోరు, మీరు పోరాట విరమణ సాధించలేదు, మేము యుద్ధ విమానాలేవీ కోల్పోలేదు" అని మోదీ చెప్పాలంటాడు రాహుల్. భారత ప్రధాని ఆ మాట చెప్పలేదు. అమెరికా జోక్యం లేకుండా భారత్ తనంతట తానుగా పోరాట విరమణ నిర్ణయించి ఉంటే ఆయన కనీసం ట్రంప్ పేరు ప్రస్తావించి, ఈ ట్రంప్ ప్రకటన వాస్తవం కాదని చెప్పి ఉండాల్సింది. ట్రంప్ ఇప్పటికీ కూడా – 29వసారి– తానే పాక్–భారత్ మధ్య పోరాట విరమణ సాధించానని చెబుతున్నారు.

పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సముదాయం నుంచి భారత్‌కు అందిన తోడ్పాటు విషయంలో ప్రధాని మోదీ వాస్తవాలు చెప్పటం లేదు. భారతదేశంలో, దాని ప్రజలకు వ్యతిరేకంగా టెర్రరిస్టు దాడులకు వ్యతిరేకంగా భారత్‌కు పూర్తి మద్దతు లభించింది. అయితే ఆపరేషన్ సిందూర్ విషయంలో ఈ దాడులను పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్నదని ప్రపంచ వేదికలో భారత్ నిరూపించలేకపోతున్నందున ఆ మద్దతు లభించటం లేదు. పహల్గాంలో దాడిచేసిన దుండగులతో పాకిస్థాన్ సంబంధాలను భారత్ చూపటం లేదని పాకిస్థాన్ ఐరాసలో, ఇతర దేశాలతో సంభాషణల్లో చెబుతున్నది.

అంతర్జాతీయ స్థాయిలో భారత్ దౌత్యపరంగా రెండేళ్ల క్రితంకన్నా కూడా ఇప్పుడు మరింత ఏకాకి అవుతున్నది. ప్రధానమంత్రి కొత్త సూత్రాన్ని (టెర్రరిజం ఉన్నంతకాలం ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది) ప్రచారం చేయటానికి దౌత్యాధికారులు వివిధ దేశాల్లో ప్రయత్నిస్తున్నా అది ఫలితమివ్వటంలేదు. ఎందుకంటే, అది భారత్–పాక్ ఉపఖండంలో ఉద్రిక్తతను శాశ్వతం చేసేదిగా ఉంది. భారత ప్రధానమంత్రి మిత్రుడైన ట్రంప్ భారత్, పాకిస్థాన్‌లను ఒకేగాటన కడుతున్నారు. పైగా పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, ఇప్పుడు ఫీల్డ్ మార్షల్ ఆశిం మునీర్‌కు వైట్‌హౌస్‌లో విందు కూడా యిచ్చారు. రష్యా ఉద్రిక్తతల సడలింపునకై భారత్, పాకిస్థాన్ చర్చలకు విజ్ఞప్తి చేసింది. చైనా, తుర్కియేలు వివాదాలపై ద్వైపాక్షిక సంభాషణలు కోరుతూనే పాకిస్థాన్‌ను బాహాటంగా బలపరిచాయి.

ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లేదా చైనాలపై ఎప్పుడూ దూకుడుగా మాట్లాడటం రాజకీయ పరిపక్వత అనిపించుకోదు. అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు–వాటి విషయంలో ఎంతో ఓపిక అవసరం. పిఒకెని స్వాధీనం చేసుకునే అవకాశాన్ని భారత్ చేజార్చుకున్నదని అనటం పరిపక్వత అనిపించుకోదు. దేశీయ సమస్యలపై సరైన విధానాలు అనుసరిస్తున్న రాహుల్ విదేశాంగ విధాన సమస్యలపై అపసవ్యంగా ఉంటున్నారు. ఎంతో నేర్చుకోవాల్సి ఉంది.

సుదీర్ఘమైన చర్చలో నరేంద్రమోదీ సునాయాసంగా బయటపడ్డారు. వాన్స్‌తో సంభాషణల అంశంపై గట్టిగా పట్టుబట్టటంలో ప్రతిపక్షాలు విఫలమైనాయి. ప్రధాని కూడా అసంగత విషయాలపై కేంద్రీకరించారు. నెహ్రూ పేరు పద్నాలుగుసార్లు ప్రస్తావించిన మోదీ ట్రంప్ పేరు ఒక్కసారీ ఉచ్ఛరించలేదు. చర్చలో ప్రధానమంత్రి ప్రసంగానికి వైట్‌హౌస్ ఎలా ప్రతిస్పందిస్తుందో మున్ముందు చూడాలి.

(ఐపిఎ సర్వీస్)

# మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్స్ నిశ్శబ్ద దాడి

మైక్రోప్లాస్టిక్స్ అంటే పరిమాణం 5 మిల్లీమీటర్ల కన్నా తక్కువ వ్యాసం కలిగిన సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు లేదా నానో ప్లాస్టిక్స్. ఇవి అధికంగా వినియోగించే ప్లాస్టిక్ ఉత్పత్తుల విచ్ఛిన్నం ద్వారా లేదా ప్రాథమికంగా తయారయ్యే రూపాల్లో పరిసరాల్లోకి, భూగర్భ జలాల్లోకి చేరతాయి. ఇటీవల ఆర్కిటిక్ ప్రాంతంలోని మంచులో సైతం మైక్రో ప్లాస్టిక్ కనుగొనబడింది. జపాన్ శాస్త్రవేత్తల బృందం మొదటిసారిగా మేఘాలలో తొమ్మిది రకాల రసాయనాలతో కూడిన మైక్రో ప్లాస్టిక్ లను కనుగొంది. మైక్రోప్లాస్టిక్స్ ప్రధానంగా రెండు రకాలు: ప్రాథమిక మైక్రో ప్లాస్టిక్స్ మరియు ద్వితీయ మైక్రో ప్లాస్టిక్స్. సౌందర్య సాధనాలు, ప్లాస్టిక్ ఫైబర్లలో కనిపించే మైక్రోబీడ్స్ , పెయింట్స్, పారిశుధ్య ఉత్పత్తులు, టైర్లు, సింథటిక్ వస్త్రాల నుండి తొలగించబడిన మైక్రో ఫైబర్లు. పరిసరాల్లో పెద్ద ప్లాస్టిక్ పదార్థాలు వాతావరణం, రసాయనిక చర్యల వల్ల చిన్న ముక్కలుగా విడిపోయి ఏర్పడతాయి. వీటినే ద్వితీయ మైక్రో ప్లాస్టిక్స్ అంటారు. రసాయనాలను సమర్థవంతంగా గ్రహించడానికి, యంత్రాలను శుభ్రపరచడానికి, ఎయిర్ బ్లాస్టింగ్ టెక్నాలజీలో ఉపయోగపడతాయి. సౌర వికిరణం, సముద్ర తరంగాలు ఈ విచ్ఛిన్నానికి కారణం. మైక్రోప్లాస్టిక్ స్థాయి మనుషులలో 328.44ug/g. ఇది అత్యంత ఆందోళనకరమైన అంశం. 2025 చివరి నాటికి 217 దేశాలు 5 మిలియన్ టన్నుల మైక్రోప్లాస్టిక్‌లను సముద్రాల్లోకి విడుదల చేస్తాయని అంచనా. ఇవి సముద్రం అడుగుభాగాన అవక్షేపాలతో గణనీయంగా పేరుకుపోతాయి. ఇనుము, బేరియం వంటి ప్రమాదకరమైన భారీ లోహాలు మైక్రో ప్లాస్టిక్‌లలో కనబడ్డాయి. చేపలు, తిమింగలాలు వంటి సముద్ర జీవులు మైక్రోప్లాస్టిక్స్‌ను



ఆహార రూపంలో తీసుకుంటాయి. దీనివల్ల విష రసాయనాల బయో అక్యుమ్యులేషన్ ఆహార గొలుసులో పైకి వెళ్తూ చివరికి మనుషుల శరీరాల్లోకి చేరుతాయి. మైక్రోప్లాస్టిక్స్ పంట భూముల్లో, భూగర్భ జలాల్లో కూడా కనిపించాయి. సేంద్రియ ఎరువుల ద్వారా కూడా నేలల్లోకి చేరడం వల్ల ఉపయోగకర సూక్ష్మ జీవుల జాతులు అంతమవుతున్నాయి. గాలిలో తేలియాడే మైక్రోప్లాస్టిక్స్ ఎక్కువ దూరం ప్రయాణం చేయడానికి వీలుగా ఉంటాయి. ఊపిరితిత్తుల్లో చేరి ఆస్తమా, వాపు వంటి వ్యాధులకు దారి తీస్తున్నాయి. 2022లో జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో 60శాతం మందిలో రక్త నమూనాల్లో మైక్రోప్లాస్టిక్స్‌ను గుర్తించారు. మైక్రోప్లాస్టిక్స్‌ను కలిగి ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల రక్త కణజాలల్లోకి ఇవి స్వేచ్ఛగా ప్రవేశిస్తుంది. దీని ద్వారా ఎర్ర రక్త కణాలు ఆక్సిజన్‌ను మోసుకెళ్లే సామర్థ్యం దెబ్బతింటుంది. పేగు గోడల్లో ఇన్‌ఫ్లమేషన్, పేగు మైక్రోబయోమ్ దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ రసాయనాలు, డిఎన్‌ఏ అమరికను, మెదడు పనితీరును, ఎండోక్రైన్ వ్యవస్థను, గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావితం చూపుతుందని తేలింది. వన్యప్రాణులు, పక్షులు, చేపలు, సముద్ర జీవులు మైక్రోప్లాస్టిక్స్‌ను తినడం వల్ల మరణిస్తున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలి. నూతన నానోఫిల్టర్లు, ప్లాస్మా టెక్నాలజీలు నీటి నుండి మైక్రోప్లాస్టిక్స్‌ను తొలగించగలవు. ప్లాస్టిక్‌కు బదులుగా బయోడిగ్రేడబుల్ వస్తువులు, మొక్కల ఆధారిత ఫిల్టర్లు, సహజ ఫైబర్ వస్త్రాలను ప్రోత్సహించడం చేయాలి. మైక్రోప్లాస్టిక్ కాలుష్యం నిశ్శబ్ద ప్రమాదంగా మారుతోంది. శాస్త్రీయ అవగాహన, సాంకేతిక పరిష్కారాలు మరియు ప్రజల చొరవ ద్వారా దీన్ని నియంత్రించడం సాధ్యమవుతుంది. మైక్రో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడం మనం సమిష్టిగా తీసుకోవాల్సిన బాధ్యత.

– వెంకట రమణ గిలకత్తుల
9866878769

# మానవత్వం ఏమైపోతోంది?

ఆలోచనలు ఒక్కోసారి మనసును గాయపరుస్తుంటాయి. ఎంత బయటపడాలన్న ఇరకాటంలో పెట్టి తెగ వేధిస్తుంటాయి. ఉక్కిరి బిక్కిరి చేస్తుంటాయి. సమాజంలో మన బాధ్యత ఏంటి ? మనమేం చేస్తున్నాం? జరుగుతున్న అన్యాయాలను చూసి ప్రశ్నల మేఘం కమ్ముకుంటుంది మది గోడల చుట్టూ. నా దుఃఖాన్ని చూసి వెక్కిరిస్తుంది చుట్టూ వున్న పరివారమంతా. జవాబు తెలియని ప్రశ్నా పత్రంలా అల్లాడిపోతోంది గుండె. చుట్టూ మనలను పట్టుకుని వ్రేలాడుతున్న సంబంధబాంధవ్యాలను చూసి మనం మురిసిపోతున్నాం అనిపిస్తుంది. ఎందుకంటే, బంధాల నడుమన బాధ్యత కరువైపోతుంది. ఈ రోజు మనతో ప్రేమగా వున్నవారు రేపెలా వుంటారో తెలియదు. ఈరోజు నీ వెంట వున్న స్నేహం, రేపటి రోజున నిన్ను చూసి ఈర్ష్య ద్వేషాలను కమ్ముకుంటుంది. నీ నవ్వును చూసి ఓర్వలేక అసూయతో తనను తాను హతమార్చుకుంటుంది. నువ్వు బాధల్లో ఉంటే నవ్వుకుంటుంది. నువ్వు నవ్వుతున్నప్పుడు కుళ్ళుకుంటుంది. అదే సమాజం నువ్వు కిందపడితే చెయ్యందించి పైకి లేవనెత్తలేదు. నువ్వు ఎదుగుతుంటే చూడలేదు. పిలుపులో ఉన్నంత లౌక్యం ఆదరణతో ఏ మాత్రం అగుపించడం లేదు. ప్రస్తుతం బంధాల్లో మానవత్వం ఏమవుందనేది ప్రశ్నర్థకమే! అమ్మ కూతుర్ని చంపేస్తుంది. కొడుకులు తండ్రిని చంపేస్తున్నారు. అన్న చెల్లిని చంపేస్తాడు. భర్తకు భార్యంటే పగ. భార్య భర్తను చంపేసి భర్త కుటుంబీకులకు పార్సిల్ చేసి పంపిస్తుంది. అన్నదమ్ములకు శత్రుత్వం. అక్క చెల్లెళ్ళ మధ్యన స్వార్థం గూడుకట్టుకుంటుంది. ఏమనుకోవాలి ? అవసరం వున్నప్పుడు ఒకలా అవసరం తీరాక ఒకలా ప్రవర్తిస్తారు మన అనుకున్నవాళ్ళే. నటనలో జీవిస్తారనిపిస్తుంది ఒక్కోసారి వారి ప్రవర్తన చూస్తుంటే. మన ఆత్మస్థైర్యమే మనకు బలమవ్వాలి ఈ భువిపై ప్రశాంతంగా బ్రతకాలి అనంటే. ఎందుకంటే, ఏ బంధానికి గ్యారంటీ లేదిప్పుడు



నిన్నగాక మొన్న గుంటూరు జిల్లా మంగళగిరి, నిడమర్రులో టిటికో గృహాల వద్ద అప్పుడే పుట్టిన ఆడ బిడ్డను వదిలేసి వెళ్ళిపోయింది ఒక తల్లి. బిడ్డను పెంచలేక అనుకోవాలా? బరువు దించుకుంది అనుకోవాలా? లేక ఆడపిల్ల పుట్టిందని వదిలెల్లింది అనుకోవాలా? అసలు అలా వదిలెల్లింది అంటే ఆమె తల్లేనా? కామ కోర్కెలతో నిండి కోరిక తీరాక కక్కేసి వెళ్లి ఉంటుందా..? వీడి కుక్కలు కూడా పొత్తిళ్ళలో బిడ్డను నడిరోడ్డుపై విడిచిపెట్టి పోవు కదా..? మానవత్వాన్ని కోల్పోయి ఎందుకింతలా ప్రవర్తిస్తున్నారు. తృప్తిలేని జీవితాలు ఆత్మ సంతృప్తి కోసం వాళ్లకేమనిపిస్తే అంది చేసేస్తున్నారు. తెల్లారితే ప్రసారమాధ్యమాల్లో నిలుస్తారని తెలుసు కదా వాళ్లకి. లోకం కోడైకూస్తుందని తెలుసు కదా. నిన్నటి రోజున ఆరేళ్ళ పాప అనుకుంటా బుద్ధిగా కూర్చొని హోమ్ వర్క్ చేసుకుంటుంది. తండ్రి పాప ఎదురుగా ఒక పొట్టి నిక్కరు వేసుకొని కూర్చుని టీవీ చూస్తున్నాడు. సరే కూర్చున్నాడు అంతవరకు బానే వుంది వాడి కాళ్లతో ఆ పాపను పెటి పెటిమని తన్నుతున్నాడు. ఎందుకు తన్నుతున్నావ్ అని ఆ పాప తల్లి అడుగుతుంటే మాట్లాడడం లేదు. కూతుళ్ళకు తండ్రి అనేవాడు రక్షకభటుడిలా ఉండాలి. రాక్షసుడిలా ఉండకూడదు. వాగులో వున్న చేపపిల్లకు ఏరేటో తెలియదు, తనున్నదెక్కడో తెలియదు. అలా ఉండొద్దు తల్లి, తండ్రులు. మీ పిల్లలను ప్రేమతో పెంచండి. మీ వ్యసనాలకు వారిని బలికానీయకండి. మీ కోర్కెలకు వారిని ఆయుధాలుగా మార్చకండి. కన్నవారుగా వారి బాధ్యత నెరవేర్చండి. భారం అనుకోని వదిలెయ్యడమో, అక్రమ సంతానంగా వారి జీవితాన్ని ముగించెయ్యడమో చెయ్యకండి. చేసిన పాపాలకు మరో జన్మ అవసరం లేదు. ఈ జన్మ చాలు. పురిటినొప్పులతో అల్లాడుతున్న తల్లి పొట్టలో నుండి బయటికొచ్చేటప్పుడు ఉమ్మనీటిలో నుండి ఎంత గొప్పగా బయటి వస్తావో.. చివరి స్నానంలో కూడా అంతే స్వచ్ఛం గా నీలోని మలినం కడగబడాలి. అంటే నీ బ్రతుకు దినములన్నిటిలో నీ మాట, నీ నడత, నీ ఆలోచన, నీ ప్రవర్తన తోటి వారికి ఆదర్శంగా ఉండాలి. నిన్ను మరొకరు మార్గదర్శకంగా తీసుకొని జీవించాలి. మానవత్వం పరిమళించాలి.

– వాసి జ్యోత్స్న
9866843005

# ఆద్యంతాలు లేకుండా విస్తరిస్తున్న అవినీతి భూతం

'సమాజం మారాలి ప్రజల బ్రతుకులు మారాలి' అంటూ ఎలుగెత్తిన గళాలు మూగబోతున్నాయి. నిరుత్సాహంతో, నిస్తేజం ఆవహించి మేధావులు మౌనముద్ర వహిస్తున్నారు. మహోన్నత భావాలు గల వ్యక్తులు మార్పు కోసం ప్రయత్నించి భంగపడుతున్నారు. పరివర్తన కోసం పరితపించిన ఉద్యమాలు నీరుగారిపోతున్నాయి. అవినీతిపై పోరాడిన యోధులు అస్త్ర సన్యాసం చేస్తున్నారు. ఎందుకిలా జరుగుతున్నాయి? గుండె తీరాన్ని తలుపుతట్టి, చలనం తీసుకురావలసిన వక్తల ప్రసంగాలు గొంతు సవరించుకుంటున్నాయి. నడుస్తున్న చరిత్ర పుటలు అవినీతి మరకలతో నగుబాటు పాలౌతున్నాయి. సూర్యోదయాన్ని కారు మబ్బులతో కప్పేసి, అమావాస్య చీకట్లలో కృత్రిమ కాంతులను సృష్టించి, అవే నిజమైన వెలుగు రేఖలుగా భ్రమింపచేసే ఆర్థికతత్వాన్ని అతి తన్వయత్వంతో వీక్షించడం అలవాటుగా మారిన నేపథ్యంలో అవినీతి వరద కట్టలు తెంచుకుని జనజీవితాలను తల్లక్రిందులు చేస్తున్నది. వర్తమాన ప్రపంచంలో మహమ్మారుల నైనా ఏదో విధంగా జయించి, మృత్యుంజయులై తిరిగొస్తున్న యోధులను చూస్తున్నాం. కరోనాకు విరుగుడుగా వ్యాక్సిన్లను శరీరాలకు ఎక్కించుకుని యుద్ధంలో గెలిచిన మహాయోధులుగా బాహ్య ప్రపంచంలో నిర్భయంగా తిరుగుతున్నాం. ప్రపంచంలో కరోనా కంటే అత్యంత భయంకరంగా మారిన అవినీతి అనే మహమ్మారిపై వ్యతిరేకంగా పోరాడలేక, పోరాడే శక్తియుక్తులున్నా నేటి సమాజంలో శిఖండుల్లా అడ్డు వచ్చే వారితో యుద్ధం చేయలేక, కారణాంతరాలతో, కలహాలను కొని తెచ్చుకోలేక అర్థాంతరంగా అస్త్ర సన్యాసం చేసిన భీష్మాచార్యుల్లా వెనుదిరిగి అవినీతి అనే అంపశయ్యపై తనువు చాలించడానికే సంసిద్ధత వ్యక్తం చేసే పరిస్థితుల్లోకి నెట్టబడ్డాం. ఈ పరిణామాలను గ్రహించి, రాబోయే రోజుల్లో మరింత విస్తృతం కానున్న ఆర్థిక అసమానతలకు అడ్డుకట్ట వేయాలి. ఓడిపోయే యుద్ధంలో గెలవాలని విశ్వప్రయత్నం చేస్తూ పలువురు వ్యక్తు లు, వక్తలు, అంతర్జాతీయ సంస్థలు పద్మవ్యూహంలో చిక్కుకుపోతామని తెలిసినా అలుపెరుగని పోరాటం చేస్తూనే ఉన్నారు. కర్ణుల సహజ కవచకుండలాలను మాయతో కాజేసే అవినీతి ఇంద్రుల మాయాజాలంలో ఇరుక్కుని హతులై, పరాజితులుగా చరిత్ర పుటల్లో నిలిచేవారు కోకొల్లలు. చాణక్యనీతిని మరపించే అత్యంత కుటిలమైన ఎత్తుగడలకు చిత్తయిపోయి, గమ్మత్తుగా కిమ్మనకుండా నిశ్శబ్ధాన్ని ఆహ్వానించే వారిని అడుగడుగునా వీక్షిస్తున్నాం. అవినీతిపై పోరాటమంటూ ఉవ్వెత్తున లేచిన కెరటంలా విజృంభించి, లేచి పడి, తిరిగి లేవకుండా సముద్రం గర్భంలో దాక్కునే అలల నిస్సహాయతను చూస్తూ కాలం పరుగెడుతూనే ఉంది. పాత నీరును పోనిచ్చి, కొత్త నీటికి తోవ ఇచ్చిన చందంగా అవినీతి ఆగదని తెలిసినా మరి కొంతమంది బయలుదేరి 'అయిననూ పోయిరావలె హస్తినకు...' అంటూ మరో తరంగమై విజృంభిస్తూ కొన్నాళ్లు వరదగోదారిలా చెలరేగి, ఆ తర్వాత కొన్నాళ్లకు నెరలు తీసి ఎండిన నేలల్లా, స్వాతి చినుకు పడితే చాలు సంద్రం నిండు నన్నట్టుగా ఎవరో వస్తారు... ఏదో జరుగుతుందని మరో కొత్త దేవుడికోసం ఎదురుచూస్తూ నిరీక్షణలో కాలం వెళ్ళదీసి, కాలగర్భంలో కలిసి పోతున్నారు. 'గరికను తిన్న గాడిద పోతుంది, కాని గరిక చావదు' అనే విధంగా అవినీతి అప్రతిహతంగా చిరాయువుగా 'మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతూనే ఉంది'.



ఆద్యంతాలు కానరాని అవినీతికి చరమగీతం పాడేదెప్పుడు? సామాన్యప్రజల ఆర్థిక పునాదులు పటిష్ఠమయ్యే తరుణమెప్పుడు? అవినీతిపై పోరాటంలో సామాన్యుల గెలుపెప్పుడు? అవినీతిని ఎదిరించక పోతే అంతిమ బాధితులు, పరాజితులు సగటు ప్రజలే. వారు పన్నుల రూపంలో కట్టే ధనమంతా వివిధ రూపాల్లో కుబేరుల హస్తగతం కావడం దురదృష్టకరం. ఒకవైపు అధికశాతం మంది ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. సన్న, చిన్నకారు రైతులు అప్పుల బాధపడలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు రుణాలు మాఫీ చేస్తే నానా యాగీ చేస్తున్న ఆర్థిక మేధావులు కుబేరులకు అప్పనంగా వేలాది కోట్ల బాకీలను మాఫీ చేస్తుంటే నోరు మెదపరెందుకు? కార్పొరేట్ సంస్థలు దివాళా తీస్తున్నప్పుడల్లా వారికి రుణమాఫీలు, ప్రోత్సాహకాలు, వివిధ రూపాల్లో రాయితీలు కల్పించడం ఎంత వరకు సబబు? అడ్డదారుల్లో అడ్డగోలుగా సంపాదించడం, తమ కంపెనీ షేర్ల ధరలు పెరిగినట్లు కృత్రిమ వాతావరణం సృష్టించి, వాటిని కొనేటట్లు ఆర్థిక వ్యూహాలు పన్ని, తర్వాత షేర్లు పతనం కావడంతో షేరు హోల్డర్లు మునిగిపోవడం, మోసం చేసిన ప్రబుద్ధులు విదేశాలకు చెక్కేయడం సహజంగా జరిగే తంతు. ఇక నైనా ఈ అవినీతి మరకలను తుడిచి చేయాలి. నల్లధనం బయటకు రావాలి. పన్నుల ద్వారా లభించిన సంపదతో అభివృద్ధి చేయాలి. కుబేరుల నకిలీ వ్యవహారాలు ఇంకా ఎన్నో ఉండవచ్చు. అవినీతి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయక ముందే కుబేరులుగా చెలామణీ అవుతున్న ధనవంతులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి. అవినీతి పరులను కఠినంగా శిక్షించాలి.

– సుంకవల్లి సత్తిరాజు
9704903463

## తల్లిపాలు అమృతంతో సమానం

కలెక్టర్ సౌరభ్ శర్మ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తల్లిపాలు అమృతంతో సమానం అని ట్రైని కలెక్టర్ సౌరభ్ శర్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాలు పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 1 నుండి 7 వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలోని 11ప్రాజెక్టుల పరిధిలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, జిల్లా ఆరోగ్యాధికారి విజయలక్ష్మి, సిడిపిఒ లక్ష్మీ ప్రసన్న, పోషణఅభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.సంపత్ తో పాటు రమాదేవి, రాము, సోనీ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి మధుకు డాక్టరేట్



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని కాకరవాయి గ్రామానికి చెందిన ధర్మపురి మధు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను శుక్రవారం అందుకున్నారు.
హైదరాబాద్‌లోని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ధర్మపురి మధుకి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ జి.ఉపేందర్ పర్యవేక్షణలో హెటరోవాలెంట్ మెటల్ ఆక్సైడ్ ఆధారిత సెమీకండక్టర్ ఫోటోక్యాటాలసిస్ ద్వారా మురుగునీరు నుండి సేంద్రియ రంగులను తొలగించడంపై పరిశోధనలు అనే అంశంపై పరిశోధన చేసి పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకు మధుకి డాక్టరేట్ దక్కింది.




## బ్రీత్, మార్వెల్ ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.కళావతిబాయి

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.కళావతిబాయి ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ చందునాయక్, సిబ్బంది మయూరి సెంటర్‌లోని బ్రీత్ హాస్పటల్, వైరా రోడ్డులోని మార్వెల్స్ హాస్పటల్‌లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి హాస్పటల్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ఆసుపత్రులను మూసివేశారు. జూలై నెల 23న తల్లాడ మండలానికి చెందిన కె.శ్రీదేవి బ్రీత్ హాస్పటల్‌లో అస్వస్థతతో చేరగా అక్కడి డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన సందర్భంగా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తీవ్రంగా మందలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి.కళావతిబాయి, సిబ్బంది ఆసుపత్రిలోని డాక్టర్, సిబ్బంది సేవల తీరుతో నిర్లక్ష్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఆసుపత్రిని మూసివేశారు. వైరా రోడ్డులోని మార్వెల్ హాస్పిటల్‌లో గతంలో సుమారుగా 168మంది పేషంట్లకు చికిత్స అందించినట్లుగా నకిలీ బిల్లులు సృష్టించి ముఖ్యమంత్రి సహాయనిధికి వైద్యఖర్చుల నిమిత్తం సమర్పించారు. మార్వెల్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి తప్పుడు నకిలీ బిల్లులు సమర్పించినట్లుగా తేలడంతో ఆసుపత్రిని మూసివేశారు. ఇందుకుగానూ సమీప పోలీస్‌స్టేషన్‌లో మార్వెల్ డాక్టర్‌పై కేసును నమోదు చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. ఇరు ఆసుపత్రులలో ఉన్న పేషంట్లును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఆర్‌టిఐ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి




ప్రతి వ్యక్తికీ సమాచారం తెలుసుకునే హక్కు ఉంది

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఆర్‌టిఐ చట్టాన్ని అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమాచార హక్కు చట్టం కమిషనర్లు పివి.శ్రీనివాసరావు, భూపాల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్లు నేడు ఖమ్మం జిల్లాలో పర్యటించి పెండింగ్ ఆర్‌టిఐ దరఖాస్తులపై సమీక్షించి చట్టంపై అవగాహన కల్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్‌టిఐ చట్టంపై అధికారులందరికీ సమగ్రమైన అవగాహన కల్పించి పటిష్టంగా అమలు జరగాలని ఆర్‌టిఐ కమిషన్ లక్ష్యంగా పెట్టుకుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అధికారి తన హక్కులు, బాధ్యతలు చట్టపరంగా పాటించాల్సిన మార్గదర్శకాలను తెలుసుకుని సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌టిఐ కమిషనర్లు అందించిన సలహాలు, సూచనలను ఖమ్మం జిల్లాలోని ప్రజా సమాచార అధికారులు తూచ తప్పకుండా పాటించాలని తెలిపారు.
సమాచార హక్కు చట్టం కమిషనర్లు పివి.శ్రీనివాసరావు, భూపాల్‌లు మాట్లాడుతూ రెండేళ్లకు పైగా ఆర్‌టిఐ కమిషన్ లేని కారణంగా 15వేలకు పైగా కేసులు పెండింగ్ పడ్డాయన్నారు. ప్రస్తుతం పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలనే లక్ష్యంతో ఆర్‌టిఐ కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్‌టిఐ చట్టం అమలులో నిర్లక్ష్యంవహిస్తే అనవసరపు అనుమానాలకు తావుంటుందన్నారు. ప్రపంచంలో భారతదేశం సమాచార హక్కు చట్టం అమలులో ఎనిమిదవ స్థానంలో ఉందన్నారు. మన దగ్గర ఉన్న సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించాలన్నారు. ఆర్‌టిఐ చట్టం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. సమాజంలోని ప్రతి వ్యక్తికీ సమాచారం అడిగే హక్కు కల్పించిన వజ్రాయుధం ఆర్‌టిఐ చట్టమన్నారు. తప్పుడు సమాచారం అందించినా, ఆలస్యం చేసినా ఆర్‌టిఐ చట్టం ప్రకారం ప్రజా సమాచార అధికారిపై ఆర్‌టిఐ కమిషన్ చర్యలు తీసుకోవచ్చునన్నారు. అనంతరం ప్రజా సమాచార అధికారులు ఆర్‌టిఐ చట్టం అమలులో ఉన్న సందేహాలను అడిగి నివృత్తి చేశారు. ఆర్‌టిఐ కమిషనర్లు వివిధ శాఖల్లో పెండింగ్ కేసులపై శాఖాధికారుల నుండి అప్పీలను స్వీకరించారు.

**ఖిల్లా రోప్‌వేతో పర్యాటకాభివృద్ధి**
**భూ నిర్వాసితులకు పట్టాలు పంపిణీ**

ఖమ్మం ఖిల్లాకు రోప్ వే నిర్మించడంతో పర్యాటకంగా జిల్లా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు భూ నిర్వాసితులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న నిర్వాసితులకు బల్లేపల్లి వద్ద మంచి విలువైన భూమిని పరిహారంగా అందిస్తూ పట్టాలు ఇస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.నర్సింహారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నానో యూరియా, డిఎపిపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నానో యూరియా, నానో డిఎపి వాడకంపై రైతులకు వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధిలోని చెరువు కొమ్ముతండా, చింతగుర్తి, చిమ్మపుడి గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు నానో యూరియా, నానో డిఎపిలపై అవగాహన కల్పించి వాటి ఉపయోగాలను వివరించి క్షేత్రప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూమి ద్వారా యూరియా, డిఎపి రసాయన ఎరువులు అందించినట్లయితే మొక్కలు కేవలం 20 నుంచి 30 శాతం మాత్రమే ఆ ఎరువులను ఉపయోగించుకుంటాయన్నారు. మిగిలిన మొత్తం ఎండకు ఆవిరి కావడం, అధిక వర్షాలకు కొట్టుకుపోవడం జరుగుతుందని, దీని వల్ల రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుందన్నారు. వాటికి బదులుగా నానో యూరియా, నానో డిఎపిని మొక్కలకు పై స్ప్రే చేయడం వల్ల అవసరమైన పోషకాలను మొక్కలు సమర్థవంతంగా వినియోగించుకుంటాయన్నారు. ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా బాగుంటుందన్నారు. రైతులు నానో యూరియా, నానో డిఎపి వాడకంపై దృష్టిసారించాలని తెలిపారు. పంటలు సాగు చేసే రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.ఉమామహేశ్వరరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతిభ, శిరణ్మయి, వేదిత, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## సిపిఐ నాయకుడు యంగల మురళి మృతి

నివాళులర్పించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/బోనకల్ :** మండల పరిధిలోని కలకోట గ్రామానికి సిపిఐ సినియర్ నాయకుడు యంగల యేలేషు తృతీయ కుమారుడు యంగల మురళి(42) అనారోగ్యంతో ఖమ్మంలోని ప్రవేట్ ఆసుపత్రిలో శుక్రవారం మృతి చెందాడు. శుక్రవారం స్వస్థలం కలకోటలో మృతదేహానికి సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మురళి మెకానికల్ ఇంజనీరు పూర్తి చేసి హైదరాబాద్‌లో ప్రవేట్ సంస్థలో పనిచేస్తూ భార్య, పిల్లలను, తల్లిదండ్రులను పోషించేవాడు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో తూము ప్రకాశరావు, యంగల రాములులతో కలిసి యంగల యేలేషు ఏనలేని కృషిచేశారు. చిన్నవయస్సులోనే అనారోగ్యానికి గురై మురళి మృతి చెందడంతో వారి కుటుంబంలో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నివాళులర్పించిన వారిలో మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంకటమ్మ, శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్, మత్స్యశాఖ సొసైటీ డైరక్టర్ యంగల సుందరరావు, యంగల ప్రభుదాసు, కరుణాకర్ తదితరులున్నారు.

## బండారు పుల్లయ్య మరణం పట్ల రైతుసంఘం నివాళులు

**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ సీనియర్ రైతుసంఘం నాయకులు బండారు పుల్లయ్య మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ బండారు పుల్లయ్య మృతదేహాన్ని సందర్శించి ఘనంగానివాళులర్పించారు. పుల్లయ్య మరణం పార్టీకి రైతు ఉద్యమానికి తీరని లోటని వారు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా సమితి తరుపున బండారు పుల్లయ్యకు జోహార్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతని తెలియజేసినారు.

## డివిజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

నగర పాలక సంస్థ కమిషనర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వార్డు ఆఫీసర్లు తమ డివిజన్‌కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లు శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. డివిజన్లలో సర్‌ప్రైజ్ విజిట్లు నిర్వహించాలన్నారు. ప్రతి సోమవారం డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి ని నిర్వహించాలన్నారు. డివిజన్లలో తిరిగే మున్సిపల్ వాహనాలకు డీజిల్ కూపన్ల జారీ బాధ్యత వార్డు ఆఫీసర్లదేనన్నారు. డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో క్రిమినాశక మందులు పిచికారి చేయాలన్నారు. డివిజన్లలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ నిరంతరం చేపట్టాలన్నారు. వర్కర్ల హాజరు, వాహనాల వినియోగం తదితర పూర్తి సమాచారం సేకరించి సమర్థవంతంగా పనులు చేపట్టాలన్నారు. స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణపై ప్రజలతో మమేకమవ్వాలన్నారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని ఉత్తమ పనితీరును కనబర్చిన వార్డు ఆఫీసర్‌కు బెస్ట్ వార్డు ఆఫీసర్ ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ రాధిక, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



జెఎన్‌టియుహెచ్ సమస్యలపై

# విద్యార్థి సంఘాల ఆందోళన

**పోలీసులు, విద్యార్థి సంఘం నేతల మధ్య వాగ్వాదం—స్టేషన్‌కు తరలింపు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో గల జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియుహెచ్) సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడి ఖమ్మం సూర్యాపేట రాష్ట్రీయ రహదారిపై బైఠాయించి ధర్నాను నిర్వహించారు. విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ముష్క రాజు, పోలీస్ స్బిందితో కలిసి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, విద్యార్థి నేతలకు స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు విద్యార్థి సంఘం నేతలను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ స్టేషన్‌కు వెళ్లి పోలీస్ అధికారులతో మాట్లాడి విద్యార్థి సంఘం నేతలను విడిపించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, మనోజ్, జిల్లా కమిటీ నాయకులు లోకేష్, ఉమేష్, పిడిఎస్‌యు నాయకులు జార్జిరెడ్డి, శ్యామల, రాము, జంపన్న, అజయ్ పాల్గొన్నారు.

**పోలీసుల తీరు సరికాదు...**విద్యార్థుల సమస్యలపై ధర్నాను నిర్వహిస్తున్న తమ విద్యార్థి సంఘాలపై పోలీసులు నిర్వహించిన తీరు సరికాదని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటీకల రామకృష్ణ అన్నారు. రెండు సంవత్సరాలైనా భవనం, రెగ్యులర్ ఫ్యాకల్టీ, ల్యాబ్స్,



లైబ్రరీతో పాటు వసతులు లేక విద్యార్థుల ఇబ్బందులుపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీరుపై న్యాయమైన పోరాటం చేస్తున్న తమను అరెస్ట్ చేసి పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దారుణం అన్నారు. ఈ బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

నిరుపేదల గుండెల్లో నిలిచిన

# దూసరి స్వామిగౌడ్

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ చింతకాని :** నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దూసరి స్వామి గౌడ్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. గురువారం రాత్రి నేరడ గ్రామంలో జరిగిన స్వామిగౌడ్ 23వ వర్ధంతి సభలో దండి సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి చింతకాని మండలం నేరడ గ్రామంలో స్వామిగౌడ్ అడుగు పెట్టిన రోజుల్లో అగ్రవర్ణాల చేతుల్లో నలిగిపోతున్న నిరుపేదలను చూసి చలించిపోయారన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను ఆచరిస్తూ, పెత్తందారులను ఎదిరించి వందల ఎకరాల బంజర భూములను పేదలకు పంచిపెట్టిన ఘనత స్వామిగౌడ్‌ది అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు గ్రామంలో పాఠశాల నిర్మించి విద్యా అవకాశాలు కల్పించిన మహానుభావుడు స్వామిగౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. నిరుపేదలకు అండగా నిలబడి వారికి అవసరమైన పనికల్పించారన్నారు. స్వామిగౌడ్ స్ఫూర్తితో నేటికి కూడా వారి కుటుంబం సిపిఐ పార్టీని ముందుకు నడుపుతూ గ్రామంలో తిరుగులేని శక్తిగా నిలిపారన్నారు. స్వామిగౌడ్ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, పావులూరి మల్లికార్జున్, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, జానకిరాములు, గోగుల ఆది, ఆవులూరి రామిరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, మట్టా రవి, బాబీ, వెంకన్న, వెంకటేష్, కనకయ్య, అంతోని తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్లకు వసతులు కల్పించాలి

పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి

సిపిఐ, సిపిఐ(ఎం), డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా, తహసీల్దార్‌కు వినతి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చిమ్మపుడి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు పెండింగ్ నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ, సిపిఐ(ఎం), డివైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిమ్మపుడి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్ద సిపిఐ, సిపిఐ(ఎం), డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిమ్మపుడి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పునరుద్ధరణకు ఒక్కో దానికి లక్ష రూపాయలు కేటాయించి విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయన్నారు. వర్షం వస్తే కురుస్తున్నాయన్నారు. మంత్రులు, కలెక్టర్ దృష్టిసారించి డబుల్ బెడ్రూం ఇండ్ల మరమ్మతులకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో పేదలతో కలిసి ఎర్ర జెండాలతో డబుల్ బెడ్రూం ఇండ్లలో గృహప్రవేశాలు చేస్తామని వారు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు చింతల రమేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి జూలా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ప్రొద్దుటూరి వెంకటరెడ్డి, ఉప్పేల కృష్ణారెడ్డి, గాడిచర్ల సత్యనారాయణ, గ్రామశాఖ కార్యదర్శి రేమల్లె జయపాల్, అల్లు పెద్దిరెడ్డి, పావురాల రాము, విష్ణుమూర్తి, లక్ష్మీనారాయణ, చిన్నపిచ్చయ్య, లింగయ్య, కోటయ్య, గోపి, గిరి, రమేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగరాజును శుక్రవారం సిపిఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. నూతన కమిషనర్‌కు ప్రస్తుత మున్సిపాల్టీలో స్థితిగతులు, మున్సిపాల్టీ పరిధిలోని అవసరమైన సదుపాయాలు కల్పనపై వివరించారు. అన్నివర్గాల వారికి న్యాయం జరిగేలా సమతుల్యంగా పనిచేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం, సిపిఐ జిల్లా నాయకులు గన్నిన రామకృష్ణ, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్‌కాంత్, నాయకులు సయ్యద్, రజ్వీ, మహిళా సంఘం నాయకురాలు చీపుర్ల సత్యవతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గద్ద సూర్యకుమారి, షేక్.రసూల్ బి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నూతన ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం జరిగింది. ఆస్పత్రిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్యం అందుతున్న విధానం, రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మెన్ బానోత్ రాంబాబు, డిసిహెచ్స్ డాక్టర్ రవి బాబు, మెడికల్ సూపర్డెంట్ హర్షవర్ధన్, ఆర్ఎంఒలు రాంనివాస్, మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు, నాయకులు బదుగు సాంబమూర్తి, తాటి భిక్షం, మూతి క్రిష్ణ, హరిహర క్షేత్రం చైర్మెన్ గందె సదానందం తదితరులు పాల్గొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడులు నిలిపివేయాలి

ఖమ్మంలో నిరసన ప్రదర్శన



**ప్రజాపక్షం/ఖమ్మం :** గాజాపై ఇజ్రాయెల్ దాడులు వెంటనే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ శుక్రవారం ఎన్నెస్పి రోడ్డు నుంచి ప్రధాన రహదారి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనాను ఆక్రమించేందుకు దాడులకు పాల్పడుతుందని ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. కేవలం పాలస్తీనా లోని సంపదపై ఇజ్రాయెల్ కన్నేసిందని ఆయన ఆరోపించారు. ప్రపంచమంతా ఖండిస్తున్నా అమెరికా ఇండోనేషియాను సమర్థించడం సిగ్గుచేటన్నారు. ఆకలితో అలమటిస్తున్నారని అక్కడి ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గౌస్, సిపిఎం నాయకులు ఎస్‌కె హుస్సేన్, ముబీన్, ఖలీల్, రసూల్ బాయ్, ఎస్‌కె మీరా, హైమత్, రెహ్మాన్, అలీం, అబ్దుల్, ఇస్మాయిల్, అరిఫ్ అలీ, పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సింగరేణితో పాటు వివిధ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సిపిఐ ఆధ్వర్యంలో కృషి చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శుక్రవారం సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాలకులు ఉద్యోగ విరమణ చేసిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, వెంటనే బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ నాయకులు మిరియాల రంగయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు విజయవంతంగా పోలీస్ డ్యూటీ మీట్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామునూరు పిటిసి వేదికగా గురువారం ప్రారంభమైన రెండవ తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ రెండవ రోజు విజయవంతంగా కొనసాగాయి. రెండవ రోజైన శుక్రవారం డ్యూటీ మీట్‌లో భాగంగా బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాలకు సంబంధించిన నాలుగు విభాగాలు, కంప్యూటర్, వీడియోగ్రఫీ సైంటిఫిక్ ఎవిడెన్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వరంగల్ పోలీస్‌కమిషనర్ రెండవ రోజున నిర్వహిస్తున్న పోటీలను పర్యవేక్షించడంతో పాటు డ్యూటీ మీట్ ఏర్పాట్లపై ఈ పోటీల్లో పాల్గొన్న పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోగా, డ్యూటీ మీట్ ఏర్పాట్లు భాగస్వాములైన మున్సిపల్ వసతి, భోజన ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. ఈ డ్యూటీ మీట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ డ్యూటీ మీట్ పోటీలు రేపటితో ముగుస్తాయని.రాష్ట్ర పోలీస్ డిజిపితో డాక్టర్ జితేందర్‌తో పాటు, జైళ్ల విభాగం డిజిపి డా.సౌమ్య మిశ్రా విశిష్ట అతిథిగా పాల్గొంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## అంతర్జాతీయ ఆటో దినోత్సవంలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం /హసన్‌పర్తి :** అంతర్జాతీయ ఆటో దినోత్సవం సందర్భంగా పంత గట్టులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు కార్యక్రమంలో పాల్గొని ఆటో యూనియన్ సోదరులందరికీ అంతర్జాతీయ ఆటో దినోత్సవం శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో ఆటో సోదరుల సమ్మె క్రియాశీలకంగా మారిందని తెలుపుతూ అలాగే కాంగ్రెస్ ప్రజా పాలన ఏర్పడిన తర్వాత ఆటో సోదరులకు కచ్చితంగా 12 వేల రూపాయలు ఇస్తామని, పేదరికంలో ఉన్న ఆటో సోదరులకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆటో కార్మికులకు యూనిఫామ్‌ను అందించడం జరిగింది. రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షులు గుడిమిళ్ళ రవీందర్,ఆటో యూనియన్ రమేష్ కుమార్, రవీందర్, కృష్ణ, శ్రీనివాస్ సాగర్, శ్యాంమిగతా ఆటోకార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేంద్రం మెడలు వంచైనా బిసి రిజర్వేషన్ సాధిస్తాం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఈనెల 7న గోవాలో నిర్వహిస్తున్న జాతీయ ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి హన్మకొండ జేఎన్ఎస్ గ్రౌండ్ లో శుక్రవారం బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్ద కొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో భాగంగా ఎన్నికల ముందు ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ద్వారా ఆ బిల్లును రాష్ట్రపతికి పంపించగా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించి ఆ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తించేలా కృషి చేయాల్సింది పోయి, బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా వెన్నుపోటు పొడవడం దారుణమన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమ గాని యాదగిరి గౌడ్, బిసి సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసగాని అశోక్, బిసి మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేలా శోభరాణి, బిసి సంఘం జిల్లా నాయకులు వేముల మహేందర్, పంజల మధు, తంగళ్లపెల్లి అరుణ, మానస, తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంతో ఆర్‌టిసి బలోపేతం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** మహాలక్ష్మి పథకంతో తెలంగాణ ఆర్‌టిసి మరింత బలోపేతమై ప్రజలకు సేవలందిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పరకాల డిపో పరిధిలోని నాలుగు కొత్త బస్సులను పరకాల బస్టాండ్‌లో ప్రారంభించారు. ఆయన జెండా ఊపి స్వయంగా బస్సును నడిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మొదటిదైన మహాలక్ష్మి పథకంతో తెలంగాణలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు రెండు కోట్ల మందిని ఉచితంగా ప్రయాణం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పరకాల ఆర్‌టిసి డిపోను ప్రజలకు మరింత దగ్గర చేసే క్రమంలో నూతన సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. రానున్న కాలంలో పరకాల డిపో పరిధిలో ఇతర రాష్ట్రాలకు కొత్త సర్వీసులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకొని ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోద రామకృష్ణ,పరకాలఆర్‌టిసిడిపోమేనేజర్, ఇతరసిబ్బంది పాల్గొన్నారు.

## బహుళ ప్రయోజన నిర్మాణాలు చేపట్టాలి

సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** సిపిఐ ఆధ్వర్యంలో క్లబ్ ముందు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకొని బహుళ ప్రయోజనాల కోసం వినియోగించాలన్నారు. ఎడ్యుకేషనల్ హబ్ మరియు స్పోర్ట్స్ కు సంబంధించిన ఇండోర్ స్టేడియం కళాక్షేత్రం ఆడిటోరియం స్కిన్ డెవలప్మెంట్ సెంటర్ విద్యార్థుల కోసం యువకుల కోసం క్రీడాకారుల కోసం ఈ ప్రాంతంలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి కోసం షాపింగ్ కాంపెక్స్ ఇతర నిర్మాణాలు చేపట్టి బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు సంఘీభావం పలికిన రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన మా అసోసియేషన్ ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్ లు మాట్లాడుతూ మానుకోట పట్టణ ప్రజల సౌకర్యార్థం సిపిఐ అనేక పోరాటాలు నిర్వహిస్తుందని వారికి ఎల్లప్పుడూ మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ నారాయణ వెంకట్ రెడ్డి, వెంకటేశ్వరరావు, వెంకన్న, విజయ్ కుమార్, నాగేందర్, రఘుపతి, వెంకటరెడ్డి, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, మామిళ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్ ,మంద శంకర్, జలగం ప్రవీణ్ ,ఆబోతు అశోక్, అల్లి వేణుగోపాల్ రెడ్డి, ఆలేటి మహేష్, నాంచారి దాసు, మండవ రాజు, శ్రీనివాస్, ఎర్రోజు పద్మ, భీమరాజు, వెంకన్న, మోతి, విజయ్ ,దిద్ది నరసయ్య, తోట రమేష్, బోళ్ల భద్రయ్య, గోపి వెంకన్న ,బొమ్మెన లాలు, తీగారపు కొమరయ్య, మోతే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్ విభాగంలో మోహన కృష్ణకు బంగారు పతకం



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** శనివారం ప్రారంభమైన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ, ఫోటోగ్రాఫర్ మన్నవ మోహన కృష్ణ ప్రొఫెషనల్ ఫోటో గ్రఫీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించి భద్రాద్రి పోలీస్ జోన్ కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.ఈ సందర్భంగా మోహన కృష్ణను పలువురు అభినందించారు.

# ఇష్టపడి చదివి పాఠశాలకు మంచిపేరు తేవాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్ష/ వరంగల్ :** విద్యార్థులకు పాఠ్యాంశాలను ఇష్టపడి చదివి పాఠశాలకు మంచిపేరు తేవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్‌లోని ఆరేపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను, అన్ని తరగతి గదులను, పాఠశాల ఆవరణను పరిశీలించి ఆవరణలో కలుపు, పిచ్చి మొక్కలు ఉండడం పట్ల ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా విధులకు గైరాజరైన వాచ్ మెన్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. విద్యార్థుల చేత హిందీ, ఇంగ్లీష్ పుస్తకాలను చదివించి పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. యూనిఫామ్స్, నోట్ బుక్స్ వచ్చాయని అంటూ వాకాబు చేశారు. పదవ తరగతి విద్యార్థి యూనిఫామ్ వేసుకోకుండా ఉండడం గమనించిన కలెక్టర్ సంబంధిత ఉపాధ్యాయుని యూనిఫామ్ లేనిది అనుమతించకూడదని తెలుపుతూ విద్యార్థి తల్లిదండ్రులతో చరవాణిలో మాట్లాడి యూనిఫామ్ ప్రాముఖ్యతను కలెక్టర్ వివరించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయిలెట్స్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశుభ్రకరమైన వాతావరణ ఉండేలా చూసుకోవాలని అధ్యాపకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులుఉన్నారు.

**రైతులతో మాట్లాడిన కలెక్టర్:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ గ్రామ రైతులతో శుక్రవారం నిర్వహించిన ఆర్బిట్రేషన్లో కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రసంగించారు. జిల్లా కలెక్టర్ సమక్షం లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూమి కోల్పోయిన 15 మంది రైతులతో ఫైనల్ ఆర్బిట్రేషన్ నిర్వహించి అవార్డు చేయడం జరిగింది. ఈ ఆర్బిట్రేషన్లో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, గీసుకొండ తాహసిల్దార్ రియాజుద్దీన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, నేషనల్ హైవే మేనేజర్, రైతులుపాల్గొన్నారు.

## సిటి స్కానింగ్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు చేపట్టిన పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సమయానుకూలంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిటీ స్కాన్ పరికరం ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో ఆలస్యం లేకుండా, సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుతో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల, కళాశాలలు ఆకస్మిక తనిఖీ

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని పిఎంశ్రీ తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్, విద్యార్థుల రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ విధానంలో నమోదు చేస్తున్న విద్యార్థుల అటెండెన్స్ను కలెక్టర్ పరిశీలించారు. తనిఖీలలో భాగంగా పలు తరగతి గదులను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య, రాత పుస్తకాలు అందాయా అని, క్లాసులు బాగా చెబుతున్నారా, భోజనం ఎలా ఉంటుంది, ప్రిపరేషన్ ఏ విధంగా ఉంటుందని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ విధానంలో హిందీ క్లాసును నిర్వహిస్తుండగా కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**శాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్:** వేలేరు మండలం శాలపల్లి లోని ఎంపిపిఎస్ పాఠశాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తనిఖీ చేశారు. విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయురాలు బోర్డుపై పాఠ్యాంశానికి సంబంధించిన విషయ వివరాలను విద్యార్థులతో చదవమని చెప్పగా విద్యార్థులు చదివారు. విద్యార్థులతో బాగా చదువుతున్నారని, మధ్యాహ్న భోజనం చేశారా అని కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. పాఠశాల మొత్తం విద్యార్థుల సంఖ్యను ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకుని పాఠశాలకు సంబంధించిన పలు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన:** శాలపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారుకు చెందిన ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పూర్తయి ప్లాస్టరింగ్ పనులు సాగుతుండగా కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల సంఖ్యను అడిగి తెలుసుకుని వారి శారీరక బరువు, ఎత్తు ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఎంతమంది గర్భిణీలు వస్తుంటారని, వారికి పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారా అని కలెక్టర్ అంగన్‌వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బరువు పెరిగే విధం గా బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కోమి, ఎంపిడిఒ లక్ష్మి ప్రసన్న, ఎంపిఒ భాస్కర్, ఆర్ఐ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు

ఎంపి కడియం కావ్య వినతికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందన



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం పలుమార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరారు. భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్ యాక్టివిటీల వల్ల ఎన్ హెచ్353సి మీద తీవ్ర వాహన రద్దీ పెరగడంతో పట్టణమధ్యలో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఎంపీ కేంద్రమంత్రికి వివరించారు. గత మూడు సంవత్సరాల్లో 576 రోడ్డుప్రమాదాలు జరగడంతో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే ప్రత్యేక బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రిని ఎంపి కోరారు. 250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో,175 కోట్లు నిర్మాణ పనులకు, 75 కోట్లు భూసేకరణకు వినియోగించలని ఈ నిధులను 2025–2026 వార్షిక ప్రణాళికలో చేర్చాలని ఎంపి డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు ఇస్తామని తెలియజేశారు. అందుకు సంబంధించిన డిపిఆర్‌ను తయారు చేసి టెండర్ పనులు పూర్తి చేస్తామని వివరణాత్మక లేఖ ద్వారా కేంద్ర మంత్రి వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్యకు తెలిపారు. ఎంపి మాట్లాడు తూ భూపాలపల్లి పట్టణ ప్రజల ఎన్నో ఏళ్ళ సమస్య తీరనుందని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య, ప్రజల భద్రతో పాటు ప్రయాణదూరంలో లాభం కలుగుతుందని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

## పారిశుద్ధ్య పనులను తనిఖీ చేసిన జిల్లా సీజనల్ డిసిసేస్ స్పెషల్ ఆఫీసర్



**ప్రజాపక్షం/ములుగు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కన్నాయిగూడెం చిన్నబోయినపల్లి ఉపకేంద్రం పరిధిలోని షాపల్లి గ్రామాన్ని తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్టు డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ డిసిసేస్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించి ఆ గ్రామంలో డెంగ్యూ వ్యాధి బారిన పడిన ఇంటిని సందర్శించి బాలుని ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని బాలుని తండ్రితో మాట్లాడుతూ బాలుడు రక్తహీనతతో ఉన్నాడని అతనికి పోషకాహారాన్ని ఇవ్వాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చికిత్సను తీసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, డెమో సంపత్‌రావు, ఏఎంఓ దుర్గారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్‌రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారావు, ఆరోగ్య కార్యకర్త భాస్కర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ గడ్డ నుండే బిసిల రిజర్వేషన్ల ఉద్యమం

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసిలకు 42శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే కాకతీయ గడ్డ నుండే తెలంగాణ తరహాలో బిజెపిపై ఉద్యమం చేయాల్సి వస్తుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో బిసి మేధావులు ఏర్పాటు చేసిన సదస్సులో బిసి జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుచూ ఎప్పుడో 1931లో చేసిన కులగణనతో విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో ఒబిసిలకు నష్టం జరిగిందని, ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన మాదిరిగా కులగణన చేసిందని, 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండానే ఎన్నికలకు వెళ్ళితే పుట్టగతులు ఉండయని ఎఐసిసి కార్యాలయం ముట్టడించడం మూలాన దిగివచ్చి శాసన సభలో తీర్మానం చేసి పంపితే బిజెపి మూడునెలలుగా ఆమోదించకుండా ముడ్డికింద పెట్టుకొని రాష్ట్రంలో ధర్నా చేస్తామని తొండి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మండల్ కమిషన్ నుండి నేటి రిజర్వేషన్ల అమలు వరకు బిసిలకు వ్యతిరేకంగా పని చేస్తుందని, ముస్లింల పేరుతో బడుగులకు మోసం చేసే ప్రయత్నం చేస్తుందని, దేశంలో పార్లమెంట్ అత్యున్నత సభ అయినప్పుడు సవరణ చేసుకునే అధికారం మీకు ఉంది కదా? ఈ డబ్ల్యూఎస్ లో లేని ముస్లిం లొల్లి కేవలం బిసిల రిజర్వేషన్లకు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. ఇదేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్ సైతం రాజ్ భవన్ లో ఆమోదానికి నోచుకోక పోవడానికి బిజెపి అసంబద్ధ వైఖరే కారణమని,కనీసం ఫ్లోర్ లీడర్ పదవి కూడా ఇవ్వకుండా బిసిలపై ధర్నా పేరుతో కపట ప్రేమ నాటకం 60శాతం ప్రజలు గమనిస్తున్నారని,2028 ఎన్నికల్లో క్రరు కాల్చి వాతపెడుతారని హెచ్చరించారు. ఈ సమావేశ కోఆర్డినేటర్ ,పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ బిసిలను ఓట్లకోసం కాకుండా రాజ్యాధికారంలో భాగస్వాములుగా చేసేందుకు మూడు పార్టీలు కృషిచేయాలని హితవుపలికారు. తెలంగాణ ఉద్యమ కారుల రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు ఎవరిని వదిలిపెట్టేది లేదని,దాని కోసం బిసి ఐక్య ఉద్యమాలు అవసరం అన్నారు. రిటైర్డ్ ఆచార్యుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆచార్య వడ్డె రవీందర్, రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు బైరి రవి కృష్ణ, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య,పాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి ,జిల్లా బిసి సంఘం అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, పాస్ నాయకులు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, బాబు యాదవ్ , బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరుణహరి శేషు,ఆచార్య విజయ బాబు, ఆచార్య కట్ల రాజేందర్ డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ రాధికా రాణి, డాక్టర్ సుజాత, డాక్టర్ గడ్డం కృష్ణ,డాక్టర్ నాగయ్య, డాక్టర్ బ్రహ్మయ్య, అరగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్‌ఎస్‌లోనే తాత్కాలికంగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలోని సదుపాయాలు, వసతులను కల్పించి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని ఇక్కడే తాత్కాలికంగా ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నామని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా మైదానాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను గురించి అధికారులకు సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డి వై ఎస్ ఓ అశోక్ కుమార్ ను స్టేడియంలో వసతి సౌకర్యాలపై వివరించారు.అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహృదయంతో, వరంగల్ జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మంజూరు చేయాలనీ అడిగిన వెంటనే ఒప్పుకున్నారని తెలిపారు. అలాగే వెంటనే స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తో త్వరితగతిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఆగస్టు నుండే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని , అలాగే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించినట్లు తెలిపారు. బిసిసిఐని సంప్రదించి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నిధులు, అలాగే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అందులో భాగంగానే జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ని తాత్కాలికంగా ప్రారంభించడానికి ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడాధికారి గుగులోతు అశోక్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ, కుడా, మున్సిపల్ అధికారులు, నాయకులు, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** శుక్రవారం వరంగల్ బల్దియా కార్యాలయం లోని మేయర్స్ సమావేశ మందిరంలో ఆయన నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి జిడబ్ల్యూఎంసి పరిధిలోని పరకాల నియోజకవర్గ 15, 16,17 డివిజన్లలో అభివృద్ధి పనుల పురోగతి, పారిశుద్ధం నిర్వహణ, మంచినీటి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన పలు సమస్యలపై సమీక్షించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ, సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టాంప్ డ్యూటీ నిధులతో మూడు డివిజన్లో సుమారు 727 లక్షల రూపాయలతో 32అభివృద్ధి పనులు చేపట్టగా అందులో దాదాపు కోటి రూపాయల వ్యయంతో 18 పనులు పూర్తయినాయని, కోటి రూపాయల వ్యయంతో కొనసాగుతున్న రెండు అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలిన పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగాలని, మురుగు కాలువల లో పూడికలు తీయడంతోపాటు, చెత్త సేకరణ, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమలు ప్రబలకుండా ఆయిల్ బాల్స్ వేయడం జరగాలన్నారు. డివిజన్లలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ నీటి ప్రెషర్ వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలన్నారు. స్వచ్ఛమైన మంచి నీటిని అందించుటకు ట్యాంకులు ఎప్పటికపుడు శుభ్రం చేస్తూ వాటి వివరాలు ఆయా ట్యాంకుల పై ప్రదర్శించాలన్నారు. గాడిపల్లిలో మంచినీటి పైప్లైన్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. బల్దియా కు సంబంధించిన వార్డ్ ఆఫీసర్, పారిశుద్ధ్య, మంచి నీటి సరఫరా, విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు, బల్దియా టోల్ ఫ్రీ నెంబర్లు మూడు డివిజన్లో ని ఈ 11 గ్రామాల కూడలిల గోడలపై ప్రదర్శించాలని, ఏమైనా సమస్య ఉత్పన్నమైతే ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్షిస్తూ 404 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించగా అందులో 296 మంది లబ్ధిదారులకు మంజూరు చేయగా, మిగిలిన 108 ఇళ్లను త్వరితంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ, సిపిలు మహేందర్, రవీందర్ రాధాకర్, ఉప కమిషనర్ ప్రసన్న రాణి, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# భారత్ ఆలౌట్



ఇంగ్లాండ్ బౌలర్లు చుట్టేశారు. ఆ పేసర్ల ధాటికి ఓవల్ టెస్టులో ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 224 పరుగులకే ఆలౌటైంది. ఆరు వికెట్ల నష్టానికి 204 పరుగల వద్ద రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఇండియా.. రెండో రోజు కేవలం మరో 20 రన్స్ జోడించి చేతులెత్తేసింది. నైట్ బ్యాటర్లు కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్‌లు త్వరగా నిష్క్రమించడంతో.. టెయిలెండర్లు స్కోరు బోర్డును పరుగెత్తించలేకపోయారు. ఇంగ్లండ బౌలర్ అట్కిన్‌సన్ 33 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. రెండో రోజు కేవలం అరగంటలోనే భారత్ ఇన్నింగ్స్‌ను ముగించేశారు. కరుణ నాయర్ 57, సుందర్ 26 రన్స్ చేసి ఔటయ్యారు. ఇక సిరాజ్, ప్రసిద్ధి కృష్ణ డకౌట్ అయ్యారు. కీలకమైన నాయర్ వికెట్‌ను టాంగ్ తీసుకున్నాడు.

రెండో రోజు ఆటలో వోక్స్ లేకున్నా.. చాలా ఈజీగా ఇండియన్ ఇన్నింగ్స్‌ను ఇంగ్లాండ్ బౌలర్లు ప్యాకప్ చేశారు. ఈ సిరీస్‌లో భారత టెయిలెండర్ల పర్ఫార్మెన్స్ మరీ అధ్వాన్నంగా ఉంది. స్పీడ్ బౌలర్లు కాంబోజ్, బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధి కృష్ణ.. ఒక్క మ్యాచ్‌లో కూడా బ్యాట్‌తో రాణించ లేదు. ఎవరు కూడా ఈ సిరీస్‌లో డబుల్ ఫిగర్ స్కోర్ చేయ లేదు. వాళ్లు ఈ సిరీస్‌లో మొత్తం కలిపి 48 రన్స్ మాత్రమే చేశారు.

# బుమ్రా టెస్ట్ సిరీస్ మొత్తం ఆడాల్సిందేనా?

## బిసిసిఐ కీలక నిర్ణయం



భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయాలబారిన పడకుండా మేనేజ్‌మెంట్ చూసుకుంటోంది. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లోనూ కేవలం మూడింట్లోనే ఆడించింది. వర్క్‌లోడ్ కారణంగా ఇబ్బందిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంది. అయితే, ఇతర పేసర్ల విషయంలోనూ ఇలానే వ్యవహరించాలనే డిమాండ్లూ లేకపోలేదు. అసలు అన్ని మ్యాచులు ఆడలేనప్పుడు అతడికి విశ్రాంతి ఇవ్వడమే మేలనే వాదనా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రా ఏదైనా సిరీస్‌లో అన్ని మ్యాచులను ఆడేలా ఉంటేనే స్క్వాడ్‌లోకి తీసుకొనే అవకాశం ఉందనేది వాటి సారాంశం. 'స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌లు ఎప్పటికప్పుడు ప్లేయర్ల వర్క్‌లోడ్‌పై అధ్యయనం చేస్తూనే ఉంటారు. ఇక్కడ బుమ్రా విషయానికొస్తే మాత్రం అతడి ఫిట్‌నెస్ అత్యంత కీలకం. వైద్యబృందం పర్యవేక్షించిన తర్వాతనే తుది జట్టులో ఆడించడం జరుగుతుంది. అతడు అన్ని మ్యాచులు ఆడగలడని భావిస్తేనే ఏదైనా సిరీస్‌కు ఎంపిక చేసే ఆలోచనలో సెలక్షన్ కమిటీ ఉంది' అని బిసిసిఐ వర్గాలు తెలిపాయి.

**అవన్నీ అవాస్తవాలే: టెన్ దస్కతే**

టెస్టు సిరీస్‌లో ఏ మ్యాచ్ ఆడాలనేది బుమ్రా ఎంపిక చేసుకుంటాడనే విమర్శలపై భారత సహాయక కోచ్ రైన్ టెన్ దస్కతే స్పందించాడు. " బుమ్రాపై వస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలే. అతడిని అన్ని మ్యాచుల్లోనూ ఆడించాలని అనుకుంటాం. అతడి శరీరం సహకరించాల్సిన అవసరం ఉంది. దానికి గౌరవం ఇవ్వాలి. అందుకే, తుది జట్టులో బుమ్రాకు అవకాశం ఇవ్వడం లేదు. ఫలానా టెస్టుల్లోనే ఆడతానని బుమ్రా ఎప్పుడూ అనలేదు. ఇలాంటి కామెంట్లు రావడం బాధాకరం. మూడు టెస్టులు మాత్రమే ఆడతానని ముందే చెప్పాడు. అవేంటో మేనేజ్‌మెంట్‌నే నిర్ణయించమన్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకుంటాం'' అని దస్కతే వెల్లడించాడు.

**అప్పట్నుంచే సమస్య మొదలు..**

గతేడాది టీ20 ప్రపంచకప్ ముందు వరకూ ఆరు నెలలపాటు వెన్ను నొప్పి కారణంగా ఆటకు దూరమయ్యాడు. జట్టులోకి వచ్చాక మూడు టెస్టుల సిరీస్‌లో ఆడినా ఎలాంటి ఇబ్బంది పడలేదు. అయితే, బోర్డర్ గావస్కర్ ట్రోఫీ (2024–25)లోని ఐదు టెస్టుల్లోనూ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఒకదశలో బౌలింగ్ చేయడం తనవల్ల కాదంటూ బుమ్రా చేసిన వ్యాఖ్యలు స్టంప్ మైక్స్‌లో వినిపించాయి. సిడ్నీ టెస్టులో గాయపడి మళ్లీ కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉన్నాడు. దీంతో బుమ్రా విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ అతడికి రెస్ట్ ఇస్తూ కొన్ని మ్యాచుల్లోనే బరిలోకి దింపుతోంది.

# సూసైడ్ చేసుకోవాలనుకున్నా: చాహల్



భారత క్రికెటర్ యజువేంద్ర చాహల్.. తన భార్య ధనశ్రీకి విడాకులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఓ దశలో సోషల్ మీడియాలో అందర్నీ అట్రాక్ట్ చేసిన ఆ జంట.. అయిదేళ్ల వివాహ బంధానికి బ్రేకప్ చెప్పింది. ఆ సమయంలో చాహల్ చీటింగ్ చేశాడని ఆరోపణలు వచ్చాయి. ఆ ఆరోపణలు ఎలా తన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీశాయో అతను చెప్పాడు. ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయాన్ని వెల్లడించాడు. చాహల్, ధనశ్రీలు 2020లో పెళ్లి చేసుకున్నారు. కానీ ఇద్దరూ కెరీర్ దృష్ట్యా బ్రేకప్ అయ్యారు. అయిదేళ్లకే విడిపోయారు. అయితే విడాకుల విషయాన్ని కొన్నాళ్లు దాచారు. ఆ సమయంలో చాహల్‌పై చీటింగ్ ఆరోపణలు వచ్చాయి. విడాకులు తీసుకున్న సమయంలో తనను చీటర్ అని ఆరోపించారని, కానీ తన జీవితంలో ఎవర్నీ చీట్ చేయలేదన్నాడు. తాను అలాంటి వ్యక్తిని కాదన్నాడు. తనకన్నా నమ్మకమైన వ్యక్తి మరొకరు ఉండరన్నాడు. నాతో క్లోజ్‌గా ఉన్నవాళ్ల కోసం నా గుండె నుంచి ఆలోచిస్తానన్నాడు. ఇస్తానే తప్ప, తానేమీ డిమాండ్ చేయనన్నాడు. ఎవరికీ ఏమీ తెలియనప్పుడు, వాళ్లు నిందించడం మొదలుపెట్టారని, అప్పుడు మనం ఆలోచనల్లోకి వెళ్లాల్సి వస్తుందని చాహల్ అన్నాడు. తనకు ఇద్దరు చెల్లెల్లు ఉన్నారని, వాళ్లతో కలిసి చిన్నతనం నుంచి పెరిగానని, మహిళలను ఎలా గౌరవించాలో తెలుసు అని, వాళ్లను గౌరవించే పద్ధతులను పేరెంట్స్ నేర్పించారని, నా చుట్టూ ఉన్న వ్యక్తుల నుంచి జీవిత పాఠాలు నేర్చుకున్నానని, తన పేరును మరొకరితో జోడించి రాయడం, అది కేవలం వ్యూవ్స్ కోసం మాత్రమే రాస్తారని చాహల్ తెలిపాడు.

# ఫోకస్ సైన్స్



# భవిష్యత్తులో భూమి ఆక్సిజన్‌ను కోల్పోతుందా?

శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, ఈ ప్రశ్నకు అవుననే సమాధానం వస్తుంది. అయితే, ఇది ఇప్పుడప్పుడే కాదు... మరో 100 కోట్ల సంవత్సరాల తర్వాత, భూమి వాతావరణంలో జీవానికి సరిపడా ఆక్సిజన్ ఉండక పోవచ్చు. భూమి వాతావరణంలో ప్రస్తుతం సుమారు 21 శాతం ఆక్సిజన్ ఉంది. కానీ, వివిధ కారణాల వల్ల భవిష్యత్తులో ఇది తగ్గిపోతుందని వారు హెచ్చరిస్తున్నారు.

ముఖ్యంగా, సూర్యుడు వయస్సు పెరిగేకొద్దీ అతని వెలుతురు, వేడి పెరుగుతుంది. దీని ప్రభావంతో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి, నీరు వేగంగా ఆవిరైపోతుంది. ఫలితంగా మొక్కలు కిరణజన్య సంయోగక్రియ చేయలేక పోతాయి, తద్వారా కొత్త ఆక్సిజన్ ఉత్పత్తి క్రమంగా ఆగిపోతుంది. భూమి చరిత్రలో సుమారు 245 కోట్ల సంవత్సరాల క్రితం సైడీరియన్ పీరియడ్‌లో, ప్రోటెరోజోయిక్ ఇయాన్ ప్రారంభ సమయాన, 'మహా ఆక్సిజనీకరణ ఘటన' జరిగింది. ఈ సమయంలో వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు గణనీయంగా పెరిగాయి. : సైనోబ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవులు కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి చేయడం ప్రారంభించాయి. భూమిలో టెక్టానిక్ ప్లేట్ల కదలికలు వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలను ప్రభావితం చేశాయి. టెక్టానిక్ ప్లేట్లు ఒకదానినొకటి ఢీకొన్నప్పుడు పర్వత శ్రేణులు ఏర్పడి, సైనోబ్యాక్టీరియాకు అవసరమైన పోషకాలు సముద్రాలకు చేరాయి. కొత్తగా ఉత్పత్తి అయిన ఆక్సిజన్, సముద్రాల్లో జరిగిన అనేక రసాయనిక మార్పుల కోసం, ముఖ్యంగా ఇనుము ఆక్సీకరణ కోసం ఖ్సంది. పురాతన శిలాజాల్లో ఇనుప పలకలు ఉండటం ఈ ప్రక్రియకు సాక్ష్యం. కాగా, కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ, వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు పెరగడానికి సుమారు 90 కోట్ల సంవత్సరాలు పట్టింది. ఈ జాప్యానికి కారణం, ఉత్పత్తి అయిన ఆక్సిజన్ సముద్రాల్లోని ఇనుము వంటి ఖనిజాలతో చర్య జరిపి ఆక్సీకరణం చెందడమే. ఈ మహా ఆక్సిజనీకరణ ఘటన ఫలితంగా అప్పట్లో విలసిల్లిన ఎన్నో జీవరాశులు అంతరించిపోయాయి. ఎందుకంటే ఆక్సిజన్ అనేక ఆదిమ జీవులకు విషతుల్యంగా ఉండేది. మొత్తం మీద ఆక్సీజన్ శాతంలో మార్పులు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని శాస్త్రవేత్తల అంచనా. ఇలా వుంటే, భవిష్యత్తులో కూడా భూమి వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు మారుతూనే ఉంటాయి, ముఖ్యంగా మానవ కార్యకలాపాలు, వాతావరణ మార్పులు, మరియు సూర్యుని పరిణామం వంటి కారణాల వల్ల. మొక్కలు, శిలీంద్రాలు, సైనోబ్యాక్టీరియా వంటి జీవులు కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆక్సిజన్ విడుదల చేస్తాయి. అదే సమయంలో, శ్వాసక్రియ, దహనం, జీవరాశుల పూత, క్షయం వంటి ప్రక్రియలు ఆక్సిజన్‌ను వినియోగిస్తాయి. ఉత్పత్తి , వినియోగం మధ్య సమతుల్యత ఏర్పడటంతో ఆక్సిజన్ స్థాయి 21శాతం వద్ద సుదీర్ఘకాలంగా నిలిచి ఉంటుంది. ఈ సమతుల్యతలో చిన్న మార్పులు సంభవించినా, ప్రకృతి వాటిని తిరిగి సమతుల్య స్థితికి తీసుకెళ్తుంది. కానీ, వంద కోట్ల సంవత్సరాల్లో క్రమంగా ఈ పరిస్థితి మారుతూ, చివరికి ప్రాణకోటి జీవించే స్థాయిలో ఆక్సీజన్ లభించని పరిస్థితి ఏర్పడవచ్చని శాస్త్రవేత్తల అభిప్రాయం.

# 'స్విస్' హిమపాతాల్లో రంధ్రాలు!



స్విట్జర్లాండ్ లోని హిమపాతాల్లో ఇటీవల పెద్ద సంఖ్యలో 'స్విస్ చీజ్' లాంటి రంధ్రాలు ఏర్పడుతున్నాయి. వీటిలో కొన్ని చిన్నవికాగా, మరి కొన్ని పెద్దవి. వాతావరణ మార్పులే ఈ రంధ్రాలు ఏర్పడటానికి ప్రధాన కారణంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ మార్పులు వల్ల హిమపాతం వేగంగా కరిగిపోవడం, తక్కువ మంచు పడటం, అధిక ఉష్ణోగ్రతలు వంటి సమస్యలతో రంధ్రాలు ఏర్పడి ఉండవచ్చని అంటున్నారు. సాధారణంగా, హిమపాతం పైభాగంలో మంచు పేరుకుపోతూ, దిగువ భాగంలో కొంత కరుగుతూ 'డైనమిక్'గా ఉంటుంది. కానీ ఇప్పుడు మంచు పేరుకుపోవడం తగ్గిపోవడంతో, హిమపాతం కేవలం కరిగిపోతూ, మధ్యలో నీటి ప్రవాహం, గాలి ప్రవాహం వల్ల రంధ్రాలు ఏర్పడుతున్నాయి. ఈ రంధ్రాలు మొదట హిమపాతం మధ్యలో ఏర్పడి, తర్వాత వాటి పైభాగాలు కూలిపోతూ, పైనుండి కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ వల్ల స్విస్ హిమపాతాలు మరింత వేగంగా కరుగుతుండటంతో, వ్యవసాయం, తాగునీటి వనరులు, హైడ్రోఎలక్ట్రిక్ విద్యుత్ ఉత్పత్తి వంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పరిణామాన్ని హిమపాత మనుగడకు ప్రమాదకర సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తులో నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయం వంటి రంగాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు పేరుకుపోవడం తగ్గిపోవడం వల్ల గ్లేసియర్లు మరింత వేగంగా కరిగిపోతాయి. హిమపాతం లోపల నీటి ప్రవాహం, గాలి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో చిన్న, పెద్ద రంధ్రాలు పెరుగుతాయి. గ్లేసియర్లు త్వరగా కరిగితే, వేసవిలో నదులకు వచ్చే నీటి ప్రవాహం తగ్గిపోతుంది. దీని వల్ల తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి ప్రభావితమవుతాయి. వీటి ఆకర్షణ తగ్గిపదోతే, స్విట్జర్లాండ్‌కు అత్యధికంగా లభించే పర్యాటక ఆదాయం తగ్గే అవకాశం ఉంది. అంతేకాదు, హిమపాతం తగ్గితే స్థానిక ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం మారవచ్చు. పర్యావరణ పరిరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోతే, ఇలాంటి ప్రమాదకరమైన మార్పులు తప్పవన్నది నిజం.

---

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా సహాయకార్యదర్శి దేవేందర్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఉట్నూర్ మండల సిపిఐ 4వ మహాసభలను ఎస్‌కు ఫయాజ్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు సిర్ర దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఉట్నూర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో విఫలమైందని ఆరోపించారు. ఇండ్లు ఇవ్వడంలో పక్షపాతంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు, ఒంటరి మహిళలకు పెన్షన్‌లు, వృద్యాప్య పెన్షన్, రేషన్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సిపిఐ ఉట్నూర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్‌కె ఫయాజ్‌తో పాటు, తొమ్మిది మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభలో ఎం.రమేష్, అలీ, మహేష్, బాబా అశోక్, లక్ష్మి , కాంతాబాయ్ పాల్గొన్నారు.

## బిసి బిల్లును ఆమోదించాలి

### సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి సుదర్శన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బిజెపి ప్రభుత్వం బిసి బిల్లుకు అడ్డుపడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతుందని తెలంగాణ ప్రభుత్వం పంపిన బిసి బిల్లును గత నాలుగు మాసాలుగా తొక్కి పెడుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ కార్యదర్శి మంద సుదర్శన్ ఆరోపించారు. శుక్రవారం సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి కోటాకు బిజెపి. బిఆర్ఎస్ పార్టీలు అడ్డ పడుతున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును చిత్తశుద్ధి ఉంటే బిజెపి ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఆర్డినెన్స్ ఆమోద విషయంలో సైతం అదే వైఖరి అవలంబిస్తుందన్నారు. బిసి ప్రధాని అని గొప్పలు చెప్పుకుంటూ ఉండే తప్ప బిసిల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకోవడం లేదని బిసి బిడ్డగా చెప్పుకునే బిజెపి ఎంపి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో 42 శాతం బిసి బిల్లుపై చర్చకు పట్టు పట్టాలన్నారు. పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ బిసి రిజర్వేషన్ల గురించి గానీ బిసిల గురించి గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ 42 శాతం బిసి బిల్లును తీసుకువస్తే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కు వస్తే తమకు రాష్ట్రంలో పుట్టగతులు ఉండవనే దురుద్దేశంతో అనేక రకాలుగా కొర్రిలు పెడుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా అటువంటి ప్రయత్నాలు మాని నిజాయితీగా చిత్తశుద్ధితో బిసి బిల్లుకు సహకరించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కదారి రాములు, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధికి పోరాటాలు



### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి, వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల రవి, జిల్లా కార్యదర్శి షేక్‌బాష్ మియా తెలిపారు. శుక్రవారం శివనగర్ తమర భవన్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వరంగల్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజులపాటు సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలను నగరంలో నిర్వహించామని, మహాసభలో జిల్లా సమగ్రాభివృద్ధికి భవిష్యత్తులో చేయాల్సిన ఉద్యమాలపై చర్చించి 17 తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ పనులు వెంటనే ప్రారంభించాలని, కాజీపేటలోని కోచ్ ఫ్యాక్టరీ పనులను వేగవంతం చేయాలని, వరంగల్ టు హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై అందించాలని, టెక్స్‌టైల్ పార్కులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తీర్మానించినట్టు తెలిపారు. జిల్లా మహాసభలో 31మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, బుస్స రవీందర్, గన్నారపు రమేష్, గుండె బద్రి, తాళ్లపల్లి రాయల, శరత్ పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కొరత రానివ్వొద్దు

### సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** రైతులకు ఎరువుల కొరత రానివ్వొద్దని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మ ణ్ అధ్యతన జరిగిన సిపిఐ జిల్లా, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మంద పవన్ మాట్లాడారు. వర్షాలతో వ్యవసాయం వేగంవంతం చేయాలని ఆశపడుతున్న రైతులను యూరియా కొరత తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు లేకుండా వ్యవసాయాన్ని బట్టి రైతులకు ఎరువులను అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అర్హులైన వారిని గుర్తించి ఇండ్లను కేటాయించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ తీరుపై నిరంతర ఉద్యమాలు చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, జాగీరు సత్యనారాయణ, ఎడల వనేస్, అందె అశోక్, కొమ్ముల భాస్కర్, జేరిపోతుల జనార్ధన్, కనుకుంట్ల శంకర్, పిల్లి రజిని, మండలాల కార్యదర్శులు బోనగిరి రూపేష్, వేల్పుల శ్రీనివాస్, బన్సీలాల్, శివలింగ కృష్ణ, మిట్టపల్లి సుధాకర్, ఆది రంగారెడ్డి, కుడిక్యాల బాలమోహన్, జంగిడి యాదగిరి, బంక రాజయ్య, స్వర్గం రాజేశం, రామగళ్ళ నరేష్ పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు

### ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/చందంపేట :** భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చందంపేట మండల భవన నిర్మాణ కార్మికుల కమిటీ సమావేశం శుక్రవారం అందుగుల సైదులు అధ్యక్షతన జరిగింది.సమావేశానికి రామస్వామి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో దళారీ వ్యవస్థను అరికట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కార్మికుల కుటుంబాలకు పెళ్లికానుకను విడుదల చేయాలని, కార్మికులు ప్రమాద బీమా రూ.10లక్షలకు పెంచాలని, సాధారణ మరణానికి రూ.మూడు లక్షలు ఇవ్వాలని, కార్మికుల అడ్డాల వద్ద షెల్టర్లు, కనీస వసతులు కల్పించాలని, కార్మికుల పిల్లలకు కేజీ నుండి పిజి వరకు ఉచిత విద్య అందించాలని, 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మొగిళ్ల వెంగలయ్య, ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లయ్య, సైదులు, వెంకటయ్య, సైదులు, నరసింహా, మల్లయ్య, వెంకటేష్, బిచ్చు, కృష్ణయ్య, వెంకటయ్య, ఎల్లయ్య, లక్ష్మ య్య, శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందుగుల సైదులు, కార్యదర్శిగా మాతంగి వెంకటయ్య, 15 మంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆలేరు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆలేరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలకు వ్యవసాయ భూములు, నివేశన స్థలాలు పంపిణీ చేసి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఆలేరులో నత్త నడకన సాగుతున్న అండర్‌పాస్ పనులు పూర్తిచేసి ప్రజల సమస్య పరిష్కరించాలన్నారు. కొలనుపాక గ్రామంలోని సర్వేనెంబర్ 8 లోని ప్రభుత్వ భూమిని పేదలకు నివేశనస్థలాల కింద కేటాయించాలని డిమాండ్ చేశారు. హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమాకమైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల, దామోదర్‌రెడ్డిని సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణలను సన్మానించారు. సమావేశంలో నాయకులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్, నాయకులు ఆయిలీ సత్తయ్య, ఎండి ఇమ్రాన్, ఆలేరు సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, పున్నపోయిన రవి, రాజు, జంగ సరళ, పిట్టల శ్రీదేవి, బొడ్డు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## 'ధర్మస్థల' నిందితులను కఠినంగా శిక్షించాలి

### మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన డిమాండ్




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థలిలో వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తుందని మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాఘవ్ ప్లాజా వద్ద నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉస్తేల సృజన మాట్లాడుతూ గతంలో అక్కడ స్వచ్చత కార్మికుడిగా పనిచేసిన వ్యక్తి స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి 1995 నుండి 2014 మధ్య అనేక మంది మహిళలు, చిన్నారుల మృతదేహాలు అక్కడ బలవంతంగా ఖననం చేయబడ్డాయని ఆ దారుణాలు చూడలేక తాను అక్కడ నుండి పారిపోయి దూరంగా ఉన్నానని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ అకృత్యాలు బయటపడ్డాయన్నారు. ఇన్ని నేరాలు జరిగిన క్రమంలో స్థానిక పోలీసులు, ఇతర ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు పసిగట్టలేకపోయారని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో విచారణ స్వతంత్రంగా జరగాలని డిమాండ్ చేశారు. ధర్మస్థల ఘటనలో నేరస్తులను కఠినంగా శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఐలాపురం లక్ష్మి, వెంకటమ్మ, లత, అలివేలు, అంజమ్మ, జయసుధ, నాగమణి, పద్మ, రేఖ, లక్ష్మి , అనిత, కరుణ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## జులైలో బొగ్గు ఉత్పత్తి 88 శాతం

**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలో జులైలో బొగ్గు ఉత్పత్తి 88 శాతం నమోదైందని జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులైలో భూగర్భ గనుల్లో లక్ష 34 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా,లక్ష 13వేల టన్నుల ఉత్పత్తి చేసి 85 శాతం సాధించామన్నారు. ఉపరితల గనుల్లో 3 లక్షల 55 వేల టనున్నలకు గాను 3 లక్షల 16 వేల టన్నుల బొగ్గు తవ్వి 89 శాతం ఉత్పత్తి సాధించామని వివరించారు. ఓబీ తవ్వకాల్లో 50 శాతం పూర్తి చేశామన్నారు. రోడ్డు, రైలు మార్గాల ద్వారా 4 లక్షల 71వేల టనున్నల బొగ్గు రవాణా చేశామని, ఐదు గనుల్లో వంద శాతం ఉత్పత్తి నమోదు కావడం హర్షణీయమన్నారు. వర్షాల కారణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో కొంత ప్రభావం పడిందని చెప్పారు. జులైలో డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు ఏరియా సందర్శించి వనమహోత్సవంలో పాల్గొన్నారు. డైరెక్టర్ వెంకటేశ్వర్లు గోదావరి ఫంక్షన్ హాల్ ప్రారంభించారని తెలిపారు. మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ ఎన్.నాగేశ్వరరావు హాజరైన త్రైపాక్షిక రక్షణ సమీక్ష సమావేశం విజయవంతంగా ముగిసిందన్నారు. డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, ఆనంద్‌కుమార్, సీనియర్ పిఒ కాంతారావు పాల్గొన్నారు.

## బాధితుల ఫిర్యాదులకు సత్వర స్పందన

### డిఐజి అభిలాష్ బిస్త్



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** పోలీసులు బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి సేవలు అందించాలని అడిషనల్ డిఐజి అభిలాష్ బిస్త్ సూచించారు. శుక్రవారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి డిఐజికి జైపూర్ ఎసిపి వెంకటేవ్వర్లు, సిఐ వేణు చందర్, ఎస్ఐ మేకల సంతోష్ స్వాగతం పలికారు. అనంతరం ఏఆర్ మహిళా సాయుధ దళం గౌరవ వందనం సమర్పించింది. స్టేషన్ పరిసరాలను పరిశీలించి అభిలాష్ బిస్త్, రిసెప్షన్ సెంటర్ వద్ద మహిళా సిబ్బందిని అడిగి బాధితులను ఎలా స్వీకరిస్తున్నారు, సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు అనే వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌లో రూములు లాకప్‌లు, బ్యారక్‌లు, వాష్‌రూములు, సీసి కెమెరాలు, టెక్నికల్ రూమ్‌లను పరిశీలించారు. మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి మల్లారెడ్డి, జైపూర్ ఎసిపి వెంకటేవ్వర్లు, సిఐ వేణు చందర్, ఆర్ఐ సంతోష్, ఎస్ఐ మేకల సంతోష్, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ :** వర్షకాలం సీజనల్ వ్యాదులు అరికట్టాలంటే చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏరియా ఆరోగ్య పరియవేక్షకులు ఆడే సురేష్, బొమ్మేత సుభాష్ అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా మావల సబ్ సెంటర్ పరిధిలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలుర గురుకుల పాఠశాల(జైనథ్)లో వైద్య శిభిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు మందులు అందజేశారు. ఆడే సుభాష్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా, అతిసారా వంటి వ్యాదుల నుండి పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.స్కూల్ ప్రిన్సినాల్ నారాయణ, వార్డన్ రమేష్, ఆరోగ్యకార్యకర్తలు ఇర్ఫనా, సజీదా, లక్ష్మి , ఆశా కార్యకర్త శారదా, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలికల వసతిగృహం పరిశీలన



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి టౌన్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ టి. రమేష్ శుక్రవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న వసతులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన మౌలిక సదుపాలు, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఆరోగ్యం, భద్రతకు అవరోధం కలగకుండా హాస్టల్ యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారిని ఉత్సాహపరిచారు. మున్సిపల్ డిప్యూటి ఇంజనీర్ బి. సాయికిరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి యస్. చంద్రశేఖర్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పక్టర్ జి. సునీల్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 12మంది ఎంపిక



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** హనుమకొండలో ఆగస్టు 3, 4తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆసిఫాబాద గిరిజన క్రీడా పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని గిరిజన క్రీడల అధికారి బండమీనా రెడ్డి, పాఠశాల హెచ్ఎం జంగు శుక్రవారం తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి రాష్ట్ర స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను ఏసిఎంఒ ఉద్ధవ్, డిఎస్ఓ మీనారెడ్డి, జిసిడిఓ శకుంతల, ఏటిడిఓ చిరంజీవి, హెచ్‌డబ్ల్యూ సాయిబాబా,శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ అభినందించారు.


## లక్ష్యంతో చదివితేనే విజయం




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** లక్ష్యంతో చదివితే విజయం మీ స్వంతమవుతుందని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక కార్యనిర్వాహక అధ్యక్షులు రమావత్ లాల్‌సింగ్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను2024–25అకాడమీఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా అవార్డుల ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.అతిథులు డీఐఈఓ రవికుమార్, డీఈఓ అశోక్, బీసీడబ్ల్యు నర్సయ్య, జీజీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, అడ్వకేట్ ఆశ నారాయణ అవార్డులు అందుకున్న విద్యార్థులను ప్రశంసించారు.తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక విద్యార్థి సంఘ సభ్యులను అభినందించారు. టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్‌సింగ్ మాట్లాడారు. రాష్ట్రస్థాయిర్యాంకు సాధించిన విద్యార్థులకు సన్మానం చేశారు. టివియువి కన్వీనర్ అజయ్, సుభాష్, పవన్, సాయి సోను, సాయితేజ, సతీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలపక్షాన పోరాడేది ఎర్రజెండా ఒక్కటే

### సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్




**ప్రజాపక్షం / సంగారెడ్డి :** జహీరాబాద్ సిపిఐ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ నాలుగోవ మహాసభ జెండాను సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి కె. నర్సింలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జలాలుద్దీన్ ప్రసంగించారు. పేద ప్రజల పక్షాన నిలిచేది ఎర్ర జెండా ఒక్కటేనన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ప్రారంభిస్తామన్నారు. తంజం, ఇన్సఫ్, అశ్వక్, హుసేన్,అఫ్జల్, తాజోద్దీన్, బీర్బల్ శంకర్,ఇర్ఫాన్, విశ్వనాథ్, గౌస్, వినోద్, అమీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు

### నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంట వెంటనే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోడౌన్ ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను వెటర్నరీ సెంటర్, తహసీల్ ఆఫీస్ తదితర కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అధికారులతోమాట్లాడారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు,ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయిందా,తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశించిన రీతిలో దరఖాస్తుల పరిష్కారం జరగడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు సీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్‌పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ ఆయూష్ విభాగం, ప్రసూతి గది, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేవారు. మెడికల్ ఆఫీసర్‌తో పాటు విధుల్లోని సిబ్బంది హాజరును పరిశీలించారు. ఔషదాలపై ఆరా తీశారు. దర్యాపూర్ స్కూల్ ఆవరణలో నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేయించాలని, ప్రహరీగోడ, బాలికల టాయిలెట్స్ మరమ్మతులు తదితర మౌలిక సదుపాయాల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలని హెచ్ఎంకు సూచించారు. బడికి ఆనుకుని చెత్తచెదారం, వ్యర్థాలు వేస్తున్నారని గమనించిన కలెక్టర్, పంచాయతీ కార్యదర్శిని బడి ఆవరణను శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎరువుల గోడౌన్‌ను ఇతర ప్రైవేట్ ఎరువుల విక్రయ కేంద్రాలను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. పశు వైద్యశాలను సందర్శించిన కలెక్టర్, పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, కృత్రిమ గర్భధారణ వంటి సేవలు అందిస్తున్నారా సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాల పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎఓ నవీన్, వెటర్నరీ డాక్టర్ నరేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హన్మంత్ రావు, ఫర్హతున్నీసా తదితరులున్నారు.

### నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఒక్కో మండలం వారిగా చర్చిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, ఆయిల్‌పామ్ సాగు, ఎరువుల పంపిణీ, వనమహోత్సవం, భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఆహార భద్రత కార్డులు, గ్రామీణాభివృద్ధి నీటిపారుదల, తాగునీటి సరఫరా, ఖరీఫ్ సాగు, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమం, విద్యుత్ సరఫరా, రోడ్లు భవనాలు, విద్య, వైద్యం భారీ వర్షాలు కురిసిన సమయాల్లో చేపట్టాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా చేకూర్చే ప్రయోజనాలను, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, గిట్టుబాటు ధర తదితర విషయాలను వివరిస్తూ విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ట్రేనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావీ, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోలీసులను సంప్రదించొచ్చు

### జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** హింసకు గురైన మహిళలు, యువతులు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం షీటీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టిం, భరోసా కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు ర్యాగింగ్, ఈవీ టిజింగ్, ఫోక్సో వంటి వేధింపులకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. ఆసిఫాబాద డివిజన్ షీటి నెం. 8712670564, కాగజ్‌నగర్ డివిజన్ నంబర్ 8712670565 నంబర్లను, డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జులై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 48 మంది బాల కార్మికులను గుర్తించి సంరక్షించామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేశామని , 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై 3 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని వివరించారు. బాలల హక్కులు కాపాడటం మన అందిరి బాధ్యతగా పేర్కొన్నారు. బాల కార్మికుల సమాచారం ఉన్న వారు డయల 100 లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** విద్యార్థుల విద్య అభ్యాసనంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మీకంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని, నాణ్యమైన విద్య బోధన చేయాలని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల వివరాలు, గైర్హాజరు వివరాలు, వారు పాఠశాలలకు రాకపోవడానికి గల కారణాలు తెలుసుకుని విద్యార్థుల హాజరు, విద్య అభ్యాసనంపై ఉపాధ్యాయులు ప్రత్యేక తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం అయినందున పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలపై ఇప్పటి నుండే సన్నద్ధం చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, హనుమంతు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని ఎరువులను అందుబాటులో ఉంచాలి

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/సారంగాపూర్:** సారంగాపూర్ మండలంలోని చించోలి బి గ్రామంలోని డిసిఎంఎస్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.దుకాణంలో ఏర్పాటు చేసిన స్టాక్ బోర్డును పరిశీలించారు.తప్పకుండా ప్రతిరోజు రైతులకు ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న యూరియా ఇతర ఎరువుల వివరాలు అర్థమయ్యేలా స్పష్టంగా స్టాక్ బోర్డులను ప్రదర్శించాలన్నారు.ఎరువులు అమ్మకానికి సంబంధించి రసీదులను తనిఖీ చేశారు.అన్ని రసీదులను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.రైతులకు నష్టం కలిగించే విధంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ,గడువు తీరిన ఎరువులను విక్రయించవదని హెచ్చరించారు.గ్రామానికి చెందిన పలువురు రైతులతో మాట్లాడుతూ,రైతులు సాగు చేస్తున్న పంటలు,వారికి అవసరమైన ఎరువుల వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాలలో అన్ని పంటలకు సరిపడిన మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని వారికి చెప్పారు.ఎరువుల విషయంలో రైతులు ఎలువంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు.పంటలకు అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులను వేయాలన్నారు. అధిక యూరియా వేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందనేది అపోహ మాత్రమే అని చెప్పారు.అధిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందని వివరించారు. అనంతరం సారంగాపూర్ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎరువుల దుకాణంలోని స్టాక్ బోర్డును పరిశీలించారు. యూరియా, డిఏపి అమ్మకాలకు సంబంధించిన రసీదులను పరిశీలించి,ప్రతి అమ్మకానికి సంబంధించిన రసీదును సంబంధిత రైతుకు కచ్చితంగా అందించాలని అన్నారు.పురుగుల మందు లేబుళ్లను పరిశీలించి,గుర్తింపు పొందిన సంస్థలు తయారు చేసే పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలని అన్నారు. గడువు తీరిన, నకిలీ మందులను విక్రయించవద్దని అన్నారు.సంబంధిత అధికారులు అంతా ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తూ ఉండాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్,తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడివో లక్ష్మీ కాంత్, అధికారులున్నారు.

## ప్రజల రక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యం : సిఐ అజయ్‌కుమార్



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ పట్టణంలో పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుభాష్ నగర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించామని సిఐ అజయ్‌కుమార్ తెలిపారు. సిఐ మాట్లాడుతూ శుక్రవారం ఉదయంసుభాష్ నగర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ధ్రువపత్రాలు లేని 100 మోటార్ బైకులు 4 ఆటోలు,ఒకకారునుగుర్తించామన్నారు. గంజాయి నిర్మూలన, సైబర్ క్రైమ్,మాదకద్రవ్యాలకుబానిస కాకుండా ఉండాలన్నారు.మత్తు పదార్థాల వంటి వాటి పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచితులు కాలనీలోకి వస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని,ఇంటికి తాళం వేసి ఎక్కువ రోజులు ఎటైనా వెళ్లాల్సి వస్తే పోలీసు వారికి సమాచారం ఇస్తే గస్తినిర్వహణలో ప్రత్యేక దృష్టి సారిస్తారని,అలా చేయని యెడల దొంగలు పడే అవకాశం ఉంటుందని,ముందు జాగ్రత్త చర్యగా సమాచారం అందించాలని, ప్రజలు పోలీస్ వారితో సమన్వయంతో ఉండి కాలనీలో ఎలాంటి గొడవలు అల్లర్లు జరిగిన పోలీసు వారికి వెంటనే తెలియజేయాలని సూచించారు. ఖానాపూర్ పెంబి కడెం ఎస్సైలతో పాటు 40 మంది పోలీసులు పాల్గొన్నారు.

## నూతన ఎంపిడిఒగా రమాకాంత్

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ మండల నూతన ఎంపిడిఒగా రమాకాంత్ బాధ్యతలు చేపట్టారు.ఖానాపూర్‌లో ఉన్న ప్రస్తుత ఎంపిడిఒ సునీత బదిలీపై పెంబి వెళ్లారు.పెంబిలో విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఒ రమాకాంత్ బదిలీపై ఖానాపూర్‌కు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో అభివృద్ధి పనులకు పాటుపడతానని ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు.ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాలలో బాధ్యతగా పనులు చేపట్టాలని ఎలాంటి అశ్రద్ధ వహించరాదని తెలిపారు. మండలంలోని కార్యదర్శులందరూ ఎంపీఓ రత్నాకర్‌రావుతో కలిసి నూతన ఎంపీడీవోను సత్కరించారు. ఎంపీఓ,పంచాయతీ కార్యదర్శులున్నారు.

## మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ :** కృతిమ ఎరువుల కొరతను సృష్టించినా,అధికధరలకుయూరియాను అమ్మినా అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. ఎరువుల విక్రయాలను ఈపాస్ ద్వారా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఎన్ని ఎరువుల గోడౌన్ లు, విక్రయ కేంద్రాలలో విధిగా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

### జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ఆపరేషన్ ముస్కాన్ ను విజయవంతం చేసిన వివిధ శాఖలకు చెందిన అదికారులను ,సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమేఆపరేషన్‌స్మైల్ ఆపరేషన్, ముస్కాన్ అని బాల కార్మికులకు విముక్తి కల్పించడానికి ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్ జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేర్లతో రెండు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. బాలకార్మికులకు విముక్తి కల్పించి పాఠశాలలకు పంపించడం జరుగుతుందన్నారు. గత నెల రోజులుగా అనగా జులై 1 నుండి31వరకునిర్వహించినఆపరేషన్ ముస్కాన్ లో బాగంగా వివిధ శాఖలు పోలీసు శాఖ చైల్డ్ లేబర్ సిడబ్ల్యూ, సిడిపియు విద్యాశాఖ ,చైల్డ్ కేర్ ఇన్సిట్యూషన్ మొదలైన శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంలో విధులు నిర్వహించి ఆపరేషన్ ముస్కాన్ XI విజయ వంతం చేయడం జరిగిందని, టీంను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ అభినందించారు.ఈ సంవత్సరం మొత్తం 126 మంది బాల కార్మికులను రక్షించామన్నారు. పనిలో పెట్టుకున్న యాజమానులపై 81 కేసులు నమోదు చేశామన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకున్నా, వెట్టి చాకిరికి గురి చేసినా,బలవంతంగా బిక్షాటన చేయించినా, పశువుల కాపరులుగా, కిరాణం దుకాణాలు, దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు లోను పనిచేయించడం చట్టరీత్య నేరమన్నారు. బాల కార్మికులు కనిపించినట్టయితే సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

### అంగన్‌వాడీలో అక్రమాలపై విచారణ

## విచారణ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండల కేంద్రంలో నయాబాది అంగడి బజార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంపై అక్రమాల ఆరోపణలు వెల్లువెతుతున్నాయి. గురువారం మూడవనంబర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి అక్రమంగా సరుకులను తరలిస్తుండగా స్థానిక యువకులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బోధన్ సిడిపిఒ పద్మ శుక్రవారం ముగ్గురు సూపర్ వైజర్లను విచారణకు పంపించారు. విచారణ తీరుపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**

అంగన్‌వాడీ కేంద్రం నుంచి బియ్యం, పాలు, బాలామృతం అక్రమంగా తరలిస్తుండటంపై విచారణ జరపాల్సింది పోయి, అధికారులు తల్లులను పిలిచి సక్రమంగా సరుకులు అందుతున్నాయని సంతకాలు తీసుకోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో మిగిలిన సరుకులు, రోజువారి లెక్కలను సరిచూడకుండా, కేవలం సంతకాల సేకరణపై దృష్టి పెట్టడం విచారణను తప్పుదోవ పట్టించడమేనని వారు ఆరోపిస్తున్నారు.

**యథార్థ నివేదికపై సందేహాలు**

విచారణ తూతూ మంత్రంగా జరిగి, అసలు విషయాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణకు వచ్చిన సూపర్‌వైజర్ మీడియాతో మాట్లాడటానికి నిరాకరించారు. విచారణ నివేదికను సిడిపిఓ పద్మకు అందచేస్తామని మాత్రమే తెలిపారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి,అక్రమాలకుపాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం మండల కేంద్రంలో అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బంది గైహజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఆగ్రో రైతు సేవా కేంద్రంను,నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి పరిశీలించారు.లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.వీరి వెంట తహశీల్దార్ చంద్రశేఖర్,ఎంపిడివో ప్రవీణ్,ఎంపివో మంజుల తదితరున్నారు.

## ఉచిత ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మహాత్మా జ్యోతిరావు పూలే ఇంటర్, డిగ్రీ కళాశాలలో ఆన్ అకాడామీ అన్లైన్ తరగతులను సిరిసిల్లా జిల్లా ఇంచార్జ్ కేకే మహెందర్‌రెడ్డితో కలిసి రాజన్న సిరిసిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఉచిత అన్లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి. పోటి పరీక్షల్లో రాణించేందుకు మంచి అవకాశం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పిలుపునిచ్చారు. బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆన్ అకాడామి, అన్లైన్ క్లాస్‌ను శుక్రవారం ప్రారంభించి కలెక్టర్, జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ మాట్లాడారు. విద్యాద్వార సమాజ, వ్యక్తిగత మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్‌లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా అన్లైన్ తరగతులు కొనసాగిస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి పాఠాలు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. పాఠల్లో సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. మ్యాథ్స్ పాఠ్యాంశాలలో వచ్చే టెస్ట్ సీరిస్‌ను ప్రాక్టిస్ చేయాలన్నారు. జాతీయ స్థాయిలో జేఈఈ, నీట్ తదీతర పరిక్షల్లో మంచి ప్రతిభ చూపాలని ఆదేశించారు. దేశంలోని నిపుణులైన టీచర్లతో భోదన జరుగుతుందని డిల్లీలో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికత వినియోగించుకొని మనజిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజు రెండుగంటల పాటు అన్లైన్ కోచింగ్ తెలిపారు.పది,ఇంటర్ తరగతులు చాల తరగతులు కీలకమన్నారు. కాలిక్యూలస్, ఆర్గానిక్ పార్మింగ్, ఎలక్ట్రో మాగ్నటిజం ముఖ్య పాఠ్యాంశాలను నేర్చుకోవాలని అన్నారు. జిల్లా స్థాయి అథ్లెటిక్ గోల్డ్ మెడల్ సాధించిన. లాంగ్ జంప్‌లో అభిరాం, శశాంక్ 400 మీటర్స్, సాయికుమార్ (షాట్‌పుట్) విద్యార్థులను ప్రశంశించారు. ఏఎంసీ చైర్మెన్ సబేరబేగం, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మిరాజం, కళాశాల ప్రిన్సిపల్ వీరప్రభాకర్, ఉపాధ్యాయులు, జిడిపల్లి హన్మంతరెడ్డి, ఉన్నారు.

## రూ.5 లక్షల ఎల్‌ఒసి అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల పరిధిలోని కోనేరుపల్లె గ్రామానికి చెందిన రామడుగు మహేష్ కూతురు రామడుగు మానస గత రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి హైదరాబాదులో చికిత్స నిమిత్తం ఐదు లక్షల రూపాయలు ఎల్‌వోసి అందజేశారు. బాదిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ నిరుపేదలమైన తమకు కిడ్నీ సంబంధిత వ్యాదితో పడుతున్న విషయం తెలుసుకుని ఆపరేషన్ కోసం ఐదు లక్షల ఎల్‌వోసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంజూరు చేశారని, వారి మేలు మరిచిపోలేమని తెలియజేశారు.

## జగిత్యాల పట్టణంలో గుంతల రోడ్లు వెక్కిరిస్తున్నాయి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలో రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. ఇప్పటికే గుంతలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతుండగా మొన్నటి వరకు కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్లపై భారీగా గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ప్రజలు వాపోతున్నారు. జగిత్యాల పట్టణంలో కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు పట్టణంలో గొల్లపెల్లి రోడ్డు రాజీవ్ బైపాస్ రోడ్డు ముఖ మలుపు వద్ద రహదారి దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడంతో వాహనదారులకు పాదచారులకు ప్రయాణం ప్రాణసంకటంలా మారింది. అధికారులు రోడ్లు మరమ్మతులు చేయకపోవడంతో పరిస్థితి మరింత అధ్వనంగా తయారైంది. గుంతల రోడ్లపై నడిపిన, కార్లు, బైకులు, ఆటోలు, భారీ వాహనాలు అన్నింటికీ రిపేర్లు వస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మొన్నటి వరకు చిన్న గుంతలతో ఉన్న రోడ్లు వర్షాలకు ఒక్కసారిగా పూర్తిగా ధ్వంసమై మరింత అధ్వానంగా మారింది. కొన్ని చోట్ల కంకర తేలి, మరికొన్ని చోట్ల గుంతలతో రోడ్డు ఆనవాళ్లు లేకుండా పాడయ్యాయి. గుంతల రోడ్లపై వాహనదారులు, ప్రయాణికులు పడిపోయి గాయపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ఆస్పత్రులకు వెళ్లే రోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అధికారులు స్పందించి పాడైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని, ప్రాణ, ఆర్థికనష్టాల నుంచి తమను కాపాడాలని జగిత్యాల పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## చేనేత హస్తకళ ఎగ్జిబిషన్ ప్రారంభించిన 'సుడా' చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** నెలరోజుల పాటు కొనసాగే కళాభారతిలో చేనేత హస్తకళ ఎగ్జిబిషన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సంసృ్కతి సాంప్రదాయాల మేళవింపు గల వారసత్వ కళలకు జీవం పోస్తూ దేశ సంస్కృతిలో అంతర్భాగమైన చేనేతలు హస్తకళలు శ్రమైఖ్య జీవన సౌందర్యానికి ప్రతీకలు అని తెలిపారు. అటువంటి కళానైపుణ్యం కలిగిన దేశ వ్యాప్తంగా హస్తకళల ఉత్పత్తులకు సంబంధించిన స్టాళ్లు కళాభారతిలో అందుబాటులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేరుగా కొనుగోలు చేయడం వల్ల తక్కువ ధరలకు లభించే అవకాశం ఉందని తెలిపారు. కళాభారతి చేనేత సంఘం మేనేజర్ జల్ల సత్యనారాయణ, జి.సంతోష్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** గర్బినీలు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ఆరోగ్య దినం సంధర్భంగా మూడు సంవత్సరాలలోపు పిల్లలకు బాలామృతం, గ్రుడ్లు పంపిణీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలతో మమేకమై వారితో ముచ్చటించారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి హాజరైన బాలింతలు, గర్బిణీలతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇక్కడ ఇస్తున్న పోషకాహారాన్ని స్వీకరించాలని, పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో నిర్వహిస్తున్న శుక్రవారం సభకు హాజరై మహిళ లకు అందజేస్తున్న సేవలను గురించి తెలుసుకోవాలని తెలిపారు. పిల్లల పోషణ, ఆరోగ్యంపై అంగన్‌వాడీలో ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని తెలిపారు. సిలబస ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు.





**ప్రాథమికోన్నత పాఠశాల సందర్శన**

నుస్తులాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పలు తరగతి గదులను పరిశీలించి విధ్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను నేలపై కూర్చోబెట్టడం పట్ల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను బెంచీలపై, మ్యాట్లపై కూర్చోబెట్టాలని సూచించారు.

సిలబస్ ప్రాకరం విద్యను బోధించాలని, తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థుల ప్రగతి నివేదికను తెలియజేయాలన్నారు. బుధవారం బోధనను విధిగా అమలు చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సిడిపివో శ్రీమతి, ఎంఈవో శ్రీనివాస్ తదితరులున్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం / చందుర్తి :** పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.మండల కేంద్రం లోని రైతు వేదిక భవనం లో శుక్రవారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు 7లక్షల 37 వేల రూపాయలు విలువ గల చెక్కులను స్థానిక నాయకుల తో కలిసి పంపిణీ చేశారు.అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ గొప్ప వరం అన్నారు.గతం లో ఎన్నడు లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన సాగుతోందని అన్నారు. మండలం లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు.ఇళ్ళ నిర్మాణం లో భరంతి మట్టి తో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్ళగా స్థానిక తహసిల్ధార్ తో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రుద్రంగి ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం,మండల అధ్యక్షులు చింత పంటి రామస్వామి,మాజీ జెడ్పిటీసి నాగం కుమార్ , స్థానిక తహసిల్ధార్ శ్రీనివాస్ , అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి చట్టలపై అవగాహన కలిగి ఉండాలి: ఎఎస్ఐ

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** ప్రతి విద్యార్థి చట్టలాపై అవగాహణ కలిగి దానితో పాటు చెడు అలవాట్లకు దూరంగా చదువుకు దగ్గరగా ఉండాలని హుస్నాబాద్ ఎ ఎస్ ఐ మణెమ్మ విద్యార్థులకు సూచించారు. కమ్యూనిటి పోలీసింగ్‌లో బాగంగా మహిళల రక్షణకు సిద్దిపేట పోలీస్ కమీషనర్ అదేశాల మేరకు ప్రత్యేక షెడ్యూల్ లో బాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ అనే అంశలపై అవగాహణ కల్పించారు. ఈ సందర్బంగా ఎ ఎస్ ఐ మణెమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు సోషల్ మీడియా ,మహిళల రక్షణకు ఉన్న చట్టల గూర్చి మరియు మానవ అక్రమ రవాణ, బాల్య వివాహలు,బాలకార్మికులవేదింపులు, ట్రాఫిక్ నిబంధనలు సైబర్‌నేరాలపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తగా ఉండాలని కోరారు. ప్రతి విద్యార్థిని సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకుని చదువుపై శ్రద్దపెడితే మీకు ఉజ్వల భవిషత్తు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాడు వాసుదేవ రెడ్డి, షి టీం బృందం, తదితరులు పాల్గోన్నారు.

# మహిళా సంఘాల సభ్యులకు ఆదర్శంగా నిలువాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు మహిళలకు ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పిలుపునిచ్చారు. ఇందిరా మహిళా శక్తి కింద సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూర్ లో మహాలక్ష్మి గ్రామైక్య మహిళా సమైక్య (మెప్మా) ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగు మందుల, విత్తనాల దుకాణాన్ని కే కే మహేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని, ఇటీవల పెట్రోల్ బంక్ ప్రారంభించామని తెలిపారు. త్వరలో ఇందిరా మహిళా శక్తి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఏర్పాటు చేయనున్నామని, ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వ్యాపార అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించి రైతులు మద్దతుగా నిలువాలని ఆకాంక్షించారు.రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ స్వరూపా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మహిళా సంఘాల సభ్యులు మహిళలు స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ కార్యకర్త గోలివాడ నర్సన్నకు నివాళులు

భౌతిక కాయంపై అరుణ పతాకం కప్పి, పూలమాలలు వేసి జోహార్లు అర్పించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జనగామ వాస్తవ్యులు, సిపిఐ సీనియర్ కార్యకర్త, జిడికె వన్ ఇంక్లైన్ సీనియర్ డెలిగేట్ కామ్రేడ్ గోలివాడ నర్సయ్య (98) శుక్రవారం ఉదయం అనారోగ్యం తో బాధపడుతూ మరణించారని తెలిసి సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కే.కనకరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తొడుపునూరి రమేశ్ కుమార్ లు జనగామ లో నర్సన్న ఇంటికి వెళ్ళి ఆయన భౌతిక దేహం పై అరుణ పతాకం కప్పి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ గోలివాడ నర్సయ్య మరణం పట్ల సిపిఐ, ఏఐటియుసిలు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలుపుతుందని వారు పేర్కొన్నారు. కామ్రేడ్ నర్సయ్య జిడికె వన్ ఇంక్లైన్ లో సీనియర్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో సిపిఐ అనుబంధ ఏఐటియుసి యూనియన్ ఐన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ లో దివంగత మహానేత అమరజీవి కామ్రేడ్ మాదిరెడ్డి భాస్కర్ రావు, అమరజీవి ఎం.నారాయణ మరియు ఏఐటియుసి మాజీ అధ్యక్షులు వైగట్టయ్య ల నాయకత్వంలో కార్మికుల హక్కుల కోసం జరిగిన అనేక పోరాట కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సిపిఐ పార్టీ కి, ఏఐటియుసి యూనియన్ కు



బలోపేతానికి కృషి చేశారని. సింగరేణి లో దాదాపు 35 సంవత్సరాలు పని చేసి, పదవి విరమణ అనంతరం జనగామ లో సిపిఐ పార్టీ కి సీనియర్ కార్యకర్త గా ఉంటూ తన పోరాట అనుభవాలు గ్రామ సిపిఐ కార్యకర్తలతో పంచుకునే వారని తెలిపారు. జనగామ లో సిపిఐ పార్టీ కి వెన్నంటి ఉండే నర్సన్న ఇక లేరు అనే బాధను వ్యక్తం చేస్తూ జోహార్లు అర్పిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఇంకా నివాళులు అర్పించిన వారిలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు అర్కటి శ్రీనివాస్, మేడి తిరుపతి, కలువల జగన్నాథం, కంది సత్యనారాయణ, గుండెబోయిన రాజయ్య, గ్రామస్తులు గుండబోయిన ఓదేలు, జనగామ రాజలింగం, గుమ్మల అంజయ్య, గుమ్మల రాములు, గుండెబోయిన గట్టయ్య, ఊదరి వెంకటి, నర్సయ్య కుటుంబ సభ్యులు రాజబాబు, లక్ష్మి నారాయణ,తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు విద్యా ప్రమాణాలు అందించడంపై దృష్టి పెట్టాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాల అందించడం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో మెరుగైన విద్య అమలు పై రామగుండం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై ఉపాధ్యాయుల నుంచి సలహాలు సూచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజు పిల్లల కు ఏఐ ల్యాబ్ లో కనీసం 20 నిమిషాలు హాజరయ్యే విధంగా షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థి ప్రమాణాలు పెంచేందుకు ఏఐ టూల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.



ప్రభుత్వ పాఠశాలలకు రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.ప్రతి పాఠశాలలో 30 శాతం విద్యార్థులు చురుగ్గా ఉంటారని, కొంచెం ఉపాధ్యాయులు శ్రద్ధ పెడితే మరో 40 శాతం విద్యార్థులు సైతం బాగా చదువుతారని, మిగిలిన 30 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడం చాలెంజ్ గా తీసుకుని ఉపాధ్యాయులు పని చేయాలని, చివరి విద్యార్థి వరకు మనం చెప్పే పాఠాలు అర్థాలు కావాలని అన్నారు. తరగతి గదిలో బోధన లో పిల్లలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానం వల్ల ఉపాధ్యాయుల చాలా వరకు పని భారం తగ్గుతుందని అన్నారు .పాఠశాల సంబంధించి సంపూర్ణ వివరాలు యూఐడిసి పోర్టల్ లో నమోదు చేయాలని, విద్యార్థులు వర్క్ బుక్ ఉపయోగించేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'సెర్ప్' కార్యక్రమాలు బాధ్యతతో నిర్వహించాలి

జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలో ఐకేపీ సెర్ప్ ద్వారా అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఎపియంలు బాధ్యతతో పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని సెర్ప్ నిబంధనల మేరకు ఆయా మండలాలో పని చేసి నూతనంగా ఇతర మండలాల్లో బదిలీలు అయిన ఎపియంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా డి.ఆర్.డి.ఓ. రఘువరణ్ మాట్లాడుతూ సెర్ప్ నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ సిబ్బందికి సాధారణ బదిలీలు చేయడం జరిగిందని, కొత్తగా కేటాయించిన మండలాల్లో సెర్ప్ కార్యక్రమాలైన బ్యాంక్ లింకేజి, మార్కెటింగ్, ఫామ్, నాన్ ఫామ్, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా కృషి చేసి రాష్ట్రంలో జగిత్యాల జిల్లాను ముందంజలో నిలపాలని అలాగే ప్రస్తుతం విధుల్లో చేరిన మండలాల్లో అన్ని వర్గాల వారితో అన్ని శాఖల వారితో సమన్వాయం చేసుకోవాలని డి.ఆర్.డి.ఓ. రఘువరణ్ అన్నారు. అనంతరం ఏపియంలు డి.ఆర్.డి.ఓ. రఘువరణ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేయగా బదిలీలు, చేరికలు ఐన ఏపియంలకు నియామక పత్రాలను డి.ఆర్.డి.ఓ. రఘువరణ్ అందజేశారు. ఈ సమావేశంలో ఎపిడీ సునీత, డి.పి.యం.లు విజయ భారతి, నాగేశ్వర్ రావు, నారాయనణ, జిల్లా వింగ్ ఎపియంలు, ఆయా మండలల ఎపియంలు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు ప్రారంభం

**ప్రజాపక్షం/చొప్పదండి:** కరీంనగర్ నుంచి మంచిర్యాల వయా లక్షెట్టిపేట రూట్‌లో నాలుగు ఈ ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించామని కరీంనగర్ ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల ఒకటవ తేదీ నుంచి ప్రారంభమైన ఈ బస్సులు కరీంనగర్ నుంచి ఉదయం ఐదు గంటలకు బయలుదేరుతూ సాయంత్రం 6.10 గంటల వరకు ప్రతి 30 నుంచి 45 నిమిషాలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కొత్తపల్లిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

45 వాహనాలు స్వాధీనం..
సిపి గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పలు అంశాలపై తనిఖీలు చేశారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా? అని ఆరా తీశారు. సరైన ధృవపత్రాలు లేని 45 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 43 బైకుఉలు, 2 ఆటోలున్నాయి. ఈ సంధర్బంగా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరం జరిగిన గంటలోపు 1930 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజు చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాలను దుర్వినియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా చేయడం, అమ్మకం, వినియోగించడం చట్ట ప్రకారం నేరమని తెలిపారు. వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. షీటీం ఇన్స్‌పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విధ్యార్థినిలకు వివరించారు. అమ్మాయిలు తమ ఫోటోలను ఎవరికీ పంపొద్దని, పంపిన ఫోటోలను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఆకతాయిల వేధింపులకు గురైతే అటువంటి పరిస్థితుల్లో భయపడకుండా ధైర్యంగా షీటీంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అనంతరం విధ్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. టౌన్ ఏసిపి వెంకట స్వామి, ఇన్స్‌పెక్టర్లు నిరంజన్ రెడ్డి, శ్రీలత, పుల్లయ్య, ప్రదీప్ కుమార్‌లతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది, స్థానికులు, విధ్యార్థులున్నారు.



# రీల్




## 'మయసభ' ట్రైలర్ విడుదల

ఆది పినిశెట్టి, చైతన్య రావు మదాడి ప్రధాన పాత్రల్లో దేవా కట్ట దర్శకత్వం వహించిన 'మయసభ: ది రైజ్ ఆఫ్ ది టైటాన్స్' చిత్రం ఈనెల 7వ తేదీ నుంచి సోని లైవ్‌లో ప్రీమియర్ కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (1974–2009) కాలంలో వచ్చిన కీలక రాజకీయ సంఘటనల నుండి ప్రేరణ పొందిన ఈ సిరీస్ మొదటి సీజన్ 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. 1974–1983 మధ్య అల్లకల్లోల కాలంలో విద్యార్థి జీవితం నుండి ఉద్భవిస్తున్న రాజకీయ నాయకుల వరకు వారి ప్రయాణంపై దృష్టి పెట్టుకుని ఈ సిరీస్ రూపొందించబడింది. ఈ సిరీస్‌ను దేవా కట్టా, కిరణ్ జే కుమార్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్‌లో కథానాయకులు కృష్ణమనాయుడు (ఆది పినిశెట్టి) ఎంఎస్ రామి రెడ్డి (చైతన్యరావు మదాడి)ల మొదటి కలయికతో ప్రారంభమవుతుంది. ప్రారంభంలో వేర్వేరు ఆశయాలతో నడిచినప్పటికీ, ఇద్దరూ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అయితే, వారి సైద్ధాంతిక విభేదాలు, పరిస్థితులు వారిని తీవ్రమైన రాజకీయ ప్రత్యర్థులుగా మారుస్తాయి. ఈ ఉత్కంఠభరితమైన ట్రైలర్ సోదరభావం, ద్రోహం, రాజకీయ శక్తి ఆట ఇతివృత్తాలను కథగా తీసుకుని సిరీస్‌ను రూపొందించారు.



## స్పీడ్ పెంచిన డెకాయిట్

అడివి శేష్ హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా తెరకెక్కిస్తున్న సినిమా 'డెకాయిట్'. ప్రేమ,ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు షానియల్ డియో దర్శకత్వం వహించారు. హీరోయిన్ మృణాల్ ఠాకూర్ బర్త్‌డే సందర్భంగా ఆమెను పవర్‌ఫుల్ అండ్ ఇమోషనల్ అవతార్‌లో చూపిస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో మృణాల్ చేతిలో గన్ పట్టుకొని కనిపిస్తుంది. ఆమె కళ్లల్లో ఆక్రోశం, బాధ, ఫైటింగ్ స్పిరిట్ అన్నీ కనిపిస్తాయి. ముఖంపై చిన్న చిన్న గాయాలు, కన్నీళ్లు ఆమె పాత్రకు ఉన్న ఎమోషన్‌ను సూచిస్తున్నాయి. ఈ కథలో జూలియెట్ కేవలం లవర్‌తో పాటు రివెంజ్ డ్రామాకి సెంట్రల్ క్యారెక్టర్. మృణాల్ పోషించిన జూలియెట్ పాత్ర తెలుగులో ఇప్పటి వరకు చేసిన హీరోయిన్లు కంటే వేరే లెవెల్లో ఉంటుందని దర్శకుడు షానియల్ డియోల్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమాకి సంబంధించి ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు.

## 'సుందరకాండ' నుంచి 'ప్లీజ్ మేమ్' సాంగ్ రిలీజ్



హీరో నారా రోహిత్ తన మైల్‌స్టోన్ 20వ మూవీ 'సుందరకాండ'తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్న పొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా నిర్మాతలు 'ప్లీజ్ మేమ్' పాటను రిలీజ్ చేశారు. ప్లీజ్ మేమ్ సాంగ్ మోడ్రన్ బీట్‌లతో పాటు తెలుగుదనం కూడా మిక్స్ అయి క్యాచీ, క్రేజీగా వుంది. శ్రీహర్ష ఇమని రాసిన లిరిక్స్ ఫన్ ఫుల్‌గా పాటకి పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. వీడియోలో హీరో తన ఫ్రెండ్స్‌తో కలిసి శ్రీదేవిని ఇంప్రెస్ చేయడానికి చేసే ప్రయత్నాలు సరదాగా కనిపిస్తున్నాయి. అర్జున్ చాందీ, దీపక్ బ్లూ, అరవింద్ శ్రీనివాస్, సాయిశరణ్, రేష్మా శ్యామ్, హరిప్రియా, లవితా లోబో కలిసి పాడిన ఈ పాట ఇది. అందరి వాయిస్ మిక్స్‌తో పాటకి ఎనర్జీ రెట్టింపు అయ్యింది.

## గురువారం విడుదలంటే భయపడ్డాను

### 'సక్సెస్ మీట్'లో విజయ్ దేవరకొండ





కింగ్డమ్ సినిమాకి వస్తున్న స్పందన పట్ల మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. యూఎస్ ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. రాత్రి నుంచి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. చాలా మంది ఫోన్ చేసి 'అన్నా మనం హిట్ కొట్టినం' అని ఎమోషనల్ అవుతున్నారు. మీ అందరి ప్రేమ వల్లే ఈ విజయం సాధ్యమైంది. నా తెలుగు ప్రజలు నా వెనుక ఎంత ఉన్నారో నిన్నటి నుంచి చూస్తున్నా. అభిమానులు సినిమా కోసం ఎంతలా మొక్కుకున్నారో, ఎంతలా సెలబ్రేట్ చేస్తున్నారో చూస్తున్నా. ఆ వెంకన్న స్వామి ఆశీస్సులు, మీ ప్రేమ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ విజయాన్ని ప్రేక్షకుల మధ్యలో సెలబ్రేట్ చేసుకోవాలని ఉంది. తెలుగు ప్రేక్షకులతో పాటు యూఎస్ ఆడియన్స్‌ని కూడా త్వరలో కలుస్తాను. గురువారం విడుదలంటే నేను మొదట భయపడ్డాను. కానీ, నాగవంశీ ఈ సినిమా నమ్మి గురువారం విడుదల చేశారు. ఇప్పుడు ఆయన నమ్మకం నిజమైంది. సినిమాకి నా నటనకు ఇన్ని ప్రశంసలు రావడానికి కారణం దర్శకుడు గౌతమ్. టీజర్‌కి వాయిస్ ఓవర్ అందించిన ఎన్టీఆర్ అన్నకి, అభిమానులకు, తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అని హీరో విజయ్ దేవరకోన అన్నారు. మాదాపూర్ లోని సితార ఎంటర్టైన్మెంట్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. 'కింగ్డమ్' వసూళ్లు తాము ఊహించినట్టే ఉన్నాయని నిర్మాత సూర్య దేవర నాగ వంశీ అన్నారు. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన 'కింగ్డమ్' సినిమా వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్‌గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకులను మెప్పు పొందుతూ షో షోకి వసూళ్లను పెంచుకుంటోందని ఆయన చిత్ర నిర్మాణ సంస్థ కార్యాలయంలో సక్సెస్ మీట్‌లో చెప్పారు. మేము అనుకున్నట్టుగానే సినిమాకి మంచి స్పందన వస్తోంది. ఈ మధ్య కాలంలో సాంకేతికంగా ఇంత గొప్పగా ఉన్న సినిమా ఇదే ననే మాటలు వినిపిస్తుండటం సంతోషంగా ఉంది. ఒక తెలుగు సినిమాని సాంకేతికంగా హాలీవుడ్ స్థాయిలో తీశాము. థియేటర్‌కి వచ్చి సినిమా చూడండి. మీరు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టు ఈ సినిమాతో ఆయన హిట్ కొట్టడం చాలా ఆనందంగా ఉంది. అనిరుధ్, నవీన్ నూలి సహా అందరూ ఎంతో ఎఫర్ట్ పెట్టి సినిమా కోసం పని చేశారు. మేము మంచి కంటెంట్‌ని అందించాము, దానిని ప్రేక్షకుల్లోకి తీసుకొని వెళ్ళడానికి మీడియా ఎంతో సపోర్ట్ చేసింది. సినిమా వసూళ్లు కూడా అద్భుతంగా ఉన్నాయి. మొదటి రోజే చాలా చోట్ల బిజినెస్ చేసిన దానిలో సగానికి పైగా కలెక్షన్స్ వచ్చాయని వంశీ తెలిపారు. ఈ సక్సెస్ మీట్ లో నటులు సత్యదేవ్, వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు.

## 'వచ్చిన వాడు గౌతమ్' పోస్టర్ రిలీజ్



యంగ్ ట్యాలెంటెడ్ హీరో అశ్విన్ బాబు మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్టైన్మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్మాత టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో ప్రొడ్యూసర్ వ్యవహరిస్తున్నారు. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటివలే భారీ బడ్జెట్‌తో హైవోల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు.

## బన్ బటర్ జామ్ టీజర్ రిలీజ్

రాజు జెయమోహన్, ఆధ్య ప్రసాద్, భవ్య త్రిఖ హీరో హీరోయిన్లుగా రాఘవ్ మిర్‌దత్ దర్శకత్వంలో సురేష్ సుబ్రమణియన్ సమర్పకుడిగా రెయిన్ ఆఫ్ ఎరోస్, సురేష్ సుబ్రమణియన్ నిర్మించిన ఫన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బన్ బటర్ జామ్'. ఔట్ అండ్ ఔట్ కామెడీగా తమిళంలో విడుదలై సూపర్ హిట్ అయ్యింది. ఈ మూవీని తెలుగులో ఆగస్టు 8న శ్రీవిఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సిహెచ్ సతీష్ కుమార్ ఆగస్ట్ 8న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం టీజర్‌ను టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్ విడుదల చేసి సినిమా పెద్ద సక్సెస్ కావాలని చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు.'బన్ బటర్ జామ్' టీజర్‌ను గమనిస్తే తల్లిదండ్రులైన చార్లి, శరణ్య పొన్ వనన్ తమ కొడుకు గొప్పతనం గురించి మరొకరితో ఫోన్‌లో చెబుతుంటారు. మరో వైపు హీరో క్యారెక్టర్‌ను ఫన్నీగా ప్రజెంట్ చేశారు. అలాగే హీరో, హీరోయిన్ మధ్య లవ్ ట్రాక్‌ను కూడా ఎంటర్‌టైనింగ్ వేలోనే చూపించటం కొస మెరుపు. రాఘవ్ మిర్‌దత్ ఫన్నీగా సినిమాను తెరకెక్కించారు.



## ఆర్‌పి 'హనుమాన్ చాలీసా' విడుదల

తెలుగు సినిమా ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ సంగీత సారధ్యంలో 'హనుమాన్ చాలీసా' రోపొందించారు. స్వీయ సంగీత దర్శకత్వం వహించి, పాడిన హనుమాన్ చాలీసాను ఆవిష్కరించారు. టెక్సాస్ స్టేట్ డల్లాస్ నగరంలో ఉన్న అమెరికాలోనే అతిపెద్ద హనుమాన్ టెంపుల్ మెక్కినీలో శ్రీగణపతి సచ్చిదానంద స్వామి వారి సువర్ణ హస్తాలతో పట్నాయక్ 'హనుమాన్ చాలీసా' విడుదల చేశారు. శ్రీ గోస్వామి తులసీ దాసు 16వ శతాబ్దంలో అవధి భాషలో రచించిన ఈ హనుమాన్ చాలీసా, తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషలలో ఆయా భాషలవారు చదువుకుంటూ పాడుకునేలా వీడియో రూపొందించమని కార్యనిర్వహక నిర్మాత రఘురామ్ బొలిశెట్టి తెలియజేశారు. హనుమంతుని అపార శక్తి గురించి వర్ణించే ఈ హనుమాన్ చాలీసా వినేటప్పుడు ఒక అద్భుతమైన అనుభూతి ఖచ్చితంగా కలుగుతుందని హనుమాన్ చాలీసా రూపకర్త సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ అన్నారు. గణపతి సచ్చిదానంద వారు విని ఇది నేటి యువతకు బాగా చేరువవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ టెంపుల్ ఫౌండర్ ప్రకాష్ రావు కూడా పాల్గొన్నారు. ఇది ఆర్ పీ పట్నాయక్ తన స్వీయ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల అయ్యింది.



# శాంతి సంఘీభావ ఉద్యమాలు నిర్వహించండి

### రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలంతా యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి, సంఘీభావ ఉద్యమాలను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతంగా నిర్వహించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో కెవిఎల్ మాట్లాడుతూ శాంతి సంఘీభావ సంఘం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు పాలస్తీనాకు మద్దతుగా దేశవ్యాప్తంగా ఐప్సో ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 6వ తేదీన 'హిరోషిమా డే'ను, 9వ తేదీన 'నాగసాకి డే'ను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల సందర్భంగా 1945లో జరిగిన యుద్ధ విధ్వంసాలను, ప్రస్తుతం పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న ఏకపక్ష యుద్ధాన్ని, ఉక్రెయిన్ రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధాలను, ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధాలను, వాటి ఫలితంగా వివిధ దేశాల్లోనే కాకుండా ప్రపంచంలో తలెత్తుతున్న విధ్వంసాన్ని, నష్టాలను, కష్టాలను, కన్నీళ్లను, ప్రజలకు తెలియజేసి శాంతి ప్రాముఖ్యతను, సంఘీభావ ఉద్యమాల అవసరాన్ని గుర్తింప చేయాలని కెవిఎల్ అన్ని జిల్లా కమిటీలను కోరారు. ఐప్సో ఆధ్వర్యంలో వీలైన ప్రాంతాల్లో సంఘీభావ ఉద్యమాలను నిర్వహించాలని విస్తరింప చేయాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధవాదానికి, రేసిజానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా నిత్యం పోరాడుతూ ప్రజలలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషి చేయాలని, పంద్రాగస్టు సందర్భంగా వీలైన చోట్ల విద్యార్థులకు సెమినార్లు, స్వాతంత్ర్య పోరాట గొప్పతనాన్ని శాంతి యొక్క ప్రాధాన్యతను తెలియజేయాలని అన్ని జిల్లా కమిటీల సమావేశాలు నిర్వహించి శాంతి సంఘీభావ సంఘం నిర్మాణ బలోపేతానికి కృషి చేయాలని ,రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్. తెలియజేశారు.

ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలంతా చైతన్యవంతమైనప్పుడే ప్రజల కష్టాలు తీరుతాయని, యుద్ధాల స్థానంలో శాంతి ఉంటుందన్నారు. అన్ని దేశాలలో సంఘీభావ ఉద్యమాలు ప్రజలందరూ పెద్దవిత్తున నిర్వహిస్తున్నారని తెలియజేశారు. సమావేశంలో ఐప్సో హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎ.రామరాజు, కార్యదర్శి జె.కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాంగంలో అనేక చట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

కేసులలో ఉన్న నాయకులందరూ సిపిఐకి చెందినవారేనన్నారు. దేశంలో మహిళా సంఘాలు దళితుల సంక్షేమం, సబ్బండవర్గాల సంక్షేమమే ధ్యేయంగా పోరాడింది కమ్యూనిస్టు పార్టీ అని ఆయన గుర్తుచేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికస్థానాల్లో పోటి చేసి గెలుపొందాలన్నారు. ఎర్రజెండాలు ఒకేతాటిపై పోరాటంచేస్తే అధికారంలో పైచేయి మనదే అన్నారు. రాష్ట్రానికేకాదు దేశానికి బిజెపి అత్యంత ప్రమాదకర పార్టీ అని ఆయన విమర్శించారు.

**పేదోడి ఆనందమే కమ్యూనిస్టులకు అధికారం**

పేదోడి ఆనందమే కమ్యూనిస్టుపార్టీకి అధికారమని సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యులు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. వందేళ్లపాలనలో సిపిఐ అనేక పోరాటాలు చేసిందని, బ్రిటిషుకాలంలోనే 550సంస్థానాలలో ఉద్యమించిందని చెప్పారు. బిజెపిపాలనలో ఆదాని, అంబానిలకు ఆస్తులు పెరిగాయని, దొంగలకు కార్పొరేట్‌సంస్థలకు అండగా బిజెపి ప్రభుత్వం ఉందని ఆయన మండిపడ్డారు. ఇజిఎస్ పథకంలో కూడా పేదలకు గండి కొడుతున్నారని ఆయన విమర్శించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేసి ఉపకాల్వలను పూర్తిచేయాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆనంద్, వార్లవెంకటయ్య, కొమ్ముభరత్, విజయుడు, కేశవులు, ఫయాజ్, పరుషరాములు, ఏసయ్య, హుస్సేనయ్య, ఇందిరమ్మ, శ్రీనివాసులు, శివశంకర్, ఆయా మండలాల కార్యదర్శులు, అనుబంధసంస్థల నాయకులు పాల్గొన్నారు.

# జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించాలి

### టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దశాబ్దాలుగా కార్మికుల పక్షాన పోరాడుతున్న కాంగ్రెస్ అనుబంధ మూడు జలమండలి యూనియన్‌ల ఐక్యత చారిత్రాకమని, ఉద్యోగ, కార్మికుల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపితానికి కలసికట్టుగా పని చేయాలని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అధ్యక్షతన హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శుక్రవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ అనుబంధ సంఘాలు, మూడు జలమండలి యూనియన్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, యూనియన్ అధ్యక్షులు సి.సతీష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, హైదరాబాద్ వాటర్ వర్క్స్, సేవరేజీ కామ్‌గార్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ట్రెడ్ యూనియన్ సీనియర్ నాయకులు తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కల్లెం రాజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మధు యాష్కి గౌడ్ నాయకత్వంలో జలమండలి ఉద్యోగ, కార్మిక సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, వచ్చే యూనియన్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో అందరు ఐక్యంగా పాల్గొని భారీ విజయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కానుకగా అందించాలన్నారు.

మధు యాస్కి గౌడ్ మాట్లాడుతూ.. జలమండలిలో నిరంతరం ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడుతున్న మూడు ముఖ్య కాంగ్రెస్ అనుబంధ యూనియన్లు, ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్, బిసి అసోసియేషన్‌ల మద్దతుతో రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐక్యంగా కలసికట్టుగా పోటీ చేయాలని నిర్ణయించడం చారిత్రాత్మకమన్నారు. జలమండలి ఉద్యోగ కార్మికుల తరపున పోరాడుతున్న అన్ని కాంగ్రెస్ అనుబంధ యూనియన్లు కలసికట్టుగా పనిచేయలని విజ్ఞప్తి చేశారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే పరిష్కారం కోసం కృషి చేద్దామన్నారు.

ఈ సమావేశంలో కామ్‌గార్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజుతో పాటు మూడు జలమండలి యూనియన్‌ల నేతలు అల్లి శ్రవాన్ కుమార్, బి.దేవేందర్, ఎం.రాజా, కె.ఆనంద్ రెడ్డి, ఎం.రాంచందర్, రాములు ముదిరాజ్, వి.కృష్ణ, అశోక్, షేర్ బహదూర్, బి.మహేష్, మల్లేష్, ఎం.డి. జాంగీర్, లింగామయ్య పాల్గొన్నారు.

# హిడ్మా లొంగుబాటు?

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పోలీసు బలగాలు నెల రోజుల పాటు జల్లెడ పట్టాయి. అయితే హిడ్మా మాత్రం దొరకలేదు. పోలీసు బలగాల కూంబింగ్‌ను ముందే పసిగట్టిన హిడ్మా కర్రెగుట్ట నుంచి తన మకాంను అబూజ్ మడ్ దండకారణ్యంలోకి వెళ్లాడని నిఘా వర్గాలు ధృవీకరించాయి. మరోపక్క మావోయిస్టులు లొంగిపోవాలని ఇటీవలే డిజిపి డాక్టర్ జితేందర్ ప్రకటించిన నేపథ్యంలో హిడ్మా లొంగిపోయి ఉంటాడనే అనుమానాలు కలుగుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లోని సుక్మా జిల్లా కొంటే గ్రామానికి చెందిన హిడ్మా 10వ తరగతి వరకు చదువుకుని సిపిఐ మావోయిస్టు పార్టీలో చేరి కేంద్ర కమిటి సభ్యుడిగా ఎదిగాడు. ఇతనిపై 2010లో తాడెమ్మెట్ల అంబూష్ లో 76 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను హత్య చేసినదాంట్లో కీలక పాత్ర ఉందని పోలీసులు చెబుతున్నారు. అలాగే 2017లో బుర్కపాల్ దాడిలో 25 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లను హత్య చేసిన కేసులో నిందితుడు. 2021 ఏప్రిల్‌లో జగర్గుండాటారెమ దాడి 22 మంది జవాన్లు మరణించిన కేసులో కూడా నిందితుడే. అలాగే ఎన్నో ఐఇడి బాంబు పేలుళ్ల కేసులో కూడా హిడ్మా నిందితుడిగా ఉన్నాడని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి. అయితే కర్రెగుట్ట, అబూష్‌మాడ్ అటవీ ప్రాంతాలలో హిడ్మా గురించి గాలిస్తున్న సమయంలోనే అతను లొంగిపోయాడనే వార్తలు రావడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి. అయితే హిడ్మా తమ ముందు లొంగిపోయాడనే వార్తలో వాస్తవం లేదని తెలంగాణ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

# ఖరారు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

వహిస్తున్న పార్లమెంటు సభ్యులమైన తాము బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణపై, ముఖ్యంగా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ ప్రక్రియ చేపట్టడంపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేయాలనుకుంటున్నామని ప్రతిపక్ష ఎంపిలు తమ లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి ప్రక్రియనే దేశవ్యాప్తంగా త్వరలో చేపట్టనున్నట్లు భారత ఎన్నికల కమిషన్ సూచించిన నేపథ్యంలో ఈ ప్రక్రియ పారదర్శకత, సమయం, ఉద్దేశ్యం గురించి విస్తృతమైన ఆందోళన దృష్ట్యా దీనిపై తక్షణ శ్రద్ధ అవసరమని వారు అన్నారు. ప్రస్తుత సెషన్ ప్రారంభమైనప్పటి నుండి ప్రతిపక్షం నిరంతరం ఈ అంశాన్ని లేవనెత్తుతోందని ఎంపిలు గుర్తు చేశారు. జులై 20న జరిగిన అఖిలపక్ష సమావేశంతో సహా ప్రభుత్వంతో జరిగిన అనేక చర్చలలో దీనిని పునరుద్ఘాటించామని, ప్రభుత్వం ఈ అంశంపై చర్చించడానికి సిద్ధంగా ఉందని ప్రకటించినప్పటికీ, అటువంటి చర్చకు ఇంకా తేదీని నిర్ణయించలేదని ఎంపిలు ఆ లేఖలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ ఓటు హక్కు, స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికల నిర్వహణపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని ప్రతిపక్ష ఎంపిలు పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరిగితే సభ్యులు స్పష్టత కోరడానికి,త పారదర్శకత, జవాబుదారీతనం నిర్ధారించడానికి వీలు కలుగుతుందన్నారు. అందువల్ల కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణపై మరింత ఆలస్యం చేయకుండా ప్రత్యేక చర్చను షెడ్యూల్ చేయాలని తాము మిమ్మల్ని కోరుతున్నామని బిర్లాకు రాసిన లేఖలో ఎంపిలు పేర్కొన్నారు.

# ఆటంబాంబు ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కాంప్లెక్స్‌లో విలేకరులతో రాహుల్ అన్నారు. ఈ విషయం తాను తేలికగా చెప్పడం లేదని, 100 శాతం రుజువుతోనే చెబుతున్నానన్నారు. తాము దానిని విడుదల చేసిన వెంటనే ఇసి 'ఓటు చోరి'లో పాల్గొంటోందని దేశం మొత్తానికి తెలుస్తుందని, అది బిజెపి కోసం చేస్తోందని ఆరోపించారు. 2023లో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, తర్వాత గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల అక్రమాలపై తమ పార్టీకి అనుమానాలు ఉన్నాయని, ఇది మహారాష్ట్రలో మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర స్థాయిలో (మహారాష్ట్రలో) ఓట్ల దొంగతనం జరిగిందని తాము నమ్ముతున్నామని, ఓటర్ల సవరణ జరగగా, కోట్ల మంది ఓటర్లు చేర్చబడ్డారని, దీనిపై లోతుగా పరిశీలించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో సొంత దర్యాప్తును పూర్తిచేశామని, దీనికి ఆరు నెలల సమయం పట్టిందన్నారు. ఈ ప్రక్రియలో అనుబాంబును కనుగొన్నామని, అది పేలినప్పుడు ఇసి దాక్కోవడానికి దేశంలో ఎక్కడా స్థలం దొరకకపోవచ్చన్నారు. ఇది రాజద్రోహమని, అంతకంటే తక్కువేమీ కాదన్నారు. ఇసి అధికారులు పదవీ విరమణ చేసి ఉండవచ్చు, మరొక్కడానైనా ఉండవచ్చు, వారిని కనుగొంటామన్నారు. కాగా, ఆగస్టు 5న కర్ణాటక ఎన్నికల కమిషన్ చేసిన 'ఓటరు జాబితాల దారుణమైన రిగ్గింగ్'ను బహిర్గతం చేస్తామని కాంగ్రెస్ గురువారం తెలిపింది. అలాంటి ఎన్నికల దుర్వినియోగాలను అదుపు చేయకుండా ఉండనివ్వబోమని పేర్కొంది. ఈ మోసానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ నేతృత్వంలో బెంగళూరులో భారీ నిరసన కార్యక్రమాన్ని పార్టీ ప్లాన్ చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. ఈ నిరసనకు సన్నాహాలు సమీక్షించిన తర్వాత, వేణుగోపాల్, 'ఆగస్టు 5న, కర్ణాటక ఎన్నికల సంఘం చేసిన ఓటరు జాబితాల దారుణమైన రిగ్గింగ్‌ను మేము బహిర్గతం చేస్తాము' అని అన్నారు.

**బెదిరింపులను పట్టించుకోబోం: ఇసి**

బిజెపి కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడినట్లు తమ వద్ద అణుబాంబు ఆధారాలు ఉన్నాయని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈసీ స్పందించింది. అవన్నీ నిరాధారమైన ఆరోపణలే అని ఖండించింది. ఇలా రోజూ వచ్చే బెదిరింపులను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. ఇలాంటి బాధ్యతారహిత వ్యాఖ్యలను పట్టించుకోవద్దని ఎన్నికల అధికారులకు సూచించింది. పారదర్శకంగా పనిచేస్తూనే ఆరోపణలను విస్మరించాలని అధికారులకు ఇసి తెలిపింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com